www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 4-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 229 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: తదియ మ. 1.11 తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాషాఢ సా. 5.15 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 1.18-2.55; దుర్ముహూర్తం: ఉ. 11.43-12.27; అమృతఘడియలు: మ. 12.20-1.58; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్



నిధుల మళ్లింపుపై ప్రభుత్వం చర్యలు

ఎస్సీ, ఎస్టీ సదస్సుల పేరిట స్వాహా.. 'అగ్ని'లో అవినీతిపైనా వేటు

అధికార దుర్వినియోగం, ప్రజాధనం స్వాహా చేశారన్న సీఎస్

అనుమతి లేకుండా బెజవాడ దాటొద్దని ఆదేశాలు

సంజయ్‌పై త్వరలో సమగ్ర విచారణ!

2

బెదిరించి.. భయపెట్టి.. కొట్టేశారు!

కాకినాడ పోర్టు, సెజ్‌లను మా నుంచి లాక్కున్నారు

సీఐడీకి వాటి యజమాని కేవీరావు ఫిర్యాదు

నాడు కుట్రపూరితంగా 'తనిఖీల' నాటకం

రూ.994 కోట్లు ఎగ్గొట్టినట్లు తప్పుడు నివేదిక

వైవీ తనయుడు విక్రాంత్‌తో మాట్లాడాలని సాయిరెడ్డి ఫోన్.. వాటాలు వదులుకోకుంటే జైలుకే అన్న విక్రాంత్

పోర్టులో 2500 కోట్ల విలువైన మా వాటాకు 494 కోట్లు

సెజ్‌లో రూ.1104 కోట్ల షేర్లకు గాను రూ.12 కోట్లే

'పెద్దమనసు'తో ఇచ్చేశామని జగన్‌కు విక్రాంత్ కబుర్లు

అన్యాయం గురించి చెబుతున్నా వినని నాటి సీఎం

విక్రాంత్‌రెడ్డి చెప్పినట్లు చేయాలని హుకుం

పది పేజీల ఫిర్యాదులో వివరించిన కేవీ రావు

విక్రాంత్, సాయిరెడ్డి, అరబిందోలపై కేసు నమోదు



కేవీ రావు

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెదిరించడం, భయపెట్టడం, వేధించడం... గత్యంతరంలేని పరిస్థితుల్లోకి నెట్టి భారీ ప్రాజెక్టులను కారుచౌకగా దక్కించుకోవడం! వైసీపీ జమానాలో జరిగిన తంతు ఇది! కాకినాడ పోర్టు, కాకినాడ సెజ్ కూడా ఇలాగే చేతులు మారినట్లు ఇప్పటికే బలమైన అనుమానాలున్నాయి. ఇప్పుడు... స్వయంగా బాధితుడు కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీరావు) నోరు తెరిచారు. నాడు జరిగిన అన్యాయంపై

మిగతా 12వ పేజీలో...



మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రులు

వీరే నిందితులు..

ఏ1) వై.విక్రాంత్ రెడ్డి (వైవీ సుబ్బారెడ్డి కుమారుడు)



ఏ1

ఏ2) విజయసాయిరెడ్డి, వైసీపీ ఎంపీ

ఏ3) శరత్ చంద్రారెడ్డి, విజయసాయి అల్లుడు



ఏ2 సాయిరెడ్డి

ఏ4) పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీ



ఏ3 శరత్ చంద్రారెడ్డి

ఏ5) అరబిందో రియాల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రైవేట్ లిమిటెడ్ (డైరెక్టర్లు కూడా)

ఏ5 AUROBINDO

మారిటైం హబ్‌గా ఏపీ

రాజధాని అమరావతి పనులకు 11,467 కోట్లతో కొత్త టెండర్లు

ఐటీ, జీసీసీ, టెక్స్ టైల్, అపెరల్, రియల్‌టైమ్ గవర్నెన్స్ 4.0లకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం

గ్లోబల్ టాలెంట్ హబ్‌గా ఏపీ

బహుళజాతి సంస్థలకు ప్రోత్సాహకాలు

ఐటీకి ఫాస్ట్ ట్రాక్ అనుమతులు

కేపిటల్ సబ్సిడీగా 50% రాయితీ

రోజంతా తాగునీరు

డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా సాగునీరు

పారిశ్రామిక అవసరాలూ తీర్చాలి

జల విధానానికి సీఎం ఓకే

13 14

అంతులేని దోపిడీ

అరబిందో కోసం చరిత్రలో చూడని దారుణాలు

10% చేతిలో పెట్టి మెజారిటీ వాటా లాక్కొన్నారు

మంత్రివర్గ భేటీలో సీఎం చంద్రబాబు ఆగ్రహం

ఈ కబ్జాలన్నింటినీ నిగ్గు తేలుస్తామని స్పష్టీకరణ

కబ్జా భూముల విలువే 5-6 వేల కోట్లన్న మంత్రులు

పోర్టును ప్రైవేటు సామ్రాజ్యంలా మార్చారన్న పవన్

కాకినాడ ఉదంతాన్ని వివరించిన డిప్యూటీ సీఎం

జల్ జీవన్ అమలులో జాప్యంపై బాబు ఆగ్రహం

కొందరు అధికారుల్లో బద్ధకం తగ్గడం లేదని వ్యాఖ్య

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్టు, కాకినాడ సెజ్‌ల్లో జగన్ టీమ్ బలవంతపు కబ్జాలపై సీఐడీ విచారణ జరిపించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించినట్లు సమాచారం. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో తన అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా అంశం మంత్రివర్గ సమావేశంలో

మిగతా 13వ పేజీలో...

ఇళ్ల పట్టాలు రెడీ! లబ్ధిదారులూ ఉన్నారు! కానీ... వచ్చి పట్టాలు తీసుకొమ్మంటే రావడమే లేదు! ఒకటీ రెండూ కాదు... ఏకంగా 9.2 లక్షల పట్టాలు అలా పక్కన పడి ఉన్నాయి! ఆ లబ్ధిదారులు లేరా? ఉంటే ఎందుకు పట్టాలు తీసుకోవడంలేదు? లేక... వారంతా బినామీలు, అర్హతలేని వైసీపీ కార్యకర్తలా? అసలైన లబ్ధిదారులైతే పట్టాలు ఎందుకు తీసుకోరు? ఇవీ ఇప్పుడు తలెత్తుతున్న ప్రశ్నలు!

పట్టాలున్నా... పత్తాలేరు!

ఇళ్ల పట్టాల పథకంలో 'జగన్మాయ'

28 లక్షల మందికి స్థలాలిచ్చినట్లు గొప్పలు

ఇప్పటికీ డీడ్‌లు తీసుకోని 9.2 లక్షల మంది

వారంతా బినామీలు, వైసీపీ కార్యకర్తలేనా?

గుట్టు రట్టవుతుందనే గప్‌చుప్ అయ్యారా?

అనర్హుల ఎంపికపై భారీగా ఫిర్యాదులు

6.5 లక్షల మంది ఇతర పథకాల లబ్ధిదారులు

వారినీ తమ ఖాతాల్లోనే కలుపుకొన్న జగన్

సీఎంకు రెవెన్యూ మంత్రి నివేదిక

సమగ్ర దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇళ్ల స్థలాల పేరుతో జగన్ జమానాలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు! అక్కరకు రాని భూములను అడ్డగోలు ధరలకు కొనుగోలు చేసి... పార్టీ నేతలకు కోట్లు దోచి పెట్టారు. ఎకరం పది లక్షలు కూడా పలకని భూములను ఐదారు కోట్లకు కొన్నారు. ఇదో భారీ కుంభకోణం! ఇప్పుడు ఇందులో మరో కోణం బయటికి వచ్చింది. వైసీపీ కార్యకర్తలు, నేతల బినామీల పేరుతో భారీగా ఇళ్ల పట్టాలు కేటాయించినట్లు తెలుస్తోంది. మళ్లీ జగనే వచ్చి ఉంటే... వారంతా దర్జాగా పట్టాలు తీసుకుని ఉండేవారు. కానీ... సర్కారు మారడంతో గప్‌చుప్‌గా ఉండిపోయారు. 28 లక్షల మంది పేదలకు పట్టాలు (కన్వేయెన్స్ డీడ్స్) ఇచ్చామని నాటి ప్రభుత్వం చాలా ఘనంగా చెప్పింది. వాటికి సంబంధించిన బిల్లులు కూడా సెటిల్ చేసింది. కానీ... ఈ నాటి వరకు 9.2 లక్షల మంది ప్రభుత్వం వద్దకు వచ్చి తమకు కేటాయించిన కన్వేయెన్స్ డీడ్‌లు తీసుకోలేదు. కూటమి సర్కారు వచ్చి ఆరు నెలలు కావొస్తోంది. అయినా... అన్ని లక్షల మంది తమ పట్టాలు ఎందుకు తీసుకోవడంలేదన్నదే ప్రశ్న! దీంతో... జిల్లాల వారీగా 'లబ్ధిదారుల' జాబితాలను ప్రాథమికంగా

మిగతా 14వ పేజీలో...

స్నానం చేయించేందుకూ యంత్రం

» జపాన్‌కు చెందిన షవర్ హెడ్ సంస్థ ఆవిష్కరణ



న్యూఢిల్లీ, డిసెంబరు 3: తువ్వాలు తీసుకుని స్నానాల గదిలోకి వెళ్లి.. బకెట్‌లో నీళ్లు పట్టుకుని.. శరీరం మీద నీళ్లు పోసుకుని, సబ్బు రుద్దుకుంటూ.. వీపు అందక అవస్థలు పడుతూ.. స్నానం చెయ్యడానికి ప్రతి రోజూ చిరాకు పడుతున్నారా? దుస్తులను ఉతికి ఆరేసే యంత్రాలు, పాత్రలు, పళ్లాలను కడిగి ఆరేసే యంత్రాల మాదిరిగా మనుషులకు స్నానం చేయించే యంత్రాలు కూడా ఉంటే బాగుండు అనుకున్నారా? అయితే ఇది మీకోసమే.. జపాన్‌కు చెందిన షవర్ హెడ్ తయారీ సంస్థ సైన్స్ కో.. మార్కెట్‌లోకి 'హ్యూమన్ వాషింగ్ మెషీన్'ను తీసుకొస్తుంది. ఓ ప్రత్యేక గదిలా ఉండే ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్ మధ్యలో ఉండే కుర్చీలో ఓ 15 నిమిషాలు కూర్చుంటే చాలు. ఆ యంత్రం స్నానం చేయించడమే కాదు శరీరాన్ని ఆరబెట్టి పంపించేస్తుంది. కృత్రిమ మేధ(ఏఐ)తో పని చేసే ఇందులోని సాంకేతికత.. లోపల ఉన్న మనిషి శరీర ఉష్ణోగ్రతలు, ఇతర ప్రమాణాలను లెక్కించి తగిన ఉష్ణోగ్రతతో నీటిని విడుదల చేసి శుభ్రంగా స్నానం చేయించి ఆపై శరీరం ఆరేలా చేస్తుంది. వచ్చే ఏప్రిల్‌లో జరగనున్న ఒసాకా కాన్సయి ఎక్స్‌పోలో సైన్స్‌కో సంస్థ ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్‌ను ప్రదర్శించనున్నారు.

ఎన్నికల కమిషనర్ల నియామకంపై

విచారణ నుంచి తప్పుకొన్న సీజేఐ

న్యూఢిల్లీ, డిసెంబరు 3: ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ నుంచి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా మంగళవారం తప్పుకొన్నారు. గతంలో ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య సంఘం ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసింది. గత ఏడాది చట్టాన్ని సవరిస్తూ ఆ సంఘం నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఆ స్థానంలో సీనియర్ కేబినెట్ మంత్రిని నియమించారు. దీనిని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌ల ధర్మాసనం.. సమాధానం చెప్పాలని ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రభుత్వాలకు నోటీసులు పంపింది. తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది. ఈ సందర్భంగానే విచారణ నుంచి తప్పుకొంటున్నట్టు సీజేఐ జస్టిస్ ఖన్నా ప్రకటించారు.

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్



న్యూఢిల్లీ, డిసెంబరు 3: ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ మన్మోహన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించడానికి కేంద్రప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అర్జున్ మేఘ్వాల్ వెల్లడించారు. సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్‌ను నియమించాలంటూ కొలీజియం నవంబరు 28న కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 కాగా, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హిమాకోహ్లీ పదవీ విరమణతో జడ్జిల సంఖ్య 32కు పడిపోయింది, జస్టిస్ మన్మోహన్ ప్రమాణ స్వీకారం చేస్తే 33కు పెరుగుతుంది. కాగా, జస్టిస్ మన్మోహన్ 2008 మార్చి 13న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2023 నవంబరు 9న సీజేగా పదోన్నతి పొందారు.

హౌతీల దాడి వేళ అసాధారణ సాహసం..

ఐఎన్‌ఎస్ విశాఖపట్నం సిబ్బందికి అవార్డు

» లండన్‌లో అందుకున్న కెప్టెన్ అవిలాశ్ రావత్

లండన్, డిసెంబరు 3: భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌక ఐఎన్‌ఎస్ విశాఖపట్నం సిబ్బందికి అరుదైన గౌరవం దక్కింది. ఈ నౌక కెప్టెన్ అవిలాష్ రావత్, ఆయన సిబ్బందిని.. సముద్రంలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికిచ్చే ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంవో) అవార్డు వరించింది. ఎర్ర సముద్రంలో బ్రిటన్ వాణిజ్య నౌకపై హౌతీలు క్షిపణి దాడి చేసిన సమయంలో ఐఎస్ఎస్ విశాఖపట్నం సిబ్బంది చూపించిన అసాధారణ ధైర్య సాహసాలకు గానూ ఈ అవార్డు దక్కింది. లండన్‌లోని ఐఎంవో ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కెప్టెన్ అవిలాష్ రావత్ తన సిబ్బంది తరఫున ఈ అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో బ్రిటన్ నౌకపై హౌతీలు క్షిపణి దాడి చేశారు. ఆ నౌక కెప్టెన్ నుంచి అత్యవసర సందేశం రావడంతో ఐఎన్‌ఎస్ విశాఖ వెంటనే స్పందించింది. కెప్టెన్ అవిలాష్ రావత్, ఆయన సిబ్బంది ఐదు గంటలపాటు శ్రమించి మార్లిన్ లువాండాలో మంటలను అదుపు చేసి, అందులోని సిబ్బందిని కాపాడారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వైద్య విద్యార్థుల మృతి

అలప్పుజ డిసెంబరు 3: కేరళలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ కారు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో కారులోని అయిదుగురు వైద్య విద్యార్థులు దుర్మరణం పాలవ్వగా మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులోని కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కాలర్‌కోడ్ సమీపం సోమవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఏడుగురు విద్యార్థులు కారులో సినిమాకు వెళ్తుండగా మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయిన క్రమంలో ప్రమాదం జరిగింది. విద్యార్థులు వందనమ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతున్నారు.

అలకవీడిన శిందే.. హోంను వదిలేసేందుకు సై

ముంబై, డిసెంబరు3: మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే అలకవీడారు. థానే ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుని ముంబై చేరుకున్న శిందేను ఆయన అధికారిక నివాసంలో బీజేపీ సీనియర్ నేత ఫడణవీస్ కలిశారు. మంత్రిత్వ శాఖల కేటాయింపులపై చర్చించారు. హోం మంత్రిత్వ శాఖపై శిందే పట్టు వీడారు. డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేసేందుకు అంగీకరించారు. పట్టణాభివృద్ధి శాఖతో పాటు ఇతర కీలక శాఖలు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవి కూడా ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు తెలిసింది. బీజేపీకి 22, శివసేనకు 12, ఎన్సీపీకి 10 మంత్రి పదవులు దక్కనున్నాయి. కీలకమైన ఆర్థిక శాఖతో పాటు డిప్యూటీ స్పీకర్ తమకే ఇవ్వాలన్న ఎన్సీపీ డిమాండ్‌ను బీజేపీ అంగీకరించినట్లు సమాచారం. ఈ రోజు ఉదయం 10గంటలకు ముంబైలోని విధానసభ సెంట్రల్ హాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు పార్టీ శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటారు. శాసనసభాపక్ష నేతగా ఫడణవీస్‌ను ఎన్నుకుంటారని, ఆయనే సీఎంగా ప్రమాణం చేస్తారని సమాచారం. రేపు సాయంత్రం 5 గంటలకు ముంబై ఆజాద్ మైదానంలో కొత్త సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంల ప్రమాణం ఉంటుంది.

సంభల్ హింస వెనక కుట్ర!

యూపీలో ఉప ఎన్నికల నేపథ్యంలో వివాదం

» మతసామరస్యాన్ని దెబ్బతీస్తోన్న బీజేపీ

» లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ విమర్శ

» అదానీ అంశంపై పార్లమెంటు ప్రాంగణంలో విపక్ష ఎంపీల నిరసన



న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూపీలోని సంభల్‌లో చెలరేగిన హింస వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, బీజేపీ జపిస్తున్న 'తప్పకాల మంత్రం' దేశంలో మతసామరస్యాన్ని దారుణంగా దెబ్బతీస్తోందని సమాజ్‌వాదీపార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. యూపీలో ఇటీవలి ఉప ఎన్నికల నేపథ్యంలోనే.. సంభల్‌లో మసీదు వివాదాన్ని ముందుకు తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో అఖిలేశ్ మాట్లాడారు. 'నవంబరు 13వ తేదీన జరగాల్సిన యూపీ ఉప ఎన్నికలను నవంబరు 20వ తేదీకి వాయిదా వేశారు. షాహీ జామామసీదులో సర్వే జరపాలంటూ దాఖలైన పిటిషన్ మీద.. మసీదు కమిటీ వాదనలు సైతం వినకుండా సర్వేకు అనుకూలంగా నవంబరు 19న స్థానిక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొన్ని గంటల్లోనే అధికారులు అక్కడికి చేరుకొని సర్వే జరిపారు. మసీదులోని వారందరూ సహకరించారు. 29న కోర్టులో విచారణ జరగాల్సి ఉంది. కానీ, 24న అధికారులు మరోసారి సర్వే జరుపుతామంటూ మసీదుకు వచ్చారు. కోర్టు ఉత్తర్వులు లేకుండా ఎలా జరుపుతారంటూ.. ముస్లిం సంఘాలు అభ్యంతరం తెలిపాయి. అయినప్పటికీ, అధికారులు నిరంకుశంగా సర్వే జరిపారు. ఈ సందర్భంగా ఓ పోలీసు అధికారి స్థానికులను దుర్భాషలాడుతూ లాఠీచార్జీకి ఆదేశించారు. కోపోద్రిక్తులైన యువకులు కొందరు రాళ్లు విసిరారు. దీంతో పోలీసులు కాల్పులు జరిపి ఐదుగురిని చంపివేశారు' అని అఖిలేశ్ తెలిపారు. అమాయకులను పొట్టనపెట్టుకున్న పోలీసులను ఉద్యోగాల్లోంచి తొలగించి, వారిపై హత్య కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నికల్లో యూపీ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడిందని, ముస్లింలను పలు ప్రాంతాల్లో ఓటు వేయకుండా అడ్డుకున్నారని.. ఇదంతా బయటకు రావొద్దనే ఉద్దేశంతోనే సంభల్‌లో హింసను రెచ్చగొట్టారని ఆరోపించారు. అంతకుముందు, సంభల్ అంశంపై చర్చకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. కొద్దిసేపు వాకౌట్ చేశారు. కాగా మంగళవారం సైతం అదానీ అంశంపై విపక్షాలు పట్టుబట్టాయి. ప్రశ్నోత్తరాలను ప్రారంభిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా చెప్పగానే ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. అదానీ అంశంపై తక్షణమే చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీనికి స్పీకర్ అంగీకరించకపోవడంతో నిరసన వ్యక్తంచేస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష నేతలు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఇండియా కూటమి పార్టీలైన ఎస్పీ, టీఎంసీ పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది.

ఇందిరాగాంధీ ప్రస్తావనతో గందరగోళం

బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లుపై లోక్‌సభలో చర్చ జరుగుతున్న సమయంలో.. ఇందిరాగాంధీ హయాంలో తనకు నచ్చినవారికి బ్యాంకు రుణాలు ఇవ్వాలని మేనేజర్లను ఆదేశించారని ఎంపీ సంబిత్ పాత్ర ఆరోపించారు. ఇలాంటి చర్యల కారణంగానే దేశంలో నిరర్థక ఆస్తులు, తిరిగి చెల్లించని రుణాలు పెరిగాయన్నారు. మోదీ హయాంలో తెచ్చిన చట్టాలతో బ్యాంకింగ్ వ్యవస్థ మళ్లీ గాడిలో పడిందన్నారు. దీనిపై విపక్షాలు పెద్దఎత్తున అభ్యంతరం తెలిపాయి. సంబిత్ పాత్ర హద్దులు దాటి మాట్లాడుతున్నారని కేసీ వేణుగోపాల్ అన్నారు. ఇందిరాగాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, పాకిస్థాన్‌పై యుద్ధం చేసి గెలుపొందారని చెప్పారు. స్పీకర్ జోక్యంతో సభ శాంతించింది.

ఇలాగైతే వారాంతాల్లోనూ సభ: ఓం బిర్లా

ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యులు పెద్దఎత్తున నినాదాలు చేయడంతో స్పీకర్ ఓంబిర్లా అసహనం వ్యక్తం చేశారు. వాయిదాల కారణంగా సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగితే, ఆ సమయాన్ని భర్తీ చేయడానికి వారాంతాల్లోనూ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందని సభ్యులను హెచ్చరించారు. సభ కార్యకలాపాలను వాయిదా వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

ఇకపై నలుగురు నామినీలు!

» బ్యాంకు ఖాతాదారులకు వెసులుబాటు

» బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 3: బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ఐదు చట్టాల్లో సవరణలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏటికేడు బ్యాంకింగ్ రంగం పరిణామం చెందుతున్న క్రమంలో బ్యాంకుల పాలనా వ్యవహారాలను మెరుగుపర్చడం, పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం 'బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు-2024'ను తీసుకొచ్చినట్లు తెలిపింది. తాజా సవరణలతో బ్యాంకింగ్ రంగంలో పాలనా వ్యవహారాలు పటిష్ఠమవడంతో పాటు ఖాతాదారుల సౌలభ్యం పెరుగుతుందని, పెట్టుబడిదారులకు రక్షణ కల్పించినట్లవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. మంగళవారం ఆమె 'బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు-2024'ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఐదు బ్యాంకింగ్ చట్టాల్లో మొత్తం 19 సవరణలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ బిల్లును లోక్‌సభ మూజువాణీ ఓటుతో ఆమోదించింది. అయితే, భారత బ్యాంకింగ్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించేందుకే ఈ బిల్లును తెస్తున్నారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ వాటాను 51 నుంచి 26 శాతానికి తగ్గించాలన్నదే కేంద్రం ఉద్దేశమని ఆరోపించారు.

బ్యాంకింగ్ బిల్లులో కీలక ప్రతిపాదనలివే..

బ్యాంకు ఖాతాదారులు ప్రస్తుతం ఒక నామినీని మాత్రమే ఎంచుకునే వీలుండగా.. ఇకపై నలుగురిని నామినీలుగా ఎంచుకోవచ్చు.

క్లెయిమ్ చేసుకోని డివిడెండ్లు, షేర్లు, బాండ్ల ఉపసంహరణ నిధులను 'ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్)'లోకి బదిలీ చేసుకోవచ్చు. ఈ ఫండ్ నుంచి వినియోగదారులు సొమ్ములను బదిలీ/రీఫండ్ చేసుకోవచ్చు. మదుపరుల ప్రయోజనాలను రక్షించేందుకే ఈ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

బ్యాంకుల్లో డైరెక్టర్ పదవిని ఆశించే వారి కనీస వాటా ప్రస్తుత చట్టాల ప్రకారం బ్యాంకుల ఈక్విటీలో రూ.5 లక్షలుగా ఉండగా.. ఆ పరిమితిని రూ.2 కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఈ మొత్తాన్ని 60 ఏళ్ల కిందట నిర్ధారించినందున తాజాగా పెంచాలని నిర్ణయించారు.

సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలాన్ని 8 నుంచి పదేళ్లకు పెంచారు.

ఆడిటర్లకు ఇవ్వాల్సిన పారితోషికాన్ని నిర్ణయించడంలో బ్యాంకులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు.

లోకం తీరు



రాజ్యసభలో కొత్త ఏవియేషన్ బిల్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 3: పౌర విమానయాన సంస్థకు సంబంధించిన కొత్త ఏవియేషన్ బిల్లును ఆ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. 90 ఏళ్లనాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో భారతీయ వాయుయాన్ విధేయక్-2024 బిల్లును కేంద్రం తీసుకువచ్చింది. ఈ ఏడాది ఆగస్టులోనే ఇది లోక్‌సభ ఆమోదం పొందింది. తాజాగా ఈ బిల్లును రాజ్యసభలోనూ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ(ఐసీఏవో) సూచనల మేరకు ఎయిర్‌క్రాఫ్ట్ చట్టాన్ని సవరించామన్నారు. డీజీసీఏకు వివిధ సెక్షన్ల కింద మరిన్ని అధికారాలను దఖలు పరుస్తూ ఈ బిల్లును రూపొందించామన్నారు. మరోవైపు, పీఎం సూర్య ఘర్ పథకానికి ఇప్పటి వరకు 26.38 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని కేంద్రం తెలిపింది. ఇందులో 6.34 లక్షల ఇళ్లకు సౌర ఫలకాలు ఇన్‌స్టాలేషన్ పూర్తయిందని వివరించింది. ఇంటి పైకప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసి ఉచిత సౌర విద్యుత్‌ను అందించేందుకు కేంద్రప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించింది.

హిందీ నేర్చుకుంటానంటే ఎగతాళి

న్యూఢిల్లీ, డిసెంబరు 3: విద్యార్థి దశలో తాను హిందీ నేర్చుకుంటానంటే ఎగతాళి చేసేవారిని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు. తన చిన్నతనంలో తమిళనాడులో నెలకొన్న పరిస్థితులను మంగళవారం ఆమె లోక్‌సభలో గుర్తుకు తెచ్చుకున్నారు. బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు హిందీ వినియోగంపై ఆమెను ఇరుకున పెట్టే ప్రశ్నలు వేశారు. దీనిపై ఆమె సమాధానం ఇస్తూ.. 'తమిళనాడులో ఉంటూ ఉత్తరాది భాష నేర్చుకుంటుందట అంటూ వీధుల్లోనే నన్ను ఎగతాళి చేసేవారు. హిందీ, సంస్కృతాలను విదేశీ భాషలుగా భావించేవారు. నన్నయితే 'పంధేరి' (పరదేశి) అనేవారు. హిందీని బలవంతంగా రుద్దవద్దని అంటున్నారు..సరే! మరి, హిందీ నేర్చుకోవాలన్న నా ప్రాథమిక హక్కును ఎలా అణచివేస్తారు" అని విపక్ష సభ్యులను ప్రశ్నించారు.

సీఐడీ మాజీ ఏడీజీ సంజయ్ సస్పెన్షన్

» నిధులు మళ్లింపుపై ప్రభుత్వం చర్యలు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ ఏడీజీ ఎన్. సంజయ్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. జగన్ హయాంలో సంజయ్ సీఐడీ అదనపు డీజీగాను, ఏపీ విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సంస్థ డీజీగాను పనిచేశారు. ఈ సమయంలో ఆయా విభాగాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లోనే తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సంజయ్ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ, రూల్ 1969లోని నిబంధన3(1) కింద సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేసింది. అగ్ని విభాగం డీజీగా ఆయన ఉండగా.. అగ్ని-ఎన్‌వోసీ టెండర్ల ప్రక్రియలో అక్రమాలతోపాటు నిబంధనల అమలులో అవకతవకలకు పాల్పడినట్టు విజిలెన్స్ విభాగం గుర్తించింది. వైసీపీ ప్రభుత్వం హయాంలో అగ్ని పోర్టల్‌లో ఎన్‌వోసీ, హార్డ్‌వేర్ సరఫరా కోసం రూ.2.29కోట్ల ఒప్పందాన్ని సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంజయ్ కట్టబెట్టారు. 2023 ఫిబ్రవరి 23న చేసుకున్న ఒప్పందం ప్రకారం రూ.59.93లక్షలు ముందస్తుగా చెల్లింపులు జరిగాయి. అయితే ఏప్రిల్ 2023నాటికి కేవలం 14శాతం మాత్రమే ప్రాజెక్టు పూర్తి అయినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఇది కాంట్రాక్టు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీంతోపాటు మైక్రోసాఫ్ట్ లాప్‌ట్యాప్‌లు, యాపిల్ ఐప్యాడ్‌ల వంటి పరికరాలను అగ్నిమాపక అధికారుల కోసం ఈ టెండర్ ప్రక్రియ లేకుండా ఆ విభాగం డీజీ హోదాలో సంజయ్ కొనుగోలు చేశారు. ఈ మొత్తంలో రూ.17.89లక్షల మేరకు అధిక ధరలకు చెల్లింపులు జరిగినట్లు ప్రభుత్వం తాజాగా జారీ చేసిన సంజయ్ సస్పెన్షన్ ఆదేశాల్లో పేర్కొంది. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది.

ఎస్సీ, ఎస్టీ అవగాహన సదస్సుల్లో అక్రమాలు..

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అవగాహన సదస్సుల నిర్వహణకు సంబంధించి 1.19 కోట్ల బడ్జెట్‌ను గత ప్రభుత్వం కేటాయించింది. ఈ కార్యక్రమాలను కృతి వ్యాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న కంపెనీ ద్వారా నిర్వహించారు. కానీ ఈ కంపెనీ చూపించిన రిజిస్టర్ అడ్రస్‌లో లేదు. వాస్తవానికి ఈ సదస్సులకు అయిత ఖర్చు కేవలం 3.10లక్షలు మాత్రమేనని విజిలెన్స్ తేల్చింది. అయితే, ఊరూపేరు లేని కంపెనీ ముసుగులో అదనంగా రూ. 1.15 కోట్లు దుర్వినియోగం చేశారని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి.. అసలు టెండర్ల ప్రక్రియలో భాగంగా పత్రికల్లో ప్రకటనలు, టెండర్ల టెక్నికల్ బిడ్లను సమీక్షించలేదని గుర్తించింది. అతి తక్కువ సమయంలోనే టెండర్లు ఆమోదం తెలిపి ఒకే అడ్రస్‌లో ఉన్న కృతి వ్యాప్, సౌత్రికా టెక్నాలజీస్‌కు కట్టబెట్టడం మరింత అనుమానాస్పదంగా ఉంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఆధారంగా అనుమానాస్పద సంస్థలకు ఒప్పందాలు ఇవ్వడంతో బాధ్యుడిగా సంజయ్‌ని గుర్తించిన ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. అధికార దుర్వినియోగం, ప్రజాధనం స్వాహా, ప్రభుత్వ నిబంధనల అతిక్రమణ కింద చర్యలు చేపట్టినట్లు సీఎస్ నీరబ్ కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా విజయవాడ దాటి వెళ్లకూడదని ఆదేశించారు. ఈ ఆరోపణలపై మరింత స్పష్టత కోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ చేపట్టబోతోంది.

స్వర్ణ దేవాలయానికి

కాపలాదారుగా సుఖ్‌బీర్

» మెడలో పలక, చేతిలో ఈటెతో శిక్షను అనుభవించిన మాజీ డిప్యూటీ సీఎం



న్యూఢిల్లీ, డిసెంబరు 3: పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ నాయకుడు, 62 ఏళ్ల సుఖ్‌బీర్ సింగ్ బాదల్.. సిక్కుల అత్యున్నత విచారణ సంఘం.. 'అకాల్ తఖ్త్' తీర్పును శిరసావహించారు. సుఖ్‌బీర్ అధికారంలో ఉన్న సమయంలో చేసిన తప్పులపై విచారణ జరిపిన అకాల్ తఖ్త్ ఆయనను దోషిగా నిర్ధారించింది. ఆయా తప్పులను సుఖ్‌బీర్ కూడా అంగీకరించారు. ఈ నేపథ్యంలో అకాల్ తఖ్త్ సుఖ్‌బీర్‌కు, మాజీ మంత్రులకు పలు శిక్షలు విధించింది. ఈ క్రమంలో సుఖ్‌బీర్ సహా వారంతా మంగళవారం ఉదయం స్వర్ణ దేవాలయానికి చేరుకుని శిక్షలు అనుభవించారు. 62 ఏళ్ల సుఖ్‌బీర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన కుడికాలికి దెబ్బ తగలడంతో వైద్యులు పెద్ద కట్టు వేశారు. దీంతో వీల్ చైర్‌కే ఆయన పరిమితమయ్యారు. అయినప్పటికీ.. మంగళవారం ఉదయం వీల్ చైర్‌లోనే స్వర్ణదేవాలయానికి చేరుకుని.. మెడలో పలక వేసుకుని(చేసిన తప్పులు పేర్కొంటూ), చేతిలో ఈటె పట్టుకుని దేవాలయం ప్రధాన ద్వారం ముందు కాపలాదారుగా కూర్చున్నారు. మరో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బిక్రమ్ సింగ్ మజీతియా సహా పలువురు మాజీ మంత్రులు స్వర్ణ దేవాలయంలో అంట్లు తోమారు. మరికొందరు మరుగు దొడ్లను శుభ్రపరిచారు. అనంతరం అక్కడే స్నానాలు చేసి మధ్యాహ్నం గురుద్వారాకు వచ్చిన భక్తులకు ఆహారం వడ్డించి, వారు తిన్న ప్లేట్లను శుభ్రపరిచారు.

ఎందుకీ శిక్షలు?

2007-2017 మధ్య తాము అధికారంలో ఉన్నప్పుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్.. 2015లో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌కు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా గుర్మీత్ సిక్కుల గురువుగా వస్త్రధారణ చేసి కీలకమైన ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది పెను వివాదానికి, ఘర్షణలకు కూడా దారి తీసింది. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకున్న సుఖ్‌బీర్ మంత్రివర్గం గుర్మీత్‌ను క్షమించి వదిలి వేసింది. దీనిపై విచారణ జరిపిన అకాల్ తఖ్త్ ముందు సుఖ్‌బీర్ సహా అప్పటి మంత్రులు తమ తప్పులను అంగీకరించారు. అంతేకాదు, సుఖ్‌బీర్ తండ్రి, మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్‌కు 2011లో ఇచ్చిన ఫకర్-ఎ-ఖ్వామ్(సిక్కులకు గర్వకారణం) అనే బిరుదును అకాల్ తఖ్త్ ఉపసంహరించుకుంది.

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

» '1972' కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వండి

» ప్రజలకు ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ పిలుపు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి ఎగుమతులు, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు 'ఈగల్' చీఫ్ ఆకే రవికృష్ణ తెలిపారు. నరసరావుపేటలో ఎక్సైజ్ శాఖ అధికారులు 400 గంజాయి చాక్లెట్లు సీజ్ చేసిన నేపథ్యంలో ఆయన మంగళవారం పట్టణానికి వచ్చారు. పకడ్బందీ ఆపరేషన్‌తో గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులను అభినందించారు. రవికృష్ణ మీడియాతో మాట్లాడుతూ గంజాయి విక్రయాలు, వినియోగంపై 1972కు సమాచారం ఇస్తే, వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈగల్ విభాగానికి సమాచారం ఇవ్వడం ద్వారా.. గంజాయి, మాదకద్రవ్యాలను అరికట్టేందుకు సహకరించాలని రవికృష్ణ ప్రజలను కోరారు. గంజాయి చాక్లెట్ల తయారీపై వివరాలు తెలుసుకుంటామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు సమాజాన్ని అంతర్గతంగా బలహీనపరుస్తాయన్నారు. వీటి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని తెలిపారు. గంజాయి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై ఎక్సైజ్, పోలీస్, ఈగల్ డిపార్టుమెంట్ అధికారులతో ఆకే రవికృష్ణ సమీక్షించారు. ఈ సమావేశంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ పాల్గొన్నారు. ఈగల్ ఛీఫ్‌గా నియమితులైన తర్వాత రవికృష్ణ తన తొలి పర్యటనను నరసరావుపేటలో చేపట్టారు.

సెలవుల క్యాలెండర్ విడుదల చేసిన హైకోర్టు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి హైకోర్టు, జిల్లా కోర్టులు, ట్రైబ్యునళ్లు, లేబర్ కోర్టులకు సెలవుల క్యాలెండర్‌ను విడుదల చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. 2025లో మొత్తం 26 సాధారణ సెలవులు, 13 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయి. జనవరి 13 నుంచి 17వరకు సంక్రాంతి సెలవులు, మే 12 నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు, సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 3 వరకు దసరా సెలవులు ప్రకటించారు.

భయపెట్టి.. 1.4 కోట్లు స్వాహా

» రిటైర్డ్ రైల్వే ఉద్యోగి నుంచి కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

» మనీ లాండరింగ్ కేసుల పేరిట వేధింపులు

» డిజిటల్ అరెస్టు చేస్తామని బెదిరింపులు

» విశ్రాంత ప్రొఫెసర్ వద్ద రూ.74 లక్షలు కాజేత



నర్సీపట్నం, చుండూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. 'మీ మీద మనీ లాండరింగ్, మాదక ద్రవ్యాల కేసులు నమోదయ్యాయి. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం.. ఈ కేసుల నుంచి బయటపడాలంటే మేం చెప్పిన ఖాతాల్లో డబ్బు జమ చేయాలి' అంటూ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. భయపెట్టి కోట్లు కొల్లగొడుతున్నారు. తాజాగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో విశ్రాంత రైల్వే ఉద్యోగి నుంచి రూ.1.43 కోట్లు కాజేయగా, బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ నుంచి రూ.74 లక్షలు కొట్టేశారు. నర్సీపట్నానికి చెందిన 81 ఏళ్ల యు.నాగరాజు రైల్వేలో పనిచేసి రిటైరయ్యారు. పది రోజుల క్రితం ఆయనకు ఒక ఫోన్ వచ్చింది. 'మీ మీద మనీ లాండరింగ్ కేసు నమోదైంది. మిమ్మల్ని అరెస్టు చేయడానికి ముంబై నుంచి పోలీసులు వస్తున్నారు. అరెస్టు కాకుండా ఉండాలంటే.. మీ ఖాతాలో ఉన్న డబ్బులు మేం చెప్పిన బ్యాంకు ఖాతాలో వేయండి. నిర్దోషిగా తేలితే మీ సొమ్ము వెంటనే మీ ఖాతాకు పంపించేస్తాం' అని నమ్మించారు. దీంతో తొలిరోజు రూ.20.7 లక్షలు, రెండో రోజు రెండు విడతల్లో రూ.16 లక్షలు, రూ.23.5 లక్షలు.. మూడో రోజు రూ.83 లక్షలు.. ఇలా రూ.1.43 కోట్లు రెండు వేర్వేరు బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. సైబర్ నేరగాళ్లు నాలుగో రోజు కూడా డబ్బులు పంపాలని బెదిరించడంతో నాగరాజు మోసపోయానని గ్రహించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ గోవిందరావు ఆయనతో సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబరు 1930కి ఫోన్ చేయించారు. సైబర్ క్రైమ్ పోలీసులు బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఒక ఖాతాలో ఉన్న రూ.2.6 లక్షలు హోల్డింగ్‌లో పెట్టించారు. బ్యాంకు ఖాతా వివరాలను బట్టి నేరస్థులను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

74 లక్షలు పోగొట్టుకున్న రిటైర్డ్ ప్రొఫెసర్

బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ గొంది హరివరప్రసాద్ కేరళలోని సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో డీన్‌గా, నేపాల్ ప్రభుత్వ వ్యవసాయ రంగ సలహాదారుగా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామం వేటపాలెంలో నివసిస్తున్నారు. ఇటీవల ఆయనకు ఫోన్‌కాల్ వచ్చింది. 'మీరు విధి నిర్వహణలో నగదు దుర్వినియోగం చేశారు. పన్నుల ఎగవేత వంటి మోసాలకు పాల్పడ్డారు. మీపై డిజిటల్ అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. బయటపడాలంటే కొంత నగదు డిపాజిట్ చేయాలి. నిరూపణ కాకపోతే ఆ మొత్తం వెనక్కి ఇచ్చేస్తాం' అని చెప్పారు. దీంతో హరివరప్రసాద్.. వారు చెప్పిన ఖాతాకు మొదటి విడతగా రూ.40వేలు జమ చేశారు. మళ్లీ ఫోన్ చేసి.. అరెస్టు కాకుండా ఉండాలంటే మరిన్ని డబ్బులు పంపాలని డిమాండ్ చేయడంతో ఐదు దఫాలుగా రూ.74 లక్షలు వారు చెప్పిన ఖాతాల్లో జమ చేశారు. అయితే కొద్ది రోజుల క్రితం సైబర్ నేరగాళ్లు ఏ విధంగా మోసాలకు పాల్పడుతున్నారో తెలిపే వీడియోను చూసిన హరివరప్రసాద్.. తాను మోసపోయానని గ్రహించి మంగళవారం చుండూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభావతికి ముందస్తు బెయిల్ ఇవ్వవద్దు

» ఇంప్లీడ్ పిటిషన్‌లో కోరిన రఘురామకృష్ణరాజు

» తదుపరి విచారణ 9కి వాయిదా

గుంటూరు(లీగల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ 5వ నిందితురాలైన డాక్టర్ ప్రభావతి వేసిన పిటిషన్‌పై మంగళవారం గుంటూరు కోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా తమ అభ్యంతరాలను కూడా వినాలని కోరుతూ రఘురామకృష్ణరాజు తరఫున న్యాయవాదులు వి.వి. లక్ష్మీనారాయణ, కావూరి గోపీనాథ్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. కస్టడీలో రఘురామపై జరిగిన హత్యాయత్నంలో ప్రభావతి కూడా భాగస్వామి అయ్యారని పిటిషన్‌లో పేర్కొన్నారు. రఘురామ కాళ్లపై దెబ్బలు ఉన్నాయని జీజీహెచ్ వైద్య బృందం ఇచ్చిన నివేదికను దురుద్దేశంతో ఆమె ట్యాంపరింగ్ చేశారని, భిన్నంగా నివేదిక ఇవ్వడంలో కీలకపాత్ర పోషించారని ఆరోపించారు. బైపాస్ సర్జరీ చేయించుకున్న రఘురామ గుండెలపై నిందితులు కూర్చుని కొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించిన అంశాన్ని తన నివేదికలో ప్రభావతి తొక్కిపెట్టారని వివరించారు. రఘురామ ఆరోగ్యంగా ఉన్నారని, ఒంటిపై గాయాలేవీ లేవని నివేదిక ఇవ్వడం ద్వారా జైలులో రఘురామకు వైద్యం అందకుండా చేసేందుకు కుట్ర పన్నారని తెలిపారు. సరైన నివేదిక ఇవ్వకుండా కోర్టునే ఆమె తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ప్రభావతికి ముందస్తు బెయిల్ ఇవ్వవద్దని కోరారు. ఇన్‌చార్జి పీపీ స్పందిస్తూ.. ఈ కేసులో ప్రభుత్వం ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్‌ను స్పెషల్ పీపీగా నియమించిందని, ఆయన హాజరై వాదనలు వినిపిస్తారని కోర్టుకు తెలిపారు. దీంతో కోర్టు ఈ బెయిల్ పిటిషన్‌ను తదుపరి విచారణను 9కి వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఓలి రాజకీయం


నేపాల్ ప్రధాని ఖడ్గప్రసాద్ శర్మ ఓలి ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి కంకణం కట్టుకున్నందుకు ఆయనను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమితంగా ప్రశంసించారు. రెండుదేశాలు పలు కీలక ఒప్పందాలమీద సంతకాలు చేశాయి. ఓలీ నేపాల్ ప్రధాని కావడం ఇది నాలుగోసారి అయినప్పటికీ, మొన్న జూలైలో నేపాలీ కాంగ్రెస్‌తో చేతులు కలిపి, ప్రచండను గద్దెదించి, మళ్ళీ ఆ పదవిలో కూచున్న తరువాత ఆయన తొలివిదేశీపర్యటన ఇదే. నేపాల్ ప్రధానిగా ఎవరు బాధ్యతలు స్వీకరించినా, తొలి విదేశీపర్యటన భారతదేశంలో జరపడం ఓ సంప్రదాయం. ఓలి దానిని కాదని, తొలిగా చైనాలో కాలూని, దానితో దీర్ఘకాలిక, వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలు చేసుకోవడం భారతదేశానికి గట్టి హెచ్చరిక.

ఓలి చైనా పర్యటన సందర్భంగా ఉభయదేశాధినేతలు ఒకరినొకరు కీర్తించుకున్నారు, ద్వైపాక్షిక బంధాన్ని మరింత దృఢతరం చేసుకోవాలని సంకల్పం చెప్పుకున్నారు. నదులు, నదీనదాలు, పర్వతశిఖరాలకు చెరోవైపూ ఉంటూ పంచుకుంటున్న మనం స్నేహాన్ని, సంతోషాన్ని కూడా పంచుకోవాలని, ఇచ్చిపుచ్చుకొనేరీతిలో వ్యవహరించాలని రెండు దేశాలు అనుకున్నాయట. నేపాల్‌ను ఆర్థికంగా నిలబెట్టే విషయంలో చైనా వెనకడుగువేయబోదన్న గట్టి హామీ కూడా ఓలిశర్మకు లభించింది. పర్యటనకు ఒకరోజు ముందుగానే, చైనానుంచి నేపాల్‌కు వేర్వేరు పేర్లతో, ఖాతాలతో ఓ పాతికమిలియన్ డాలర్ల ప్రాజెక్టులు దక్కాయి. ఓలి పర్యటనలో అనేక భారీ నిర్మాణాలకు సంబంధించి ఒప్పందాలు జరిగాయని, వైద్యం, వాణిజ్యం, వ్యవసాయం ఇత్యాది రంగాల్లో సహకారం నిమిత్తం అవగాహనలు చేసుకున్నారని, మరిన్ని వరాలు దక్కుతాయని వార్తలు వస్తున్నాయి. నేపాలీ టెలివిజన్‌కూ చైనా అధికారిక మీడియాకూ మధ్య కూడా ఇచ్చిపుచ్చుకోవడాలు ఉంటాయట.

జూలైలో ఓలి మళ్ళీ ప్రధాని అయినప్పుడే, ఆయన ఈ మారు తన అధికారాన్ని బలోపేతం చేసుకోవడం కోసం చైనాకు మరింత సన్నిహితమవుతారన్న విశ్లేషణలు వెలువడ్డాయి. సెప్టెంబరులో ఐక్యరాజ్య సమితి సదస్సు సందర్భంగా భారతప్రధాని నరేంద్రమోదీతో ఓలి భేటీ అయ్యారు. దీనికి ముందు నేపాల్ విదేశాంగమంత్రి మనదేశానికి వచ్చారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా ఓలిని మనపాలకులు ఆహ్వానించకపోవడంతో, చైనా వెళ్ళాలన్న నిర్ణయానికి వచ్చారట. ఆయన ప్రధాని కావడంతోనే, భారత్–నేపాల్ బంధం బలహీనపడితే, అనంతర పరిణామాలతో అవి మరింత దిగజారాయి. నేపాల్‌లో చైనా పెట్టుబడుల విషయంలోనే కాక, భారత్–నేపాల్ ప్రాజెక్టుల్లో సైతం చైనా పరోక్ష ప్రమేయం పెరుగుతున్నదని భారత్ ఆగ్రహిస్తోంది. చైనా నిర్మించిన విమానాశ్రయాలనుంచి ఇతరదేశాలకు పోయే విమానాలను భారతదేశం తన గగనతలంమీద అనుమతించాలన్న నేపాల్ అభ్యర్థనకు భారత్ సరేననడం లేదు. ఇటువంటి పలు అంశాలు ఓలిరాకతో మరింత వేడెక్కాయి. ఆయనను మనం ఆహ్వానించకపోవడం మారిన వాతావరణానికి ప్రబల నిదర్శనం.

బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌లో భాగస్వామినవుతానని 2019లో చైనా అధ్యక్షుడు పర్యటించిన సందర్భంగా నేపాల్ గట్టిహామీ ఇచ్చిన విషయాన్ని ఇప్పుడు ఓలి పార్టీ (యూనిఫైడ్ మార్క్సిస్టు–లెనినిస్ట్) నాయకులు గుర్తుచేస్తున్నారు. అప్పుడు అవగాహన కుదుర్చుకున్నవన్నీ ఆచరణసాధ్యం చేయడానికి ఓలి ఈ పర్యటన చేస్తున్నారట. 2017లో బీఆర్‌ఐలో చేరికూడా నేపాల్ ఈ విషయంలో పెద్దగా అడుగుముందుకు వేయలేకపోయింది. అలాగే, చైనా నిర్మిత పొఖారా అంతర్జాతీయ విమానాశ్రయం అప్పును తీర్చగలిగే స్థితిలో నేపాల్ లేదు కనుక దానిని గ్రాంటుగా మార్చమన్న ఓ అభ్యర్థన ఆయన ఎజెండాలో ఉందట. భారత్ అభ్యంతరాలతో అంతర్జాతీయ విమానాల రాకపోకలు అనుకున్నంతగా లేక ఈ విమానాశ్రయం నష్టాల్లోకి జారుకున్న విషయం తెలిసిందే. చైనాతో చేయి కలిపి నిండామునిగిన శ్రీలంక అనుభవం కళ్ళముందు ఉన్నది కనుక, ఓలి దూకుడును నియంత్రించేందుకు నేపాల్‌లోని మిగతాపక్షాలు ప్రయత్నించవచ్చు. కానీ, తన తొలివిదేశీ పర్యటనకు చైనాను ఎంచుకోవడం ద్వారా ఆయన భారతదేశాన్ని మరింత దూరం చేసుకున్నారు. భారత వ్యతిరేక ఎజెండాతో అధికారంలోకి వచ్చిన మాల్దీవుల అధ్యక్షుడు కూడా మొదట ఇదే తరహాలో వ్యవహరించి, ఆ తరువాత సయోధ్యయత్నాలు ఆరంభించారు. ఓలి ఎంతకాలం అధికారంలో ఉంటారో తెలియదు కానీ, ఆయన కారణంగా నేపాలీ ప్రజలకు దూరంకాకుండా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత భారత్ మీద ఉంది.

కాంగ్రెస్‌కు జనబలం ఎప్పుడు లభించేను?



భారతీయ జనతా పార్టీ సిద్ధాంతం మంచిదా కాదా అన్నది వేరే చర్చ. ఆ పార్టీ తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకుంటూ, పెంచుకుంటూ పోతోంది. మరి కాంగ్రెస్ పూర్తిగా బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతోంది. తన ఓటు బ్యాంకును తానే స్వంతంగా నిర్మించుకోనంతవరకూ కాంగ్రెస్‌కు భవిష్యత్తు అగమ్యగోచరంగానే ఉంటుంది.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా, ఎంత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లినా భారతీయ జనతా పార్టీ విస్తృతి, ఉధృతిని ఎందుకు అడ్డుకోలేకపోతున్నాం? గెలిచిన రాష్ట్రాల్లోనే బీజేపీ మరీ మరీ ఎందుకు గెలుస్తోంది? గతంలో కంటే ఎక్కువ ఓట్లు ఎలా సాధిస్తోంది? అసలు ఎక్కడ పొరపాటు జరుగుతోంది? సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోగలదా? అన్న ప్రశ్నలు గత వారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరి మనసుల్లో మెదిలాయి. ఎవరి ముఖాల్లోనూ చిరునవ్వు ఏ కోశానా కనపడలేదు. వారు సాధారణ నేతలు కాదు. ఎన్నో యుద్ధాల్లో ఆరితేరినవారు. ఎంతో అనుభవం ఉన్నవారు. అయినా ఎంతగా తలలు బాదుకున్నా తమ వరుస ఓటములకు కారణాలేమిటో వారు నిర్దిష్టంగా చెప్పలేకపోయారు. నాలుగున్నర గంటల పాటు జరిగిన చర్చలో ఎంతసేపూ బీజేపీ మతపరమైన ఎజెండాను, మోదీ ఉపన్యాసాలను, ఈవీఎంలను నిందించినవారే ఎక్కువగా ఉన్నారు. కేవలం ఈవీఎంల వల్లే మనం ఓడిపోయామా? వేరే కారణాలు లేవా? అన్న ప్రశ్నలపై వర్కింగ్ కమిటీ సమావేశంలో పెద్దగా చర్చించినట్లు లేదు. చివరకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై మరో కమిటీని వేయాలని నిర్ణయించి చేతులు దులుపుకున్నారు. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత కమిటీలను నియమించింది. ఆ కమిటీలు ఏమి చెప్పాయో, వాటి ఆధారంగా ఏ నిర్ణయాలు తీసుకున్నారో ఎవరికీ తెలియదు. అయినా కమిటీల వల్ల ఏమి జరుగుతుంది?

తెలుగుదేశం అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో బీజేపీ విజయ రహస్యం గురించి వెల్లడించారు : 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడూ ఎన్నికలకు తయారీగా ఉంటారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కూడా ఆయన ఇప్పటికే సన్నాహాలు మొదలు పెట్టారు' అని చంద్రబాబు నవ్వుతూ అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించిన రోజే నరేంద్ర మోదీ బీజేపీ పార్టీ కార్యాలయానికి వచ్చి వేలాది కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. మోదీ, మోదీ అన్న నినాదాలు మిన్నంటుతుండగా 'హమ్ ఏక్ హై తో సేఫ్ హై' (మనం ఒకటిగా ఉంటే సురక్షితంగా ఉంటాం) అని మోదీ మరోసారి ప్రకటించారు. మహారాష్ట్ర ప్రయోగాన్ని దేశమంతటా అమలు చేసేందుకు బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. 'మనం కనీసం ఒక ఏడాది ముందైనా ఎన్నికలకు సంసిద్ధం కావాలని అర్థం అవుతోంది' అని ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో అన్నారు. మోదీ ఒక ఎన్నికల ఫలితాలు రాకముందే మరో ఎన్నికలకు సిద్ధమయి ఉంటారని కాంగ్రెస్ నేతలు ఇంకా గ్రహించలేదన్న విషయం స్పష్టమవుతోంది.

భారతీయ జనతా పార్టీ ఎజెండా, ప్రణాళికకు సంబంధించి ఎవరికీ పెద్ద అనుమానాల్లేవు. మతపరమైన భావోద్వేగాలు, దేశ భక్తిని రంగరిస్తూనే క్రింది స్థాయి నుంచి పార్టీని నిర్మించి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సమాయత్తమవుతూనే ఉంటుంది. ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేందుకు వ్యూహాలను నిరంతరం అమలు చేస్తూనే ఉంటుంది. పార్టీకి చెందిన వివిధ అనుబంధ సంస్థలు, సంఘ్ పరివార్ సంస్థలు ఎప్పుడూ సమావేశాలను, సదస్సులను నిర్వహిస్తూ ప్రజలను తమకు అనుకూలంగా తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ, సంఘ్ పరివార్ సంస్థలు విస్తృతంగా పనిచేస్తుంటాయి. పోలింగ్ బూత్ స్థాయి నుంచి సూక్ష్మ వ్యూహాలు సిద్ధం చేస్తాయి. వీటన్నిటికి తోడు దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని, ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రరాజ్యంగా మారడం ఖాయమని వివిధ స్థాయిల్లో ఢంకా బజాయిస్తూనే ఉంటారు. వికసిత్ భారత్, స్వచ్ఛ భారత్ వంటి నినాదాలు మారుమ్రోగుతూనే ఉంటాయి. సరే, ఆ పార్టీకి నిధుల కొరత ఏ మాత్రం ఉండదు కదా.

గెలిచిన రాష్ట్రాల్లో మళ్లీ గెలిచేందుకు, ప్రతిపక్షంగా మారిన రాష్ట్రంలో మళ్లీ అధికారం చేజిక్కించుకునేందుకు బీజేపీ కసిగా పనిచేస్తుంది. ఓడినా, గెలిచినా తమ ఓటు శాతం తగ్గకుండా చూసుకుంటుంది. అదే కాంగ్రెస్ వరుసగా ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి కాని వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఇటీవలి కాలంలో లేవు. 2014లో కాంగ్రెస్ హరియాణలో గెలిచినప్పటికీ 2019 నుంచి ఓడిపోతూనే వస్తోంది. పంజాబ్‌లో అయిదేళ్లు పాలించి ఆప్‌కు అధికారాన్ని అప్పగించింది. అదే బీజేపీ గుజరాత్, హరియాణాలో వరుసగా మూడుసార్లు గెలిస్తే, అస్సాం, త్రిపుర, గోవా, మణిపూర్, యూపీ, ఉత్తరాఖండ్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కింలలో వరుసగా రెండుసార్లు గెలిచింది. అంటే కనీసం డజన్ రాష్ట్రాల్లో బీజేపీ మిత్రపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమిస్తున్నాయన్నమాట. కాంగ్రెస్‌తో పోలిస్తే తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జేఎంఎం వంటి ప్రాంతీయ పార్టీలు వరుస విజయాలు సాధించాయి. తెలుగుదేశం ఒకసారి ఓడినా మరోసారి వీరోచితంగా పోరాడి అధికారంలోకి రాగలిగింది. కాంగ్రెస్‌లో ఆ కసి ఎందుకు కనపడడం లేదు?

అసలు దేశ అభివృద్ధి నమూనా విషయంలో కాంగ్రెస్ విధానాలకూ, బీజేపీ విధానాలకూ తేడా ఏమైనా ఉన్నదా? 'అదానీ, కులగణన, రాజ్యాంగాన్ని కాలరాయడం ప్రజా సమస్యలు కావా? వాటికి అనుకూలంగా ప్రజలు ఎందుకు స్పందించడం లేదు?' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. అదానీని విమర్శించినంత మాత్రాన కాంగ్రెస్ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తుందని ఎవరైనా అనుకుంటారా? అదానీపై మిత్రపక్షాలలో కూడా ఏకాభిప్రాయం లేదు. కులగణన గురించి ప్రస్తావించినంత మాత్రాన సామాజిక న్యాయం కోసమే కాంగ్రెస్ జన్మించిందని జనం అనుకునే అవకాశాలున్నాయా? ఏ విషయంలో కాంగ్రెస్ తాను బీజేపీ కంటే భిన్నమైన సైద్ధాంతిక సంస్థ అని నిరూపించుకోగలదు? కాంగ్రెస్ పార్టీ రకరకాల సిద్ధాంతాలు ఉన్న పంచకూళ కషాయంలా ఉంటుంది. బీజేపీ దశాబ్దాలుగా ఒకే సిద్ధాంతం ఆధారంగా పనిచేస్తే కాంగ్రెస్ ఒక నిర్దిష్ట సిద్ధాంతాన్ని దీర్ఘకాలం కొనసాగించలేకపోతోంది. మహావికాస్ అగాదీకి మహారాష్ట్రలో కేవలం ముస్లిం ఓట్లే అధికంగా వచ్చాయని, మహాయుతికి ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ఓట్లు పెరిగాయని గణాంక వివరాలు చెబుతున్నాయి. మహిళలు, యువకులు మహాయుతివైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అలా ఎందుకు జరిగింది?

2024 ఎన్నికలకు రెండేళ్ల ముందు పార్టీ ముందున్న సవాళ్లను నిర్ణయించి వాటిని అధిగమించేందుకు కురువృద్ధులైన నేతలతో సోనియా ఒక సాధికార బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ఏమి చెప్పిందో, చెప్పిన వాటిని అమలు చేశారో, లేదో తెలియదు కాని ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో అనుకున్నంత మేరకు ఫలితాలను సాధించలేకపోయారు. సమకాలీన అంశాలపై చర్చించి పార్టీ దృక్పథాన్ని రూపొందించేందుకు నియమితులయిన సభ్యులు కూడా పార్టీకి నిర్దిష్టమైన సైద్ధాంతిక స్వరూపాన్ని రూపొందించలేకపోయారు. సంస్థాగతంగా చేయాల్సిన పెను మార్పులను సూచించేందుకు గతంలో ఆంటోనీ, అహ్మద్ పటేల్ లాంటి వారితో కమిటీలు వేసినా వారి సూచనలు అమలు అయిన దాఖలాలు లేవు. ఏ పెను మార్పులూ జరగలేదు. నిరంతర ఉద్యమాలు చేసే విషయంపై నిర్ణయించేందుకు, పార్టీని ఆధునికీకరించేందుకు ఏర్పర్చిన కమిటీలు ఏం చెప్పాయో కూడా ఎవరికీ తెలియదు. బహుశా ఈ కమిటీ నివేదికలు ఏఐసీసీ లైబ్రరీలో దుమ్ము కొట్టుకుపోతూ ఉంటాయి! ఇక 'కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి' అని ఖర్గే అన్నప్పటికీ ఆ నిర్ణయాలు ఎప్పుడు తీసుకుంటారో చెప్పలేము. ముఠాతత్వం, కుమ్ములాటలు కూడా ఒక కారణమని చెప్పిన ఖర్గే పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి వాటిని ఎందుకు అరికట్టలేకపోతున్నారో ఎవరు చెప్పగలరు? 'ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలే అన్ని నిర్ణయాలు తీసుకున్నాయి' అని ఖర్గే సమావేశంలో వాపోవడం గమనార్హం.

కాంగ్రెస్‌లో యథాతథ పరిస్థితిని ఆకాంక్షించేవారే ఎక్కువ ఉండడం, సమూలంగా మార్పులు చేసేందుకు పార్టీ అగ్రనేతలు సాహసించకపోవడం వల్ల ఆ పార్టీ బీజేపీని ఢీకొనగల నవనవోన్మేషమైన శక్తిగా ఆవిర్భవించగలదన్న నమ్మకాలు కలగడం లేదు. అందుకు ప్రధాన కారణం వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పార్టీలో తుక్కూ, తుప్పూ బాగా పేరుకుపోయి ఉండడం. కార్పొరేటర్ స్థానాన్ని కూడా గెలవలేని ఏడు పదులు దాటిన సీనియర్ నేతలు తమ గుర్తింపు కోసం తరుచూ విలేఖరుల సమావేశాలు నిర్వహించడం, ఎవరూ పట్టించుకోకపోయినా తమ అమూల్యమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడం కాంగ్రెస్‌లోనే ఎక్కువ కనపడుతుంది. రాహుల్ గాంధీతో పాటు కొందరు నేతలు జనంలోకి వెళుతూ, ప్రజా సమస్యలపై మాట్లాడుతూ, కార్మికులు, యువతతో సంభాషిస్తూ కనపడుతున్నారు. కానీ ఎంతో కష్టపడి కాంగ్రెస్ తమకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకున్నా ఆ వాతావరణం ఓట్లుగా మారేందుకు తగిన పరిస్థితులను కల్పించుకోలేకపోతోంది. 'సానుకూల వాతావరణం ఉంటే చాలదు దాని వల్ల విజయాలు రావు. అనుదినమూ ఇరవై నాలుగు గంటలూ పనిచేయాలి' అని ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో సరిగానే అన్నారు.


అంతే కాదు, ఎన్నికలు లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం చాలా స్తబ్దంగా ఉంటుంది. ఆ సమయాన్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ నేతలు జనంలో కనపడతారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న విషయంలో కాంగ్రెస్ చూపే అధారాలను ప్రజలు విశ్వసించేలా చేయనంతవరకూ ఈవీఎంలపై ఎన్ని ఆరోపణలు చేసినా ఫలితం ఉండదు. పోలింగ్ బూత్ స్థాయి ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలి అని ఖర్గే ఆలస్యంగానైనా గ్రహించారు. బీజేపీ సిద్ధాంతం మంచిదా కాదా అన్నది వేరే చర్చ. ఆ పార్టీ తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకుంటూ, పెంచుకుంటూ పోతోంది. కాంగ్రెస్ పూర్తిగా బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతోంది. తన ఓటు బ్యాంకును తానే స్వంతంగా నిర్మించుకోనంతవరకూ కాంగ్రెస్‌కు భవిష్యత్తు అగమ్యగోచరంగానే ఉంటుంది

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఉపకారికి బంగ్లాదేశ్ అపకారం!

కూర్చున్న కొమ్మనే నరుక్కుంటూ భవిష్యత్తును కాలరాసుకోవడం అంటే ఏమిటో ఇవాళ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను చూసి అర్థం చేసుకోవచ్చు! రిజర్వేషన్ల విషయంలో అసంతృప్తి పేరిట హసీనా నాయకత్వంలోని గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొదలైన నిరసనలను ఉద్దేశపూర్వకంగా హిందువుల వైపు మరల్చి, మరీ ముఖ్యంగా హిందూ స్త్రీల పట్ల చెప్పలేని చూడలేని దారుణ మారణకాండను సృష్టిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో చూసి కన్నీరు కార్చని హృదయం లేదు. ఎలాగో కాస్త తేరుకున్న బంగ్లాదేశ్ హిందువులు, వారికి మద్దతుగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలోని హిందువులు చేపట్టిన నిరసనల ఫలితంగా తాత్కాలికంగా హింసాకాండ ఆగినట్టు కనిపించినా కొద్ది రోజుల్లోనే మళ్లీ వికృత చేష్టలు మొదలయ్యాయి.

ఇందులో భాగంగానే తాజాగా ఇస్కాన్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షస్‌నెస్) పూజారి అయిన చిన్మోయ్ కృష్ణదాస్‌పై దేశద్రోహి ముద్ర వేసి జైలుకి పంపాలన్న కుట్ర మొదలైంది. చిన్మోయ్ కృష్ణదాస్ తరఫున వాదిస్తున్న ప్రభుత్వ న్యాయవాదిని అల్లరి మూకలు హత్య చేశాయి. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా బాధిత హిందువులను సమైక్యపరిచి, కాపాడేందుకు ప్రయత్నించడమే చిన్మోయ్ కృష్ణదాస్ చేసిన తప్పు. బంగ్లాదేశ్‌లో గత ఆగస్టు నెల నుంచి కొనసాగిన విధ్వంసకాండలో లెక్కకు మించి హిందూ దేవాలయాలు ధ్వంసం అయ్యాయి. ఇందులో పదుల కొద్దీ ఇస్కాన్ మందిరాలు కూడా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్‌కు 65 దేవాలయాలుండగా 50 వేలకు పైగా భక్తులు ఉన్నారు. తాజా పరిణామాల్లో భాగంగా ఇస్కాన్‌కి వ్యతిరేకంగా జమాతే ఏ ఇస్లామి సంస్థ బెదిరింపులకు తెగబడింది. ఈ సంస్థ కార్యకర్తలు ఇస్కాన్ ఆలయ బోర్డును కూడా తొలగించి తమ సంస్థ బోర్డు పెట్టారు. అసలు చిన్మోయ్ అరెస్టుకి ముందే బంగ్లా పోలీసులు ఇస్కాన్ ఉగ్రవాద సంస్థ అని వాదిస్తున్నారు. ఇస్కాన్ సభ్యులు భారత నిఘా సంస్థకు అనుబంధంగా పని చేస్తున్నారనీ, దేశంలో మతపరమైన హింసకు వీరే కారణమనీ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో అనేక విలయాలు సంభవించినప్పుడు అక్కడి ప్రజలకు అండగా నిలిచి, బాధితులకు అన్నవస్త్రాలూ నిత్యావసరాలూ ఇచ్చి ఆదుకున్న ఇస్కాన్‌పై దేశద్రోహి అన్న ముద్ర వేశారు.



బంగ్లాదేశ్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం భారీగా సహాయ సహకారాలు అందిస్తూ వచ్చింది. ఆపత్కాలంలో చేదోడువాదోడుగా నిలిచింది. మరోవైపు ఇస్కాన్ సంస్థతో పాటుగా హిందూ సమాజానికి చెందిన సంస్థలు బంగ్లాదేశ్‌లో వివిధ రకాలుగా సేవలు చేస్తున్నాయి. ఆ దేశాధినేత మహ్మద్ యూనిస్ నోబెల్ బహుమతి పొందిన విశిష్ట వ్యక్తి. ప్రభుత్వాధినేతగా ఆయన చొరవ చూపించి జరుగుతున్న అకృత్యాలను ఆపి, చిన్మోయి కృష్ణదాస్‌ను విడుదల చేస్తారని ఆశిద్దాం.

బంగ్లాదేశ్‌లోని హిందూ మైనారిటీల రక్షణపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తోంది. కానీ, బంగ్లాదేశ్‌లోని యూనిస్ సర్కారు భారత ప్రభుత్వ వాదనను తోసిపుచ్చుతూ వచ్చింది. ఇప్పుడు తమ నిర్లక్ష్యాన్నీ, వివక్షాపూరిత వైఖరినీ కప్పిపుచ్చుకునేందుకు ఇస్కాన్‌ని దోషిగా చూపిస్తోంది. చిన్మోయ్ అరెస్ట్‌తో దేశంలోని హింసకు బాధ్యత వహించకుండా తప్పించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇస్కాన్ సంస్థపై నిషేధం విధించాలన్న పిటిషన్‌ని బంగ్లాదేశ్‌లోని ఢాకా హైకోర్టు తోసిపుచ్చడం ఒక్కటే కాస్త ఉపశమనం. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో విస్తరించిన ఇస్కాన్ కార్యకలాపాలపై, సేవలపై ఎక్కడా ఏ వివాదాలూ తలెత్తలేదు. చివరికి భారత్ దాయాది పాకిస్థాన్‌లో సైతం కరాచీ, లర్ఖానా, సింధ్, హైదరాబాద్, క్వెట్టా, బలొచిస్థాన్ ప్రాంతాల్లో ఇస్కాన్ సంస్థ సేవలు కొనసాగుతున్నాయి. మరెక్కడా లేని రీతిలో ఒక్క బంగ్లాదేశ్‌లోనే ఇస్కాన్‌ని లక్ష్యంగా చేసుకోవడం చూస్తే ఇది కుట్ర గాక మరేమిటి?

మూడు నెలల కిందట బంగ్లాదేశ్‌లో భారీగా వానలు కురిసినప్పుడు పలు గ్రామాలు నీట మునిగి అనేక ప్రాంతాలు జలమయమై ఆహారం, ఆశ్రయం లేకుండా పోయాయి. ఆ పరిస్థితుల్లో ఇస్కాన్ భక్తులు బంగ్లాదేశ్ వరద బాధితులకు గొప్ప సేవలందించారు. ప్రాణాలను పణంగా పెట్టి మరీ పడవలపై వరద నీటిలో బాధితుల వద్దకు వెళ్ళి ఆకలి తీర్చారు. బంగ్లాదేశ్‌లో ఇలా ప్రకృతి విలయం ఎప్పుడు సంభవించినా ఇస్కాన్ సభ్యులు చేయూతనిస్తుంటారు. బంగ్లాదేశ్‌లో హిందువుల పైనా, ఇస్కాన్ ఆలయాలపైనా దాడులు జరిగిన సమయంలో కూడా ఇస్కాన్ భక్తులు తమ సేవలను ఆపలేదు. తమపై దాడి జరిగిన చోటే వరద బాధితుల కడుపులు నింపిన సహృదయత బంగ్లాదేశ్ ఇస్కాన్ సభ్యుల్లో కనిపించింది. ప్రత్యేకించి శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవ సమయంలో కులమత బేధమన్నది లేకుండా ఆ దేశంలోని పేదలకు ఇస్కాన్ సంస్థ రేషన్ కూడా అందజేస్తూ వస్తోంది. ఇలా ఎన్నో సేవలతో బంగ్లాదేశ్ ప్రజలను ఆదుకున్న ఇస్కాన్‌పై లేనిపోని ఆరోపణలు చేసి నిషేధం విధించాలనడం బుద్ధి జీవులకు ఆమోదయోగ్యం కాదు.

బంగ్లాదేశ్ ప్రజలకు ఇస్కాన్ చేస్తున్న సేవలు ఇలా ఉండగా– ఆ దేశ ప్రభుత్వానికి భారత సర్కారు ఎన్ని సందర్భాల్లో అండగా నిలిచిందన్నది మరో పెద్ద చరిత్ర! బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మూలం భారత్. అక్కడి ప్రజలు పోరాటం చేస్తున్నప్పుడు అండగా నిలిచి బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఏర్పాటు అయ్యేందుకు సైనిక బలగాలను పంపించి అండగా నిలిచిన దేశం మన దేశం!

బంగ్లాదేశ్ ఏర్పడినప్పుడు ఆ దేశ జనాభాలో హిందువులు దాదాపు 20శాతం ఉండేవారు. నేడు చూస్తే అక్కడ హిందూ మైనార్టీలు 8 శాతానికి క్షీణించారు. జనవరి 2013 నుంచి సెప్టెంబర్ 2021 మధ్య కాలంలో హిందూ సమాజంపై కనీసం 3,679 సార్లు దాడులు జరిగాయని అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీ వెల్లడించింది. అయినప్పటికీ ఆ దేశంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం భారీగా సహాయ సహకారాలు అందిస్తూ వచ్చింది. ఆపత్కాలంలో ఆ దేశ ప్రభుత్వానికి చేదోడువాదోడుగా నిలిచింది. మరోవైపు ఇస్కాన్ సంస్థతో పాటుగా హిందూ సమాజానికి చెందిన సంస్థలు బంగ్లాదేశ్‌లో వివిధ రకాలుగా సేవలు చేస్తున్నాయి.

ప్రస్తుత బంగ్లాదేశ్ అధినేత మహ్మద్ యూనిస్ నోబెల్ బహుమతి పొందిన విశిష్ట వ్యక్తి. ప్రభుత్వాధినేతగా ఆయన చొరవ చూపించి ఈ అకృత్యాలను ఆపి, చిన్మోయి కృష్ణదాస్‌ను విడుదల చేస్తారని ఆశిద్దాం. ఈ డిమాండ్ భారతదేశ వ్యాప్తంగా వినిపిస్తోంది. సుమారు 150కు పైగా రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, రిటైర్డ్ హైకోర్టు జడ్జీలు, రిటైర్డ్ సైనికాధికారులు సంతకాలు చేసి, గౌరవ రాష్ట్రపతికి సమర్పించిన వినతిపత్రంలో, చిన్మోయి కృష్ణ దాస్‌ను విడుదల చేసి బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనారిటీలను రక్షించాలన్న డిమాండ్‌ను గట్టిగా వినిపించారు.

• డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు
రిటైర్డ్ ఐఏఎస్ అధికారి

ప్రజా రవాణా దిశను మార్చిన ఏయు రోడ్డు ప్రమాదం!

ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదం తర్వాత కాలంలో ఆంధ్రప్రదేశ్ పురోగతి పరిణామాలపై ప్రభావాన్ని చూపింది. చరిత్రకారులు విస్మరించిన ఈ ఘటన చరిత్ర పుటలు తిరగేసినపుడల్లా మన కళ్ల ముందు కదలాడుతూనే ఉంటుంది. డిసెంబరు నెల వచ్చినపుడల్లా ఒక చేదు జ్ఞాపకంగా యూనివర్శిటీ విద్యార్థి, అధ్యాపక వర్గాల మనస్సులను కదిలించివేస్తుంది.

1978 డిసెంబరు 5. రోజూలాగే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, సిబ్బంది ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉన్నారు. కేంపస్ అంతా కోలాహలంగా ఉంది. అయితే, ఉన్నట్టుండి ఒక్కసారి నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది. అందరి గుండెల్లోనూ విషాదం నిండిపోయింది. అంతేకాకుండా ప్రశాంత విశాఖ నగరం ఉలిక్కిపడింది. కారణం, ఏయూ నుంచి బయిటకు నడుచుకొని వెళుతున్న ఇరువురు యువ పరిశోధకుల భవిష్యత్తు బస్సు చక్రాల కింద నలిగిపోవడమే. యూనివర్శిటీ అసెంబ్లీ హాలు సమీపాన సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆ యువ పరిశోధకులు ఇరువురూ దుర్మరణం పాలవడం విశ్వవిద్యాలయ వర్గాలను తీవ్రంగా కలచివేసింది. ఈ ఘటన విద్యార్థి, మేధావి వర్గాలను కంటతడిపెట్టిస్తూనే తీవ్ర ఆగ్రహావేశాలకు గురిచేసింది. ఈ ప్రమాదానికి ఒక ప్రైవేటు బస్సు కారణమని తెలిసి విద్యార్థిలోకం నిరసనలు వ్యక్తం చేస్తూ పలు ప్రైవేటు బస్సులను విశ్వవిద్యాలయ ప్రాంగణంలోను, విశాఖ నగరంలో మరికొన్ని బస్సులను తగులబెట్టారు. ఆ ప్రమాదంలో మరణించిన కామర్స్ విభాగానికి చెందిన పి.ఎస్.ఎస్. ప్రసాద్, జువాలజీ విభాగానికి చెందిన ఎస్.అనురాధశ్రీ మృతదేహాలతో ధర్నాలు చేసి నగరంలోని రోడ్డులన్నింటినీ దిగ్బంధం చేశారు. ఈ వార్త రాష్ట్రవ్యాప్తంగా వ్యాపించింది. అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ విద్యార్థులు, పరిశోధకులు ధర్నాలు, నిరసనలతో సంఘీభావం తెలిపారు.



ఈ ఘటన పర్యవసానాలు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ప్రైవేటు బస్సు సర్వీసులను రద్దుచేసి ప్రభుత్వమే బస్సులను నడపాలనే నినాదం రాష్ట్రవ్యాప్తంగా ఊపందుకుంది. ఈ ఘటనకు తొమ్మిది నెలలకు ముందే ఏర్పడిన డా.మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వాన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. అప్పటి శాసనసభలో జనతా పార్టీకి సారథ్యం వహిస్తూ ప్రధాన ప్రతిపక్షనేతగా ఉన్న ఉత్తరాంధ్ర పెద్ద మనిషి గౌతు లచ్చన్న సభలో ఆ ఘటనను ప్రముఖంగా ప్రస్తావించారు. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే బస్సు సర్వీసులు నడపాలన్న డిమాండ్ ఆంధ్రా యూనివర్శిటీ నుంచి ఆంధ్ర దేశమంతటా బలంగా ప్రజల్లో సుస్థిరంగా వ్యాపించింది. ఈ పరిణామం నాటి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరింత కలవరపాటుకు గురిచేసింది. బస్సుల జాతీయకరణ విధానం అమలుపై 1967లో హైకోర్టు సంచలనాత్మక తీర్పుకు లోబడి నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి రాజీనామా చేసి రాజకీయ సంచలనం సృష్టించారు. ఈ నేపథ్యంలో ఏయూ రోడ్డు ప్రమాద ఘటన అనంతరం ఊపుందుకున్న డిమాండు సర్కారును తీవ్ర ఆలోచనకు, అయోమయానికి గురిచేసింది. అయినప్పటికీ దశలవారిగా ప్రైవేటు బస్సు సర్వీసులను రద్దుచేస్తామని ప్రభుత్వం హామీ ఇస్తూ ఉద్యమ తీవ్రతను తగ్గించింది. డా.చెన్నారెడ్డి తర్వాత వచ్చిన టంగుటూరి అంజయ్య, భవనం వెంకట్రామరెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి సారథ్యంలోని ప్రభుత్వాలూ ఆ దిశగా కొన్ని చర్యలు చేపట్టాయి. ముఖ్యపట్టణాల్లో ప్రైవేటు బస్సుల సర్వీసులను నిలిపివేశాయి. 1983లో అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు బస్సు సర్వీసులను రద్దుచేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా బస్సులను నడిపేందుకు నిర్ణయించింది. దీంతో 1958లో నైజాం సంస్థానం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదలాయించబడిన ఆర్టీసీ, క్రమంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కార్పొరేషన్‌గా పరిణమించింది. ప్రజల ప్రయాణసాధనాలలో ఈ ప్రగతిశీల మార్పునకు దోహదం చేసిన నాటి ఆంధ్రాయూనివర్శిటీ ఘటనను, అప్పటి ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నవారికి డిసెంబరు మాసం వచ్చినపుడల్లా మదిలో కదలాడుతూనే ఉంటున్నది. అప్పటి ఘటనకు గుర్తుగా పి.ఎస్.ఎస్. ప్రసాద్, ఎస్.అనురాధశ్రీలకు నివాళిగా ఏయూ సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ కళాశాలల అధికారిక విద్యార్థి సంఘాలు 1979 డిసెంబరు 5న యూనివర్శిటీలోని అసెంబ్లీ హాలు ప్రాంగణంలో ఒక స్మృతి చిహ్నాన్ని నిర్మించారు. రాష్ట్ర చరిత్రను మలుపు తిప్పిన ఈ ఘటనను మరింత రికార్డు చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది.

○ డాక్టర్ జి. లీలా వరప్రసాదరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్, జర్నలిజం విభాగం
డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం

పతనం అంచుల నుంచి పట్టాలెక్కిన పాలన

అమరావతిని మళ్లీ గాడిన పెట్టేందుకు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లు త్రిమూర్తుల్లా చేస్తున్న కృషి సత్ఫలితాలు ఇవ్వాలని యావత్ రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారు. కక్షలూ కార్పణ్యాల జోలికి పోకుండా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా భావించి, పెట్టుబడులే లక్ష్యంగా, లా అండ్ ఆర్డర్‌ను చక్కదిద్ది, దిగజారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిరంతరం పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషి ఫలించాలని కోరుకుందాం.



వాట్సాప్ కాల్స్ మాట్లాడే పరిస్థితి నుంచి మామూలు కాల్స్ మాట్లాడే స్వేచ్ఛ ప్రజలకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్పు ఏమిటని ప్రశ్నిస్తే సామాన్యుడు నుంచి అధికారుల వరకు చెప్పే మాట ఇది. ఐదేళ్ల వైసీపీ పాలనకూ, కూటమి ప్రభుత్వ సిల్వర్ జూబ్లీ (175 రోజుల) పాలనకు స్పష్టమైన తేడా ఇది. చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేయటం, కూటమిని అధికారంలోకి తేవటం చారిత్రాత్మక అవసరంగా భావించి ప్రజలు నభూతో నభవిష్యత్ అన్నట్లు ఇచ్చిన తీర్పును సద్వినియోగం చేసే దిశగా ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అలిపిరిలో క్లైమోర్‌మైన్లు పేల్చినా కన్నీరు పెట్టని చంద్రబాబు నాయుడుతో కన్నీరు పెట్టించిన వైసీపీకి ఘోర పరాభవం చవి చూపించారు ఏపీ ప్రజలు. 45 సంవత్సరాల తన రాజకీయ చరిత్రలో అలుగుటయే ఎరుగని అజాతశత్రువే అలిగిననాడు సాగరములన్నీయు ఏకం కాకపోవు అన్నట్లుగా చంద్రబాబు నాయుడు తాను చేసిన భీషణ ప్రతిజ్ఞ ప్రకారమే కౌరవ సభను గౌరవ సభను చేసి తిరిగి ముఖ్యమంత్రిగా సభలో అడుగు పెట్టారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఊరూ వాడా అన్ని చోట్లా భూముల రేట్లు తగ్గిపోయాయి. ఇప్పుడు మరల పెరుగుతున్న పరిస్థితి. రాష్ట్రంలో ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ వచ్చింది. దాని ఫలితమే ఇదంతా. కూటమి ప్రభుత్వం ఏర్పడేనాటికి ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి, ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు ఇస్తున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీతోపాటు ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, పింఛన్ల పెంపు, స్కిల్ సెన్సస్, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై సంతకాలు చేశారు. గత ప్రభుత్వం ప్రజలకు పింఛన్ల పంపిణీ చేసేందుకు వలంటీర్ల వ్యవస్థను తీసుకొస్తే చంద్రబాబు ఏకంగా తన ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు తాను కూడా ప్రజల వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీలో పాల్గొంటూ తాము పెత్తందారులం కాదు నిజమైన ప్రజా సేవకులం అని చాటారు. ప్రజలకు సుపరిపాలన అందించటానికి రోజువారీ ప్రణాళికలతో, రివ్యూలతో పరోపకారం ఇదం శరీరమన్నట్లుగా రోజుకు 18 గంటలపాటు రాష్ట్ర ప్రజల కోసం కష్టపడుతున్నారు.

ప్రతి సమస్యను సరికొత్త నైపుణ్యంతో, టెక్నాలజీతో పరిష్కరించి అవకాశంగా మలచుకుంటూ– రిలయన్స్, టీసీఎస్‌లాంటి ఎన్నో సంస్థలను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్రానికి తీసుకువస్తున్నారు. 2019లో ఒక్క ఛాన్స్ అని అడిగిన వైసీపీకి ప్రజలు అధికారం కట్టబెట్టారు. ప్రజలు ఇచ్చిన అవకాశం జగన్‌రెడ్డికి అదృష్టమైతే రాష్ట్ర ప్రజలకు దురదృష్టంగా మారింది. గత ప్రభుత్వంలో చదువుసంధ్యా లేని వాళ్లకి మంత్రి పదవులు ఇచ్చి కేవలం బూతులు తిట్టడానికే మంత్రులు అన్న అభిప్రాయాన్ని దేశ ప్రజలందరికీ కల్పించిన ఘనత జగన్‌రెడ్డికి దక్కుతుంది. ఇప్పటికీ ఎమ్మెల్యేలు అంటే తన ఇంటి బంట్రోతులు అనే భావనలోనే జగన్‌రెడ్డి ఉన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పాపానికి శాసనసభలో అధ్యక్షా అని అనగలమా అని కొత్తగా ఎన్నికైన వైసీపీ ఎమ్మెల్యేలు మథనపడుతున్న పరిస్థితి. వైసీపీ ఎమ్మెల్యేలకూ జగన్ తీరు నచ్చడం లేదు.

రాష్ట్రానికి మంచి చేయాలన్న చంద్రబాబు సంకల్పం ఎంత బలమైనదో పవన్ కల్యాణ్ నిరూపించారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీల్చనివ్వనని సింగిల్ పాయింట్ ఎజెండాతో ముందుకు వచ్చి కూటమి సాకారానికి కృషి చేశారు. తన సీట్లను సైతం తగ్గించుకుని ఎన్డీయే కూటమిగా ఏర్పాటుకు కృషి చేసిన ఘనత పవన్‌దే. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఉప ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రానికి తనవంతు సేవ చేస్తున్నారు. పల్లె పండుగగా పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రూ.4,500 కోట్ల నిధులతో 30 వేల రోడ్లు పనులను ప్రారంభించారు. దీనిని అతిపెద్ద గ్రామ పాలనగా గుర్తిస్తూ వరల్డ్ ఆఫ్ యూనియన్ రికార్డుగా నమోదు చేసింది.

నారా లోకేశ్ ఎన్నో సంస్థల ప్రతినిధులను కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వారికి ఏ విధంగా అనుకూలమో వివరించి పెట్టుబడులే లక్ష్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం శ్రమిస్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా తన శాఖతో పాటు పరిశ్రమలు తీసుకురావటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగా టీసీఎస్ కంపెనీ 10 వేల ఉద్యోగాలు తీసుకువచ్చిన ఘనత లోకేశ్ గారిదే. అలాగే ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సమావేశాలు ఏర్పరిస్తే 30 కంపెనీల వరకు హాజరయ్యాయి.

రాజధానిగా అమరావతిని జగన్‌రెడ్డి అంగుళం కూడా ముందుకు తీసుకెళ్లలేదు. పంచారామాల్లో మొదటిదైన శైవ క్షేత్రం ఉన్న ప్రాంతం, గౌతముడు నడయాడిన ప్రాంతం, మహావీరుడు సంచరించిన ప్రాంతం... అమరావతి. అలాంటి అమరావతిని స్మశానంతో పోల్చిన దుర్మార్గులు వైసీపీ నాయకులు. అలాంటి అమరావతిని మళ్లీ గాడిన పెట్టేందుకు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లు త్రిమూర్తుల్లా చేస్తున్న కృషి సత్ఫలితాలు ఇవ్వాలని యావత్ రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారు. కక్షలూ కార్పణ్యాల జోలికి పోకుండా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా భావించి, పెట్టుబడులే లక్ష్యంగా, లా అండ్ ఆర్డర్‌ను చక్కదిద్ది, దిగజారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిరంతరం పని చేస్తున్న ముఖ్యమంత్రి కృషి ఫలించాలని కోరుకుందాం.

■ యార్లగడ్డ వెంకట్రావు
ఎమ్మెల్యే, గన్నవరం

'ఆర్‌జీఎస్‌ఏ' శిక్షణలో సక్సెస్

- 24 నుంచి 4వ స్థానానికి ఏపీ
- స్థానిక సంస్థల ప్రతినిధులు, పంచాయతీరాజ్ సిబ్బందికి శిక్షణ అమలులో ముందంజ
- నాలుగు నెలల్లో గణనీయమైన ప్రగతి
- వైసీపీ హయాంలో అథమంలో రాష్ట్రం
- పథకాన్ని అటకెక్కించిన జగన్ సర్కార్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామీణాభివృద్ధికి సంబంధించి పలు అంశాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులకు శిక్షణకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకమైన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్ఎ) అమలులో కూటమి ప్రభుత్వం దూసుకుపోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ విషయంలో మన రాష్ట్రం అథమ స్థానంలో ఉండగా.. ఇప్పుడు అగ్రభాగానికి ఎగబాకుతోంది. ఈ స్కీమ్ అమల్లో జగన్ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ 24వ స్థానంలో ఉంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వ సమర్థవంతమైన కార్యాచరణ, చర్యలతో ఏకంగా 4వ స్థానానికి ఎగబాకింది. ఇదంతా కేవలం నాలుగైదు నెలల్లోనే సాధ్యం కావడం గమనార్హం. ఆర్‌జీఎస్‌ఏ అమలును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించడంతో.. దీని కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా రాలేదు. ఒక్క ప్రజాప్రతినిధికి కూడా శిక్షణ ఇవ్వకపోవడంతో.. కేంద్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా రాష్ట్రానికి ఒక్క పైసా విడుదల చేయలేదు. దీంతో ఆర్‌జీఎస్‌ఏ అమల్లో ఏపీ దేశంలో 24వ ర్యాంక్‌కు చేరుకుంది. దీంతో రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారులు ఢిల్లీ పంచాయతీరాజ్ శాఖ అధికారుల వద్దకు వెళ్లినప్పుడు.. తప్పు చేసిన వాళ్లలా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రాష్ట్రంలో ఆర్‌జీఎస్‌ఏను గాడిలో పెట్టాలని నిర్ణయించారు. ఆ మేరకు చర్యలు ప్రారంభించారు. అధికారుల నిరంతర కృషితో ఇప్పుడు ఆర్‌జీఎస్‌ఏ కింద శిక్షణ ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ ముందు భాగాన నిలిచింది. భవిష్యత్తులో దేశంలోనే అగ్రస్థానంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.



4 నెలల్లో 1.36 లక్షల మందికి శిక్షణ

ఆర్‌జీఎస్‌ఏ ద్వారా 2024-25లో సుమారు 3 లక్షల మంది ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు లక్ష్యాలు నిర్దేశించారు. ఈ ఏడాది జూలై నుంచి నవంబరు లోపు 1.36 లక్షల మందికి శిక్షణ అందించారు. 1.04 లక్షల మందికి స్థానికంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కోసం ప్రణాళికలు రూపొందించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమీక్షలు, అధికారుల పనితీరుతో ఇది సాధ్యమైంది. ఈ శిక్షణ కోసం రూ.22 కోట్లు ఖర్చు చేశారు.

శాఖాపరంగా పలు ఆటంకాలు

శిక్షణ ఇచ్చే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీ)ను గత వైసీపీ సర్కార్ గ్రామ, వార్డు సచివాలయ శాఖలో విలీనం చేసింది. దీంతో సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర పంచాయతీరాజ్ శాఖకు పంపించే వెసులుబాటు లేకుండా పోయింది. సంబంధం లేని శాఖకు ప్రతిపాదనలు పంపించడం అధికారులకు ఇబ్బందిగా మారింది. గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులకు ఈ ప్రతిపాదనలు పంపించే ఆసక్తి లేకపోవడంతో పథకం అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు ఎస్ఐఆర్‌డీని పంచాయతీరాజ్ శాఖలో విలీనం చేయాలని ఆదేశించడంతో.. ఆ ప్రక్రియ చకచకా జరిగిపోయింది.

శిక్షణ సంస్థపై ప్రత్యేక దృష్టి

తిరిగి శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగులు, స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రభావవంతంగా గ్రామీణాభివృద్ధి కోసం కృషి చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భావించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి ఎస్ఐఆర్‌డీ శిక్షణా సంస్థను అమరావతిలో నిర్మించేందుకు రూ.20 కోట్లు నిధులివ్వాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 200 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవని అధికారులు గుర్తించారు. ఈ భవనాలను నిర్మించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. అల్లూరి, మన్యం, అన్నమయ్య, గుంటూరు జిల్లాల్లో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాలను నిర్మించతలపెట్టారు. కంప్యూటర్లు లేని గ్రామ పంచాయతీల్లో 500 కంప్యూటర్లు కొనుగోలు చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. 102 మంది శిక్షణ పొందిన ప్రజాప్రతినిధులను క్షేత్రస్థాయి సందర్శనలకు తీసుకెళ్లారు. వెయ్యి మంది పంచాయతీరాజ్ సిబ్బందిని ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి అక్కడి పంచాయతీరాజ్‌శాఖ పనితీరుపై అధ్యయనం చేశారు. కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాలతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విజయనగరంలోని కేంద్ర గిరిజన యూనివర్సిటీలో ఏర్పాటు చేశారు. గిరిజనులకు సాంస్కృతిక, సంప్రదాయ వైద్య విధానం, వివాదాల పరిష్కారం, ఆర్థికంగా ఎదుగుదలపై ఈ కేంద్రంలో శిక్షణ అందిస్తారు. రూ.కోటి నిధులతో రాష్ట్రస్థాయి స్టూడియోను ఏర్పాటు చేసి పంచాయతీరాజ్ శాఖలోని 9 లెర్నింగ్ కేంద్రాల ద్వారా గ్రామీణాభివృద్ధి కోసం ఆన్‌లైన్ శిక్షణ అందిస్తున్నారు. ఇలా పలు కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆర్‌జీఎస్‌ఏకు తిరిగి పూర్వ వైభవం తీసుకురాగలిగారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆర్‌జీఎస్‌ఏ శిక్షణా సంస్థను అమరావతిలో నెలకొల్పడం ద్వారా దేశానికే తలమానికంగా చేయాలని పంచాయతీరాజ్ అధికారులు భావిస్తున్నారు.

అదానీ ఒప్పందాలను రద్దు చేయాలి: సీపీఐ

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం అదానీతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 9న అన్ని జిల్లాల్లోని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ పిలుపునిచ్చింది. అదానీ అవినీతి కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని, ఈ అవినీతిలో భాగస్వాములైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో ఈ కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు.

రద్దీ రోజుల్లో స్పర్శదర్శనం లేదు

- శ్రీశైలం దేవస్థానం వైదిక కమిటీ, అధికారుల నిర్ణయం

శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దేవస్థానం వైదిక కమిటీ, అధికారుల సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆలయ అధికారులు వెల్లడించారు. మల్లికార్జున స్వామివారి స్పర్శదర్శనం, ఆర్జిత గర్భాలయ, సామూహిక అభిషేకాలను రద్దీ రోజులు శని, ఆది, సోమ, ప్రభుత్వ సెలవు రోజులు, ప్రత్యేక రోజుల్లో పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాల సేవలు కూడా నిలుపుదల చేశారు. ఈ రోజుల్లో భక్తులందరికీ స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పించనున్నట్టు తెలిపారు. అలాగే అమ్మవారి ముఖ మండపంలో నిర్వహించుకునే కుంకుమార్చనను రద్దీ రోజులలో నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. ఈ సేవలకు సంబంధించిన టికెట్లను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నిలుపుదల చేసినట్లు, ముందుగానే టికెట్లు పొందిన భక్తులకు మాత్రం సేవలను నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు.

ఆనంద నిలయం బంగారు దాతలకు వీఐపీ బ్రేక్

- 25 ఏళ్ల పాటు ఈ సౌకర్యం.. టీటీడీ తాజా నిర్ణయం

తిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అర్థంతరంగా ఆగిపోయిన 'ఆనందనిలయం అనంతస్వర్ణమయం' పథకానికి గతంలో విరాళాలిచ్చిన దాతలకు ఇకపై వీఐపీ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. నవంబరు 18న జరిగిన బోర్డు సమావేశంలో ఈమేరకు తీర్మానం చేశారు. 2008లో రూ.100 కోట్ల వ్యయం అంచనాతో అనంతస్వర్ణమయం ప్రాజెక్టును టీటీడీ ప్రారంభించింది. ఇందుకోసం దాదాపు 95 కేజీల బంగారం, రూ.13 కోట్ల నగదును దాతలు అందజేశారు. అయితే ఆలయ ప్రాకారంపై ఉన్న అత్యంత విలువైన శాసనాలు కనుమరుగైపోతాయంటూ కొంతమంది కోర్టుకు వెళ్లడంతో 2011లో ఈ ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. ఈ క్రమంలో మూడు కేజీల బంగారం, రూ.కోటి నగదును దాతలు వెనక్కి తీసుకున్నారు. దాతల కోరిక మేరకు 27 కేజీల బంగారం, రూ.7.25 కోట్ల నగదును ఇతర ప్రాజెక్టులకు మళ్లించారు. ప్రస్తుతం అనంతస్వర్ణమయం ప్రాజెక్టు ఖాతాలో దాదాపు 60 కేజీల బంగారం, రూ.4.61 కోట్ల నగదు ఉంది. 4 కేజీల బంగారాన్ని అనంత స్వర్ణమయం పనుల్లో భాగంగా తొలుత వినియోగించారు. గతంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఉన్న ఆదికేశవుల నాయుడు ఈ ప్రాజెక్టును తెరపైకి తీసుకొచ్చారు. ఈ పథకానికి విరాళాలిచ్చిన దాతలకు అర్చనానంతర దర్శనం కల్పించాలని 2008 అక్టోబరు 25న టీటీడీ పాలకమండలిలో తీర్మానించారు. కొద్ది కాలం వీరికి దర్శనం కల్పించారు. ఆ తర్వాత వారిని టీటీడీ పట్టించుకోలేదు. ఆదికేశవుల నాయుడు మరణం తర్వాత 2020లో ఆయన కుమారుడు డీకే శ్రీనివాస్ ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించాలంటూ జగన్ ప్రభుత్వంలోని టీటీడీ బోర్డు ఛైర్మన్‌ను, సభ్యులను కలిసి కోరారు. అయితే ఆ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించే ఆలోచన లేదని టీటీడీ ప్రకటించింది. దాతలకు దర్శనం వంటి సౌకర్యాలనూ పట్టించుకోలేదు. బీఆర్ నాయుడు అధ్యక్షతన ఏర్పడిన టీటీడీ కొత్త పాలకమండలి ఈ అంశాన్ని మళ్లీ తెరమీదకు తెచ్చింది. ఈ పథక దాతలకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించాలని నిర్ణయించింది. దాత కుటుంబానికి సంబంధించి ఏడాదికి ఐదుగురికి మూడురోజుల పాటు వీఐపీ బ్రేక్, మూడురోజులు రూ.2,500 విలువ చేసే వసతి, ఏడాదికి 20 చిన్న లడ్డూలు, బహుమానంగా ఓ సారి వస్త్రం, దుపట్టా, బ్లౌజ్, మొదటి దర్శన సమయంలో 5 గ్రాముల బంగారు డాలర్, 50 గ్రాముల వెండి నాణెం ప్రివిలేజ్‌గా ఇవ్వాలని నిర్ణయించారు. విరాళం పాస్‌బుక్ జారీ చేసిన తేదీ నుంచి 25 ఏళ్ల పాటు ఈ సౌకర్యం దాతలకు చెల్లుబాటులో ఉండేలా తీర్మానం చేశారు.

నందిగం రిమాండ్ కోరవద్దు

- సత్యకుమార్ యాదవ్‌పై దాడి కేసులో పోలీసులకు హైకోర్టు స్పష్టీకరణ
- బెయిల్ పిటిషన్‌పై విచారణ 16కు వాయిదా



అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై గతంలో అమరావతిలో దాడికి సంబంధించిన కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈనెల 16కి వాయిదా వేసింది. అప్పటి వరకు ఈ కేసులో పీటీ వారెంట్ వేసి సురేష్‌ను రిమాండ్‌కు ఇవ్వాలని కోరవద్దని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కేసుకి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. కేసుపై దర్యాప్తును కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. దర్యాప్తునకు సహకరించాలని సురేష్‌ను ఆదేశించారు. నందిగం సురేష్ వ్యాజ్యం విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. సత్యకుమార్ యాదవ్‌పై దాడికి సంబంధించి ఈ ఏడాది అక్టోబర్ 25న నమోదైన కేసును.. గతంలో 2023 మార్చి 31న తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో కలిపివేశామన్నారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే స్పందిస్తూ.. ఒకే ఘటనకు సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారన్నారు. అయితే మరియమ్మ హత్య కేసులో పిటిషనర్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారన్నారు. సత్యకుమార్‌పై దాడి కేసులో పిటిషనర్‌ను రిమాండ్‌కు ఇవ్వాలని కోరుతూ పోలీసులు పీటీ వారెంట్ వేయలేదన్నారు. అందువల్ల ముందస్తు బెయిల్ కోరామన్నారు. ఓ కేసులో నిందితుడు జ్యుడీషియల్ కస్టడీ ఉన్నప్పుడు, మరో కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

జెత్వానీ కేసు.. ముగిసిన విద్యాసాగర్ వాదనలు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సినీ నటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ వేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ప్రాసిక్యూషన్, బాధితురాలు జెత్వానీ తరఫు వాదనల కోసం న్యాయస్థానం విచారణను నేటికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. పిటిషనర్ గత 75 రోజులుగా జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారన్నారు. జెత్వానీ ఆధార్ కార్డు, ఆస్తి డాక్యుమెంట్‌ను పిటిషనర్ ఫోర్జరీ చేశారనేందుకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. అందువల్ల ఐపీసీ సెక్షన్ 467 కింద కేసు నమోదు చెల్లుబాటు కాదన్నారు. జెత్వానీపై ఆరోపణలు తేల్చకుండా పిటిషనర్, కేసు దర్యాప్తు చేసిన పోలీస్ అధికారులపై కేసు నమోదు చేయడం సరికాదన్నారు. పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అనంతరం జెత్వానీ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ స్పందిస్తూ.. వాదనలకు సమయం ఇవ్వాలని, విచారణ వాయిదా వేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను నేటికి వాయిదా వేశారు.

కూతురి ప్రేమకు తల్లి బలి

- కూతురి ఫిర్యాదుతో ఇంటికొచ్చిన పోలీసులు
- పరువు పోయిందని తల్లి ఆత్మహత్య
- బంధువుల మాటలతో కుమార్తె ఆత్మహత్యాయత్నం



శ్రీలక్ష్మి

తాడిపత్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వేరే కులం యువకుడిని ప్రేమించిన కూతురు.. తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటికి పోలీసులు రావడంతో అవమానంగా భావించి తల్లి ఆత్మహత్య చేసుకుంది. బంధువుల సూటిపోటి మాటలతో కూతురు ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ సమీపంలోని ఐశ్వర్య విల్లాస్‌లో సోమవారం రాత్రి ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. పట్టణానికి చెందిన శ్రీనివాసులు, శ్రీలక్ష్మి (50) దంపతుల కూతురు శ్రీజ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. స్థానికంగా పెయింటింగ్ చేసుకునే ఓ యువకుడిని ప్రేమించింది. వేరే కులం కావడంతో పెళ్లి తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఆమె కొంతకాలం మౌనంగా ఉండిపోయింది. ఆ తరువాత మానవహక్కుల సంఘానికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసింది. వర్క్ ఫ్రం హోం చేస్తున్న ఆమె.. తనను తల్లిదండ్రులు నిర్బంధించారని ఫిర్యాదులో పేర్కొంది. రెండు రోజుల క్రితం (సోమవారం) డయల్ 100కు ఫోన్ చేసి మరోసారి ఇలాగే ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వారి ఇంటికి వెళ్లి విచారించారు. శ్రీజను ఎవరూ నిర్బంధించలేదని నిర్ధారించుకుని, నచ్చజెప్పి వెనుదిరిగారు. పోలీసులు ఇంటికి రావడంతో పరువు పోయిందని ఆవేదన చెందిన శ్రీలక్ష్మి.. సోమవారం రాత్రి విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. 'నీ కారణంగానే మీ అమ్మ ఆత్మహత్య చేసుకుంది' బంధువులు మండిపడడంతో శ్రీజ గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై శ్రీజ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి శ్రీలక్ష్మి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆమె భర్త శ్రీనివాసులును ఓదార్చారు.

జనవరి 2 నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం



విజయవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జనవరి రెండో తేదీ నుంచి 12వరకు పుస్తక మహోత్సవం నిర్వహిస్తున్నట్టు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు ఎమెస్కో విజయ్‌కుమార్, మనోహరనాయుడు, బెల్లం బాబ్జి తెలిపారు. విజయవాడలోని వీబీఎఫ్ఎస్ కార్యాలయంలో మీడియాతో మంగళవారం మాట్లాడారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి సాహితీ నవజీవన్ బుక్ లింక్స్ వ్యవస్థాపకుడు పిడికిటి రామకోటేశ్వరరావు పేరును, ప్రధాన సాహిత్య వేదికకు చెరుకూరి రామోజీరావు పేరును ఖరారు చేసినట్టు తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించే ప్రతిభా వేదికకు ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా పేరు పెట్టామన్నారు. ఈ పుస్తక మహోత్సవాల్లో ఆరుద్ర, దాశరథి కృష్ణమాచార్యులు, బుర్రకథ పితామహుడు నాజర్, నార్ల చిరంజీవి, ఆలూరి బైరాగి, ఎన్.నటరాజన్, సినీనటి భానుమతి శత జయంతి సభలు నిర్వహిస్తామన్నారు. ఆరో తేదీన విజయవాడలో బుక్ ఫర్ వాక్ ఉంటుందన్నారు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం వెలువడి 75ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సదస్సు, గ్రంథాలయాల పునర్వికాసానికి ఉద్యమిద్దాం అనే సదస్సు నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 250 మంది ప్రచురణకర్తలు ఈ మహోత్సవంలో పాల్గొంటారన్నారు.



విశాఖ డెయిరీలో అక్రమాలపై ఏర్పాటైన సభా సంఘం సమావేశంలో జ్యోతుల నెహ్రూ, పల్లా శ్రీనివాస్ తదితరులు

9న విశాఖ డెయిరీ పరిశీలన

- అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం
- సభాసంఘం తొలి భేటీలో నిర్ణయం

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీపై వచ్చిన అభియోగాలపై అసెంబ్లీ స్పీకర్ నియమించిన సభాసంఘం తొలి సమావేశం మంగళవారం అమరావతి అసెంబ్లీ కమిటీ హాలులో జరిగింది. జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన సభాసంఘ సభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బేబి నాయన, దాట్ల సుబ్బరాజు, బొండా ఉమ, గౌతు శిరీష పాల్గొన్నారు. డెయిరీలో అక్రమాలపై ఏ విధంగా చర్యలు తీసుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. విచారణ ఎలా ప్రారంభించాలనే అంశంపై ప్రాథమికంగా చర్చించారు. డెయిరీని సందర్శించిన తర్వాత సభాసంఘం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. భేటీ అనంతరం జ్యోతుల నెహ్రూ మీడియాతో మాట్లాడారు. 'పాడి రైతులకు ఉపయోగం లేకుండా, యాజమాన్యానికి లబ్ధి చేకూరేలా విశాఖ డెయిరీ వ్యవహారం ఉందని అభియోగాలు వచ్చాయి. అందువల్ల ఈనెల 9న విశాఖ డెయిరీని సభా సంఘం పరిశీలించనున్నది. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహిస్తాం. డెయిరీ ఎండీతో పాటు సంస్థ ఆర్థిక వ్యవహారాలు చూసేవారూ సమావేశానికి రావాలని చెప్పాం. స్పీకర్ అనుమతితో ఆడిటర్‌ను, సహకార, కంపెనీస్ చట్టాలపై అవగాహన ఉన్న నిపుణులను ఈ బృందంలో చేర్చుకుంటాం. పాడి రైతులకు నష్టం జరగకుండా సభా సంఘం సిఫారసులు ఉంటాయి' అని చెప్పారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'గతంలో లాభాల్లో నడిచిన విశాఖ డెయిరీ ఇప్పుడు నష్టాల్లోకి వెళ్లింది. ఆ నష్టాన్ని పాడి రైతుల మీద వేయడం సబబు కాదు. ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో, ఒక వ్యక్తి లబ్ధి కోసం అవకతవకలు జరిగాయని అభియోగాలున్నాయి. విశాఖ డెయిరీ కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా నష్ట నివారణ చర్యలకు సిఫారసు చేస్తాం. నిధుల మళ్లింపుపైనా సమగ్ర నివేదిక సభ ముందు ఉంచుతాం' అని చెప్పారు.

తెలియక తప్పు చేశాం.. క్షమించండి

- వేడుకున్న బిగ్‌బాస్ ఫేం ప్రియాంక, శివ



క్షమాపణ చెబుతున్న ప్రియాంక, శివ

తిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'మేం చేసిన ఓ వీడియో ఇంత మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తుందని అనుకోలేదు. ఆహ్లాదం కోసం చేసిన వీడియో ఇలా మారిపోయింది. ఇంతమంది హర్ట్ అవుతారని తెలిస్తే అసలు ఆ వీడియో చేసేవాళ్లం కాదు. టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చాలని కలలో కూడా అనుకోలేదు. తెలియకుండా జరిగిన ఈ తప్పును మీరందరూ క్షమించాలని కోరుకుంటున్నాం' అంటూ వీ ఆర్ సారీ అనే శీర్షికతో బిగ్‌బాస్ ఫేం ప్రియాంక, ఆమె స్నేహితుడు శివ మంగళవారం వీడియో ద్వారా వేడుకున్నారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. గతంలో వీరిద్దరూ కలిసి 'తిరుపతి దారిలో మా మీద చిరుత పులి ఎటాక్ చేసింది' అనే టైటిల్‌తో ఎడిట్ చేసిన వీడియోను సోషల్ మీడియాలో పెట్టారు. ప్రశాంతంగా ఉండే అలిపిరి నడకమార్గంలో చిరుత అంటూ పరుగులు తీసి ఆపై ప్రాంక్ అంటూ వెకిలి నవ్వులతో చేసిన ఆ వీడియో వైరల్‌గా మారింది. దానిపై భక్తుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అంతేగాక టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై క్రిమినల్ కేసులు పెట్టేలా టీటీడీ ఉన్నతాధికారులతో మాట్లాడతానని కూడా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రియాంక, శివ క్షమాపణ చెబుతూ వీడియో పోస్ట్ చేశారు.

శ్రీశైలం దేవస్థానం ఈవోగా శ్రీనివాసరావు



శ్రీశైలం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో కార్యదర్శి హోదాలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును డిప్యుటేషన్‌పై ఏడాది పాటు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్టు సమాచారం.

కౌలు రైతు చట్టాన్ని రూపొందించండి: లావు

న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో మంగళవారం ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతులు లబ్ధి పొందుతుండగా, అసలు సాగు చేసే కౌలు రైతుకు అర్హత, గుర్తింపు లేకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు.

చేనేత సమస్యలను తీర్చండి: పురందేశ్వరి

న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న 43 లక్షల మంది చేనేత కార్మికులు రుణ సదుపాయం, కొత్త డిజైన్లు, మార్కెట్ వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని లోక్‌సభలో బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కొత్త సాంకేతికతను ఉపయోగించి తీసుకుంటున్న చర్యలను తెలపాలని కోరారు.

'ఉపాధి'కి ఎన్డీయే ప్రభుత్వం పెద్దపీట: పెమ్మసాని

న్యూఢిల్లీ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులను రూ.87 వేల కోట్ల వరకు పెంచిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఉపాధి హామీ పథకంపై లోక్‌సభలో టీఆర్ బాలు, కేసీ వేణుగోపాల్, శశికాంత్ సెంథిల్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానం చెప్పారు. కూలీలకు రూ.700 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని చెప్పారు.

మామిడి రైతుకు పంటల బీమా

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మామిడి రైతులకు ఈ ఏడాది, వచ్చే ఏడాది రబీ సీజన్లలో పంటల బీమా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కోట్ చేసిన ప్రీమియం రేట్ల ప్రకారం మామిడికి బీమా అమలు చేసేందుకు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు పరిపాలన అనుమతి ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీ సమగ్ర శిక్షకు జాతీయ అవార్డు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అభియాన్ విభాగానికి జాతీయ స్థాయి అవార్డు లభించింది. 'దివ్యాంగ విద్యార్థుల హక్కుల చట్టం అమలులో ఉత్తమ రాష్ట్రం'గా ఏపీ ఎంపికైంది. సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఈ అవార్డును అందుకున్నారు. పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు అభినందనలు తెలిపారు.

లోకేశ్ అభినందనలు

విద్యారంగంలో ఏపీ దేశానికి దిక్సూచి అవుతుందని, అందుకు ఈ అవార్డు నాంది పలికిందని మంత్రి నారాలోకేశ్ అన్నారు. అధికారులను ఆయన అభినందించారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో వృత్తి విద్య

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీఎంశ్రీ పథకం కింద గుర్తించిన 629 పాఠశాలల్లో 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్య తరగతులు నిర్వహించాలని సమగ్రశిక్ష ఆదేశాలు జారీ చేసింది. వెంటనే చర్యలు ప్రారంభించాలని సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

న్యాయవాదుల లీగల్ డైరీని ఆవిష్కరించిన ఏజీ

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల 2025 సంవత్సర లీగల్ డైరీని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఆవిష్కరించారు. మంగళవారం హైకోర్టులోని తన చాంబర్‌లో ప్రభుత్వ న్యాయవాది బాలాజీ వడేరా ముద్రించిన ఈ డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'రాగూర్' ఫార్మా బరితెగింపు!

- హెచ్ఐవీ, హెపటైటిస్-బి మందుల తయారీ
- అనుమతులు లేకుండా 'లామివుడిన్' ఉత్పత్తి
- వారం క్రితం 'ఫాస్జిన్' విషవాయువు లీకై ప్రమాదం
- ఇద్దరు కార్మికులు మృతి.. 27 మందికి తీవ్ర అస్వస్థత
- ఉత్పత్తి నిలిపివేతకు ఫ్యాక్టరీస్ విభాగం ఆదేశం
- యూనిట్ మూసివేతకు చర్యలపై పీసీబీ సిఫారసు



పరవాడ ఫార్మాసిటీలోని రాగూర్ ఫార్మా కంపెనీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని రాగూర్ ఫార్మా కంపెనీ హద్దులు మీరింది. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా నిబంధనలు అతిక్రమించి హెచ్ఐవీ, హెపటైటిస్-బి మందులు తయారుచేస్తోంది. ఈ వ్యాధుల తీవ్రతను తగ్గించడానికి ఉపయోగించే 'లామివుడిన్' అనే యాంటీ రిట్రోవైరల్ మందును ఉత్పత్తి చేస్తోంది. దీనికి సంబంధించిన సమాచారం ప్రభుత్వ శాఖలకు ఇవ్వలేదు. ఈ మందు తయారు చేస్తుండగా నవంబరు 26న రియాక్టర్ నుంచి విష వాయువులు వెలువడ్డాయి. ఇద్దరు కార్మికులు మరణించగా, మరో 27 మంది తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. ఈ ప్రమాదంపై కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్ అధికారులను యాజమాన్యం తప్పుదోవ పట్టించింది. మ్యాన్‌హోల్‌లోకి హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫాం వేస్తుండగా పొగలు వచ్చాయని, దానివల్లే కార్మికులు చనిపోయారని చెప్పింది. అయితే 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' బృందం ప్రతినిధులు బాబూరావు, అనురాధలు.. యాజమాన్యం వాదనను ఖండించారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫాం కలవవని, వారు ఏదో పొడి వంటిది చల్లి ఉంటారని, దానివల్ల 'ఫాస్జీన్' విష వాయువు వెలువడి కార్మికులు చనిపోయి ఉంటారని ఆరోపించారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో అధికారులు ఆ కోణంలో విచారణ ప్రారంభించారు. రియాక్టర్ జీఎల్ఆర్ 325లోకి హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫాం వేస్తుండగా 'ఫీడ్ కంట్రోల్ సిస్టమ్' విఫలమైందని, కింద పడిన యాసిడ్‌ను తుడవడానికి కార్మికులు సోడా పౌడర్ చల్లడంతో ఆ రియాక్షన్‌కు 'ఫాస్జీన్' విషవాయువు వెలువడి కార్మికులు చనిపోయారని విచారణలో తేల్చారు. తక్షణమే లామివుడిన్ ఉత్పత్తిని ఆపేయాలని ఫ్యాక్టరీస్ విభాగం ఆదేశాలు ఇచ్చింది. ఆ యూనిట్ మూసివేతకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు.

అధికారులు గుర్తించిన లోపాలు

- ప్రమాదాల విశ్లేషణ, రిస్క్ మేనేజ్‌మెంట్‌కు ఏర్పాట్లు లేవు.
- లామివుడిన్ తయారీపై అధ్యయనం చేయలేదు.
- ప్రాంగణంలో సేఫ్టీ రిలీఫ్ వాల్వ్‌లు లేవు.
- రియాక్టర్లకు స్క్రబ్బింగ్ సిస్టమ్ లేదు.
- రప్చర్ డిస్కుల ఆనవాళ్లు లేవు.
- వాయువులు లీకైనప్పుడు డిటెక్టర్లు, అలారం సిస్టమ్ లేదు.

అక్టోబరులోనే సేఫ్టీ ఆడిట్... లోపాలు గుర్తింపు

రాగూర్ కంపెనీలో ప్రమాదం జరగడానికి నెల రోజుల ముందే ఆ కంపెనీలో ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. లోపాలను గుర్తించి, సరిచేయాలని కోరారు. ఆ ప్రక్రియ పూర్తికాక ముందే ప్రమాదం చోటుచేసుకుంది. లామివుడిన్ తయారీకి సంబంధించిన సమాచారం పీసీబీకి ఇవ్వలేదు. ఈ విధంగా అనుమతులు లేకుండా ముందులు తయారుచేస్తున్న కంపెనీలు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్ని ఉన్నాయో తెలీదు. ప్రమాదం జరిగిన తరువాత రాగూర్ యూనిట్‌ని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సందర్శించారు. కార్మికులకు పరిహారం ఇప్పించే ప్రయత్నం చేశారే తప్ప అనుమతుల విషయాన్ని బయటపెట్టలేదు. ఇలాంటి సంస్థలపై క్రిమినల్ కేసులు పెట్టాలని పూర్వ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ డిమాండ్ చేశారు.



పవన్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకొంటున్న గురుకులాల్లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అధ్యాపకులు

పీఆర్సీ అమలుకు గిరిజన లెక్చరర్ల విజ్ఞప్తి

- సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తమకు పీఆర్సీ అమలు చేయాలని కోరుతూ గిరిజన సంక్షేమ గురుకులాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, గెస్ట్ లెక్చరర్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశారు. మంగళవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి వచ్చినవారు డిప్యూటీ సీఎంకు తమ సమస్యలు విన్నవించారు. దీనిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు.

'వికసిత్ భారత్'లో పాల్గొనండి

- విద్యార్థులకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థులందరూ తమ ఆలోచనలను నేరుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పంచుకొనే అపూర్వ అవకాశాన్ని కల్పించే 'వికసిత్ భారత్ యువ నేతల సంభాషణ' కార్యక్రమంలో పాల్గొనాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. గతనెల 25న డిజిటల్ క్విజ్‌తో మై భారత్ వెబ్‌సైట్ ద్వారా వికసిత్‌భారత్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

బయోమెట్రిక్ వేయని సచివాలయ సిబ్బంది

- 15 వేల మందికి షోకాజ్ నోటీసులు జారీ

గుంటూరు సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధిగా బయోమెట్రిక్ హాజరు వేయాలి. అయితే.. 13 రోజుల పాటు వారు వరుసగా బయోమెట్రిక్ వేయకపోవడంతో ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలోని 15 వేల మంది గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఈ నోటీసులు జారీ చేశారు.

దివ్యాంగుల ధైర్యం ప్రశంసనీయం : నారా భువనేశ్వరి

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల ధైర్యం ప్రశంసనీయమని ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ పిన్నమనేని సాయిబాబా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భువనేశ్వరి దివ్యాంగులకు దుప్పట్లను, ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు.

ఏపీటీపీసీ ఎండీగా శేఖర్‌బాబు బాధ్యతలు

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరుగా ఐఎఫ్ఎస్ అధికారి శేఖర్‌బాబు గెడ్డం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఏపీటీపీసీ వీసీ అండ్ ఎండీగా బాధ్యతలు నిర్వహించిన చెరుకూరి శ్రీధర్ వైఎస్ఆర్ జిల్లా కలెక్టరుగా బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల ఐదో తేదీ నుంచి జరగాల్సిన నీటి సంఘాల ఎన్నికలను జల వనరుల శాఖ వాయిదా వేసింది. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో జల వనరుల శాఖ ఇంజనీర్లు విధులు నిర్వహించాల్సి ఉన్నందున ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది.

మేం చెయ్యం!



- ప్రభుత్వానికి 'అరబిందో' మరో లేఖ
- 108, 104 నిర్వహణ నుంచి తప్పుకొంటున్న సంస్థ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అరబిందో సంస్థ 108 అంబులెన్సులు, 104 వాహనాల నిర్వహణ నుంచి తప్పుకొనేందుకు సిద్ధమైంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అరబిందో సంస్థ పెద్ద తలనొప్పిగా మారింది. 108, 104 సేవలను సక్రమంగా అందించకపోవడంతోపాటు ఉద్యోగులకు సక్రమంగా జీతాలు కూడా చెల్లించడం లేదు. దీంతో ఉద్యోగులు ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇవ్వడంతోపాటు కొన్ని చోట్ల నిరసనలు తెలిపారు. అరబిందో సంస్థతో ప్రభుత్వం చర్చలు జరిపినా ఆ సంస్థ నుంచి స్పందన సక్రమంగా లేదు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సేవలు కొనసాగించేందుకు ఆ సంస్థ సుముఖంగా లేదు. తాము సేవలు అందించలేమంటూ ప్రభుత్వానికి 8 సార్లు లేఖలు రాసింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదంటూ రచ్చరచ్చ చేస్తోంది. తమ కాంట్రాక్ట్‌ను మరొక సంస్థకు ఇవ్వాలని అక్టోబరులో రాసిన లేఖలో ప్రభుత్వానికి సూచనలు చేసింది. 108, 104 సేవలను కొనసాగించలేమంటూ తాజాగా నవంబరు 25న మరో లేఖ రాసింది. వైసీపీ ప్రభుత్వం కూడా అరబిందో సంస్థకు కోట్ల రూపాయలు బకాయిలు పెట్టింది. అప్పుడు నోరెత్తని అరబిందో సంస్థ కూటమి ప్రభుత్వంలో మాత్రం బిల్లులు రావడం లేదని రచ్చ చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.70-80 కోట్ల వరకూ విడుదల చేసింది. అయినా ఆ సంస్థ ప్రతినిధులు ప్రభుత్వంపై బురద జల్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఆ సంస్థను తప్పించేందుకు ప్రభుత్వం కూడా అంగీకరించింది. 108, 104 సేవలను సక్రమంగా కొనసాగించేందుకు అరబిందోను తప్పించడమే కరెక్టని ప్రభుత్వం నిర్ణయించింది. అరబిందో సంస్థ 108, 104 ఉద్యోగులకు నరకం చూపిస్తోంది. 102 వాహనాలు(తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్) ఉద్యోగులకు కూడా ఆ సంస్థ సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని సాకులు చెబుతోంది.

నవ్య | చిత్రజ్యోతి



శ్రద్ధా ఇంటి రెంట్ ఎంతో తెలుసా?

'స్త్రీ 2' చిత్రం సూపర్ హిట్‌తో జోష్ మీద ఉన్నారు బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్. పారితోషికం కూడా అమాంతం పెంచేశారట. ఆమె చెబుతున్న రేట్లు వింటుంటే నిర్మాతలకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయని బీ టౌన్ టాక్. తెలుగులో 'పుష్ప 2' లో ఐటెం సాంగ్‌కు మొదట శ్రద్ధనే అడిగారు. కానీ ఆమె చెప్పిన పారితోషికం విన్న తర్వాత మనసు మార్చుకుని శ్రీలీలను ఎంపిక చేశారు. అలాగే నాని హీరోగా రూపొందే సినిమాలో కూడా కేవలం పారితోషికం కారణంగా అవకాశం కోల్పోయారు శ్రద్ధ. 'అయినా డోంట్ కేర్ .. నా సినిమాలు నాకు ఉంటాయి' అనే రీతిలో శ్రద్ధా ప్రవర్తిస్తోందని చెబుతున్నారు. పారితోషికం విషయం పక్కనపెడితే, ఈ మధ్య ఆమె అద్దెకు తీసుకున్న ఫ్లాట్ గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. సినిమా వాళ్లంతా ఉండే జుహూ ప్రాంతంలో ఓ ఖరీదైన అపార్ట్‌మెంట్‌ను శ్రద్ధా రెంట్‌కు తీసుకుంది. అద్దె ఎంతో తెలుసా? నెలకు రూ.ఆరు లక్షలు. ఒక ఏడాది పాటు ఈ ఫ్లాట్‌ను లీజ్‌కు తీసుకున్న శ్రద్ధ సంవత్సరం అద్దె రూ. 72 లక్షలు ముందే కట్టేశారట. నాలుగు కార్లు పార్క్ చేసుకోవడానికి సదుపాయం ఉందట. సొంతంగా ఫ్లాట్ కొనుక్కునే స్తోమత ఉన్నా కూడా శ్రద్ధ కొనుక్కోకుండా అద్దె ఇంట్లోకి ఎందుకు వెళుతుందో ఆమెకే తెలియాలి!



గోదారి గట్టు ప్రేమగీతం

వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ కథానాయికలుగా నటిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న విడుదల కానుంది. మంగళవారం ఈ సినిమా నుంచి తొలి గీతాన్ని విడుదల చేశారు. 'గోదారి గట్టు' అంటూ సాగే ఈ రొమాంటిక్ గీతంలో వెంకటేశ్, ఐశ్వర్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. భాస్కర భట్ల రచించగా.. రమణ గోగుల, మధు ప్రియ ఆలపించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ సినిమా గురించి వెంకటేశ్ మాట్లాడుతూ "ఒక మాజీ పోలీసు.. మాజీ ప్రేయసి.. అద్భుతమైన భార్య మధ్య జరిగే అందమైన ప్రయాణం ఈ సినిమా. ఈ సంక్రాంతికి ఒక మంచి వినోదాత్మక చిత్రాన్ని ప్రేక్షకులకు అందివ్వాలనే సినిమాను అద్భుతంగా తెరకెక్కించాం. నా కెరీర్‌లో నేను నటించిన ఉత్తమ కుటుంబ కథా చిత్రమిదే. అందరికీ నచ్చుతుంది. అనిల్‌తో పనిచేయడం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది" అని చెప్పారు. కాగా, వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఇది వరకు వచ్చిన 'ఎఫ్ 2'.. 'ఎఫ్ 3' చిత్రాలు మంచి విజయం సాధించాయి.



నాని సమర్పణ దసరా దర్శకుడు

మెగాస్టార్ కొత్త చిత్రం

చిరంజీవి కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రం ఖరారైంది. హీరో నాని సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కనుండడం విశేషం. ఆయన మంగళవారం ఈ సినిమా వివరాలను సోషల్ మీడియా ద్వారా తెలిపారు. నాని హీరోగా నటించిన 'దసరా' చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీకాంత్ ఓదెల ఇప్పుడు చిరంజీవిని డైరెక్ట్ చేసే అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రక్తంతో తడిసిన చేతులు ఉన్న పోస్టర్‌ను షేర్ చేసి, 'హింసలోనే అతడు తన శాంతిని వెతుక్కున్నాడు' అనే వ్యాఖ్యను జోడించారు. దీన్ని బట్టి ఈ చిత్రం మాస్ అంశాలతో తెరకెక్కుతోన్న యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. 'నేను హీరో అవ్వడానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి చిరంజీవి. ఆయన సినిమా టికెట్ల కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి చూశాను. ఓసారి సైకిల్ కూడా పోగొట్టుకున్నాను. ఇప్పుడు సమర్పకుడిగా ఆయనతో ఓ చిత్రం చేయబోతున్నా. చిరంజీవిని సరికొత్తగా చూపించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం. నా దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఆ కల తీరబోతోంది' అని నాని చెప్పారు. ఫ్యాన్‌బాయ్ తాండవం ఎలా ఉంటుందో చూపిస్తాను అని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల స్పందించారు. ఆయన ప్రస్తుతం నానితో 'ప్యారడైజ్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి 'విశ్వంభర' చిత్రం చేస్తున్నారు. ఇవి రెండూ పూర్తయ్యాక కొత్త సంవత్సరంలో చిరంజీవి సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.



తెరపై శివాజీ గాథ

కన్నడ హీరో, 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి మరో భారీ ప్రాజెక్ట్‌కు సైన్ చేశారు. వీర యోధుడు ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కనున్న ఈ సినిమా టైటిల్ 'ద ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహరాజ్'. బాలీవుడ్ దర్శకుడు సందీప్ సింగ్ తెరకెక్కించనున్నారు.





మంగళవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు సందీప్ సింగ్ మాట్లాడుతూ "ఈ సినిమా చేయడాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నా. ఈ పాత్ర కోసం రిషబ్‌ను ఎంచుకోవడానికి కారణం.. ఆయన ఛత్రపతి శివాజీ మహారాజ్ బలాన్ని.. పరాక్రమాన్ని మూర్తీభవిస్తాడు. ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. భారతీయ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని యాక్షన్‌ను ఇందులో చూస్తారు. అన్ని అసమానతలను ఎదురించి పోరాడిన ఓ వీరోచిత యోధుడి మహా గాథ ఇది" అని చెప్పారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 2027 జనవరి 21న విడుదల కానుంది.

రిటైర్మెంట్ కాదు విరామమే..



బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సే నటనకు విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇది తాత్కాలికమా..లేదా ఆయన పూర్తిగా నటన నుంచి వైదొలగారా అనే చర్చ సోషల్‌మీడియాలో నడుస్తోంది. ఈ విషయంపై విక్రాంత్ స్పష్టతనిచ్చారు. "నాకు వచ్చింది.. నేను చేయగలిగేది నటన మాత్రమే. నటనే నాకు ఈ స్థాయిని ఇచ్చింది. ఈ మధ్య నా శారీరక.. మానసిక ఆరోగ్యం దెబ్బతింది. ప్రస్తుతం నాకు అంతా మొనాటనీగా అనిపిస్తోంది. అందుకే నేను సినిమాల నుంచి కాస్త విరామం తీసుకుని.. మరింతగా నా నటనను మెరుగుపరచుకుందామని అనుకుంటున్నాను. నేను నటనకు విరామం ఇస్తున్నా అని చెప్పిన పోస్టును చాలా రకాలుగా అర్థం చేసుకుంటున్నారు. నేను రిటైర్ అవ్వటం లేదు. ఫ్యామిలీ కోసం.. ఆరోగ్యం కోసం తగిన సమయం కేటాయించాలనుకుంటున్నాను. సరైన సమయం వచ్చినప్పుడు మళ్లీ తిరిగి వస్తా" అని చెప్పారు. కాగా, విక్రాంత్ నటించిన తాజా చిత్రం 'సబర్మతీ ఎక్స్‌ప్రెస్' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు ప్రధాని నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ "ప్రధాని మోదీతో కలసి నా సినిమాను చూడటం నా జీవితంలోనే మరిచిపోలేని అనుభూతి" అని తెలిపారు.



ఎదలో సవ్వడి

గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'కన్యాకుమారి'. రాడికల్ పిక్చర్స్ బేనర్‌పై దర్శక నిర్మాత సృజన్ అట్టాడ రూపొందిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా నుంచి 'ఎద ఎద సవ్వడి' లిరికల్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సృజన్ అట్టాడ లిరిక్స్ అందించగా..అనురాగ్ కులకర్ణి, జయశ్రీ పల్లెం పాడారు. రవి నిడమర్తి బ్యూటిఫుల్‌గా ట్యూన్ చేశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

ఆదిపురుష్ దర్శకుడి కొత్త చిత్రం



'ఆదిపురుష్' చిత్ర దర్శకుడు ఓం రౌత్ పేరు చెబితే చాలు ప్రభాస్ ఫ్యాన్స్ ఉలిక్కి పడతారు. రామాయణ గాథని ఈ యువ దర్శకుడు ఇంకెంత గొప్పగా చెబుతాడో అని ఆసక్తిగా ఎదురు చూసిన ప్రభాస్ అభిమానులే కాదు సాధారణ ప్రేక్షకులు కూడా ఆ సినిమా చూసి నివ్వెర పోయారు. ఓం రౌత్ పైత్యం, విపరీత ధోరణి వారిని ఆశ్చర్యానికి, ఆగ్రహానికి గురి చేసింది. విమర్శకుల దాడిని తట్టుకోలేక అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు రౌత్. తను ఎక్కడ ఉన్నదీ తెలియకుండా జాగ్రత్త పడ్డారు. మళ్లీ ఇన్ని రోజుల తర్వాత బయటకు వచ్చిన ఓం రౌత్ కొత్త సినిమా సన్నాహాలు ప్రారంభించారు. ఈసారి పౌరాణిక కథను కాకుండా చారిత్రక నేపథ్యంలో ఓ చిత్రం తీయనున్నారు. అజయ్ దేవగణ్‌ను ఒప్పించి, ఆయన డేట్స్ సంపాదించారు. హృతిక్ రోషన్ ఇందులో విలన్‌గా నటించే అవకాశాలు ఉన్నాయని బీ టౌన్ టాక్. ఈసారైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని ఓం రౌత్ ఈ సినిమా తీయాలని జనం కోరుకుంటున్నారు.



సీవీటీ... చెకింగ్ వెహికల్ టాక్స్. వాణిజ్య పన్నుల శాఖ విధి నిర్వహణలో ఇదొక భాగం. వివిధ ప్రాంతాల నుంచి సరుకులతో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేసి బిల్లులు ఉన్నాయా, ప్రభుత్వానికి పన్నులు చెల్లించారా లేదా అన్న విషయాన్ని పరిశీలించేది సీవీటీ. అత్యంత గోప్యంగా ఉండాల్సిన ఈ సమాచారం కార్యాలయం గేట్లు దాటుతోంది. ఎక్కడ తనిఖీలు జరుగుతాయో ఆ ప్రదేశం వివరాలన్నీ డీలర్లు, ఆడిటర్లకు ముందే చేరుతున్నాయి. ఇదిప్పుడు వాణిజ్య పన్నుల శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. కొంతమంది అధికారులు వద్ద ఉండే కిందిస్థాయి సిబ్బంది నుంచి ఈ సమాచారం లీకవుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

సీవీటీ లీక్‌లు



వాణిజ్య పన్నుల శాఖ తనిఖీల సమాచారం బయటకు..

- సీవీటీ తనిఖీల్లో కిందిస్థాయి సిబ్బందిదే కీలక పాత్ర
- చిక్కిన వాహనాలతో బేరసారాలు
- కొద్ది రోజుల కిందట రెండో డివిజన్‌లో పంచాయితీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం మూడు డివిజన్లు ఉన్నాయి. విజయవాడ 1 డివిజన్ పరిధిలో నందిగామ, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, పార్కు రోడ్డు, ఇంద్రకీలాద్రి, భవానీపురం సర్కిళ్లు ఉన్నాయి. విజయవాడ 2 డివిజన్‌లో సామారంగ్‌చౌక్, కృష్ణలంక, బెంజ్‌సర్కిల్, సూర్యారావుపేట, ఆటోనగర్, గాంధీనగర్ సర్కిళ్లు ఉన్నాయి. విజయవాడ 3 డివిజన్‌లో బందరు, గుడివాడ, రామవరప్పాడు, పెనమలూరు, పటమట సర్కిళ్లు ఉన్నాయి. మొత్తం ఉమ్మడి జిల్లాలో 17 సర్కిళ్లు ఉన్నాయి. ఇవి కాకుండా ఒక్కో డివిజన్‌లో స్పెషల్ సర్కిల్ ఉంటుంది. వాటితో కలిపి మొత్తం 20 సర్కిళ్లు ఉన్నాయి.

అసలు ఏం జరుగుతోంది?

ఈ సర్కిళ్లలో అధికారులు నిత్యం సీవీటీ తనిఖీలు చేస్తుంటారు. ఈ తనిఖీల్లో డీసీటీఓ, ఏసీటీఓ, ఇన్‌స్పెక్టర్ ఉంటారు. వారితోపాటు వాహనాలను ఆపడానికి అటెండర్లు, వాచ్‌మన్‌లను కొంతమంది ఉపయోగించుకుంటున్నారు. కొంతమంది అధికారులు వారి వాహనాలను నడిపే డ్రైవర్లను తనిఖీలకు నియమించుకుంటున్నారు. ఒకప్పుడు డివిజన్లలో సర్కిళ్ల అధికారులు తోచినప్పుడల్లా తనిఖీలకు వెళ్లేవారు. వైసీపీ హయాంలో ఈ విధానం మొత్తం పూర్తిగా మారిపోయింది. కమిషనర్ కార్యాలయం నుంచి తనిఖీలకు వెళ్లమని ఆదేశాలు వస్తేనే సర్కిళ్ల నుంచి అధికారులు రహదారుల మీదకు రావాలి. కమిషనర్ కార్యాలయం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండా తనిఖీలకు వెళ్లినట్టు తెలిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. సీవీటీ తనిఖీలకు సంబంధించి కమిషనర్ కార్యాలయం నుంచి డివిజన్ల పరిధిలో సర్కిళ్లకు ఆదేశాలు వస్తున్నాయి. ఒక సర్కిల్ పరిధిలో జరిగే తనిఖీలకు మరో సర్కిల్ అధికారులను రంగంలోకి దింపుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ సీవీటీ తనిఖీల సమాచారం వాహనాల్లో సరుకులను పంపే సంస్థల అధినేతలకు చేరుతోంది. కొన్నిచోట్ల మాత్రం తనిఖీల సమయంలో లోపాలను గుర్తించిన అధికారులు వెంటనే బేరసారాలు మొదలుపెడుతున్నారు. ఈ లావాదేవీల్లో గుమస్తాలు, అటెండర్లు, వాచ్‌మెన్‌లు, డ్రైవర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

సీవీటీలో పాల్గొన్న అధికారులకు క్లాస్

ఇటీవల విజయవాడ-2 డివిజన్ అధికారులు తనిఖీలకు వెళ్లినప్పుడు ఓ వాహనదారుడి నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేశారు. ఈ విషయం అప్పిలేట్ అథారిటీ విభాగంలో అధికారి దృష్టికి వెళ్లింది. దీనితో ఆయన పంటకాల్వ రోడ్డులో ఉన్న వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఈ విషయాన్ని చాలా గోప్యంగా ఉంచారు. సీవీటీలో పాల్గొన్న అధికారులకు క్లాస్ తీసుకున్నట్టు తెలిసింది. బిల్లులో లోపాలను గుర్తించి ఈ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారా? తనిఖీలకు వెళ్లాం కాబట్టి డబ్బులు తీసుకోవాలని అనుకున్నారా? అన్న విషయంలో స్పష్టత రాలేదు. ఒకవేళ బిల్లుల్లో లోపాలు ఉంటే ఆ వాహనదారులు నేరుగా అప్పిలేట్ అథారిటీ విభాగంలోని అధికారికి వద్దకు వెళ్లే సాహసం చేస్తారా అన్నది మరో ప్రశ్న. వాణిజ్య పన్నుల శాఖలోని ఉద్యోగులు రెండు, మూడు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాల నాయకులు విధులు నిర్వర్తించకుండా ఓడీ (ఆన్‌డ్యూటీ)ని బాగా ఉపయోగించుకుంటున్నారు. ఈ సంఘాల్లో ఉండే కొంతమంది నాయకులు సీట్లలో కూర్చోకుండా ఇతర వ్యవహారాలను చక్కబెట్టడంలో నిపుణులుగా మారారని రోపణలు ఉన్నాయి. సీవీటీల సమాచారం అసలు ఎవరి నుంచి ఆయా సంస్థలకు అందుతుందో తేల్చుకోలేని స్థితిలో ఉన్నతాధికారులు ఉన్నారు.

ముమ్మరంగా కొనుగోళ్లు

ఎన్టీఆర్ జిల్లాలో రూ.41.49 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

- 19,499.08 మెట్రిక్ టన్నులు విక్రయించిన రైతులు
- రైతుల ఖాతాల్లో రూ.39.11 కోట్లు జమ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ముమ్మరంగా కొనుగోళ్లు సాగుతున్నాయి. ఎన్టీఆర్‌జిల్లాలో సోమవారం వరకు 19,499.08 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన మొత్తం విలువ రూ. 41.49 కోట్లుగా ఉంది. రైతులకు రూ. 39.11 కోట్ల మేర చెల్లింపులు చేశారు. మరో రూ.2.38 కోట్లు చెల్లించటానికి సిద్ధంగా ఉన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తిరువూరు డివిజన్ పరిధిలో 48 రైతు సేవా కేంద్రాల పరిధిలో కొనుగోళ్ల ప్రారంభం కాగా, విజయవాడ డివిజన్‌లో 22 కొనుగోలు కేంద్రాలు, నందిగామ డివిజన్‌లో 25 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఎంటీయూ 1282, ఎంటీయూ 1262 రకాలను కూడా ఎన్టీఆర్ జిల్లాలో సివిల్ సప్లయిస్ అధికారులు కొనుగోలు చేస్తున్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల దగ్గరకు వెళ్లి కనీస మద్దతు ధరతో ధాన్యాన్ని అమ్ముకోవాలని ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం టీవీ సతీష్ విజ్ఞప్తి చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 7702203571కు కాల్ చేస్తే నిరంతరం తగిన సహాయ, సహకారాలను అందిస్తామని చెప్పారు.



మిర్చి రైతుకు ధరాఘాతం!

8లో



రాజీవ్‌నగర్‌లో చెత్తకుప్పలో దొరికిన ఆడశిశువు

చెత్తకుప్పలో ఆడ శిశువు

- చీమలు కుట్టి, చలికి వణికిపోయిన పసిప్రాణం
- స్థానికుల చొరవతో ఆస్పత్రికి తరలింపు
- రాజీవ్‌నగర్ ప్రాంతంలో ఘటన



పాయకాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిది నెలలు తల్లి గర్భంలో పదిలంగా పెరిగిన పసికందు భూవిపై పడ్డ మరుక్షణం తల్లికి దూరమైంది. ముర్రు పాలు రుచి చూడాల్సిన బిడ్డ వ్యర్థాల దుర్వాసన నడుమ గొంతు ఎండేదాక ఏడ్చింది. పొత్తిళ్లలో వెచ్చదనాన్ని ఆస్వాదించాల్సిన పసిప్రాణం ఒంటిపై గుడ్డముక్క కూడా లేకుండా ఎముకలు కొరికే చలికి వణికిపోయింది. మృదువైన శరీరం చీమలు పట్టిన స్థితిలో రోడ్డు పక్కన చెత్త కుప్పలో విలవిల్లాడిపోయిన హృదయ విదారక ఘటన పాయకాపురం రాజీవ్‌నగర్ ప్రాంతంలో మంగళవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక కొత్తరాజీవ్‌నగర్ సాయిబాబా ఆలయం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన మరుగుగా ఉన్న చోటు నుంచి పసికందు ఏడుపును స్థానికులు గుర్తించారు. అక్కడ మనుషుల అలికిడి లేకపోవడంతో అనుమానం వచ్చి దగ్గరకు వెళ్లి చూశారు. రోడ్డు మలుపులో ఉన్న చెత్త మధ్యలో ఆడ శిశువు ఏడుస్తుండటాన్ని గుర్తించారు. వెంటనే నున్న రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చి ఆ పసికందును అక్కున చేర్చుకున్నారు. ఒంటిపై దుస్తులు లేకుండా, చీమలు కుట్టి అల్లాడుతున్న పసిబిడ్డను చూసి చలించిపోయిన అక్కడివారు దుప్పటి కప్పి సపర్యలు చేశారు. అనంతరం నున్నరూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బిడ్డను నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం తల్లి కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. ఆడ శిశువు పుట్టిన గంటల వ్యవధిలోనే చెత్తకుప్పలోకి చేరడం, కనీసం బొడ్డుతాడు కూడా కట్టిలేకపోవడంతో ఇంటివద్దనే ప్రసవం జరిగి ఉంటుందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



గన్నవరంలోని రవాణాశాఖ ఫిట్‌మెంట్ సెంటర్లో తుప్పుపట్టిన స్థితిలో క్రేన్లు

తుప్పు పట్టించారు..!

రోడ్డుపై మోరాయించిన వాహనాల తొలగింపునకు 2 భారీ క్రేన్లు ఇచ్చిన కేంద్రం

8 ఏళ్లుగా వినియోగించుకుండా మూలనపడేసిన రవాణాశాఖ

- వీఐపీ కారిడార్‌లో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- క్లియర్ చేయలేక అల్లాడుతున్న ట్రాఫిక్ పోలీసులు
- క్రేన్లు కావాలని కలెక్టర్‌కు ఇటీవల డీసీపీ విజ్ఞప్తి
- ఆ 2 క్రేన్లను వినియోగంలోకి తెస్తే తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

జాతీయ రహదారులు, వీఐపీ కారిడార్‌లో వాహనాలు మోరాయించినప్పుడు ట్రాఫిక్ క్లియర్ చేయడంలో కీలకపాత్ర పోషించే భారీ క్రేన్లు రవాణాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్రం నుంచి ఎనిమిదేళ్ల కిందటే మంజూరైనా నేటికీ వినియోగానికి నోచుకోక తుప్పుపట్టిపోయాయి. వీఐపీ కారిడార్‌లో తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలకు కోట్ల రూపాయల విలువైన ఈ క్రేన్లతో చెక్ పెట్టవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారులపై జరుగుతున్న వాహన ప్రమాదాలు, వాహనాల మోరాయింపుల వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సాధారణంగానే నగర రహదార్లపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో యాక్సిడెంట్ అయిన వాహనాలను, మోరాయించిన వాహనాలను తొలగించడం శక్తికి మించినపని అవుతోంది. దీంతో వీఐపీ కారిడార్‌లో విమానాశ్రయం నుంచి వచ్చే అతిథుల వాహనాలు ట్రాఫిక్ చక్రబంధంలో మిగతా 8లో..

ఐఆర్‌సీటీసీ బాట్లింగ్ ప్లాంట్‌లో వార్!



- సివిల్, ఫ్యాబ్రికేషన్స్ పనులు చేయించుకుని రూ. 37.52 లక్షలు ఎగ్గొట్టిందని ఆరోపణ
- మెహాయ్ ఆక్వాకు రూ. 1.50 కోట్ల చెల్లింపులు నిలుపుదల చేసిన ఐఆర్‌సీటీసీ
- ధనలక్ష్మీ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని మెలిక

మెహాయ్ ఆక్వాపై ధనలక్ష్మీ ప్యాట్రన్స్ ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లిలోని రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్‌లో సివిల్, ఫ్యాబ్రికేషన్ పనులు చేయించుకుని లక్షల రూపాయల డబ్బులను ఎగ్గొట్టిందని 'మెహాయ్ ఆక్వా' సంస్థపై ఐఆర్‌సీటీసీ ఉన్నతాధికారులకు కాంట్రాక్టు సంస్థ 'ధనలక్ష్మీ ప్యాట్రన్స్' యాజమాన్యం ఫిర్యాదు చేసింది. న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) రైల్‌నీర్ విభాగాధిపతి అయిన జీజీఎంకు ధనలక్ష్మీ ప్యాట్రన్స్ తరఫున ఏ.కాశేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఐర్‌సీటీసీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మల్లవల్లిలో తలపెట్టిన రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్‌ను 'మెహాయ్ ఆక్వా' సంస్థ నిర్వహిస్తోంది. ఈ సంస్థ తమ ప్లాంట్‌లో సివిల్, ఫ్యాబ్రికేషన్ పనులను ధనలక్ష్మీ ప్యాట్రన్స్ అనే సంస్థకు కాంట్రాక్టు ఇచ్చింది. కాంట్రాక్టు సంస్థకు రూ.37.52 లక్షల మేర బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. దీనిపై మెహాయ్ సంస్థను అడగగా తమకు సంబంధం లేదని బుకాయించటంతో వివాదం మొదలైంది. కొంతమంది ప్రైవేటు వ్యక్తులు దూషణలు, దాడులకు తెగపడటంతో రెండు కాంట్రాక్టు సంస్థల మధ్య వివాదానికి దారి తీసింది. మల్లవల్లి బాట్లింగ్ ప్లాంట్‌లో సివిల్ , ఫ్యాబ్రికేషన్స్ పనులు చేపట్టిన ధనలక్ష్మీ ప్యాట్రన్స్ సంస్థ ఐఆర్‌సీటీసీ హెడ్ ఆఫీసుకు ఈ అంశంపై ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు కంటే ముందు వీరవల్లి పోలీసు స్టేషన్‌లో కూడా మెహాయ్ ఆక్వాపై, ఓ ప్రైవేటు వ్యక్తి పైనా ఫిర్యాదు చేసింది. మెహాయ్ ఆక్వా బిల్లు చెల్లింపులు జరపకపోగా ఓ ప్రైవేటు వ్యక్తితో తమపై దాడి చేయించే ప్రయత్నం చేసిందని ఆరోపిస్తూ ధనలక్ష్మీ ప్యాట్రన్స్ సంస్థ పోలీసు కేసు పెట్టింది.

ఫిర్యాదుపై స్పందించిన ఐఆర్‌సీటీసీ అధికారులు

ఈ కేసు పూర్వాపరాలు ఎలా ఉన్నా తాజాగా ధనలక్ష్మీ సంస్థ మళ్లీ ఢిల్లీలోని ఐఆర్‌సీటీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో సంచలనంగా మారింది. ఈ ఫిర్యాదుపై ఐఆర్‌సీటీసీ అధికారులు కూడా స్పందించారు. మెహాయ్ ఆక్వాకు ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి చెల్లించాల్సిన బ్యాలెన్స్ రూ.1.50 కోట్లను ఐఆర్‌సీటీసీ నిలిపివేసింది. దీంతో పాటు ధనలక్ష్మీ ప్యాట్రన్స్ సంస్థ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిందిగా ఆదేశించింది. ధనలక్ష్మీ ప్యాట్రన్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇస్తేనే ఉత్పాదకతను ప్రారంభించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం క్లియరెన్స్ సర్టిఫికెట్ లేకుండా ప్రారంభించటానికి వీలు లేదు. తనకు రావాల్సిన రూ.1.50 కోట్లను ఐఆర్‌సీటీసీ నిలిపివేయటంతో వాటి చెల్లింపులు జరపాలని మెహాయ్ సంస్థ ఐఆర్‌సీటీసీపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. కాంట్రాక్టు సంస్థకు డబ్బులు చెల్లించి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోమని చెప్పినట్టుగా తెలుస్తోంది. క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ఆ సంస్థకు పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. తన దగ్గర డబ్బులు లేవని, మీరు ఆపివేసిన డబ్బులు ఇస్తేనే చెల్లించగలనని 'మెహాయ్ ఆక్వా' చెప్పినట్టుగా తెలుస్తోంది. దీనిపై ఐఆర్‌సీటీసీ కూడా తెలివిగా వ్యవహరించింది. ముందుగా పార్ట్ పేమెంట్ విడుదల చేస్తామని - ఆ సంస్థకు చెల్లింపులు జరపాల్సిందిగా నిర్దేశించింది. దీనికి సంబంధించి ప్రస్తుతం ప్రక్రియ నడుస్తున్నట్టు తెలుస్తోంది. రెండు సంస్థల మధ్యన తలెత్తిన వివాదాన్ని ఐఆర్‌సీటీసీ చాలా తెలివిగానే పరిష్కరిస్తోంది. ఈ వివాదానికి కూడా థర్డ్‌పార్టీ వ్యక్తులే కారణమని తెలుస్తోంది. ప్లాంట్‌లో థర్డ్ పార్టీ వ్యక్తులు తమపై దాడికి పాల్పడ్డారని, తీవ్రంగా దూషించారని కూడా ఆ సంస్థ ఫిర్యాదులో పేర్కొనటాన్ని బట్టి చూస్తే మెహాయ్ ఆక్వా, ధనలక్ష్మీ ప్యాట్రన్స్ సంస్థల మధ్య వివాదానికి కూడా కారణం వీరేనని తెలుస్తోంది. తమను మెహాయ్ ఆక్వా సంస్థ మోసం చేస్తే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌ను ఆశ్రయిస్తామని ధనలక్ష్మీ ప్యాట్రన్స్ యాజమాన్యం చెబుతోంది.



అధికారులతో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

కృష్ణలంక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించే విధంగా జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 14 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రజాప్రతినిధుల అభ్యర్థన, రైతుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని బుధవారం నుంచి జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామ, మైలవరం, మార్కెట్ యార్డుల్లోను కొనుగోళ్లు జరగనున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నందిగామ, మైలవరం, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరు మండలాల్లో ప్రధానంగా పత్తిని రైతులు పండిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లులతో పాటు ఈనెల 4వ తేదీ బుధవారం నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్టు తెలిపారు. క్వింటాకు సీసీఐ నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.7521కు కొనుగోలు చేయాలన్నారు. పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో కాకుండా లూజు, గన్నీ బ్యాగులలో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైతులు తమ పంటను మార్కెట్ యార్డులో విక్రయించుకొనేందుకు వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యదర్శి నందిగామ (9182361191), మైలవరం (9182361471), కంచికచర్ల (9182361472), జగ్గయ్యపేట (9182361470)లో సంప్రదించవచ్చని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ జేడీ కె.శ్రీనివాసరావు, సీసీఐ అసిస్టెంట్ మేనేజర్ హెచ్.రామప్రసాద్, మార్కెటింగ్ డీడీ పి.లావణ్య, ఏడీ కె.మంగమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, మార్కెటింగ్ కమిటీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవిలో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

రైతులు ఆందోళన చెందొద్దు..

- ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి సాగు చేసి యంత్రాల ద్వారా నూర్పిడి చేపట్టిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఏర్పడిన నిర్లిప్తతపై మంగళవారం మోపిదేవి తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ, మిల్లుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఏయే గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నది, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1288 మంది రైతుల నుంచి 9426.6 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.19 కోట్లు చెల్లించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. తుఫాన్ ప్రభావం, భారీ వర్షాల ముందస్తు సమాచారంతో రైతులు యంత్రాల ద్వారా ఒకేసారి నూర్పిడి చేయటం జరిగిందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. 1318, 1262 వంటి ఏ రకం ధాన్యాన్ని అయినా ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందిగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఏవో హెబ్సిబా రాణి, మండలి వెంకట్రామ్, రావి రత్నగిరి, నాదెండ్ల శరత్ చంద్రబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పులేటి దేవీ ప్రసాద్

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం!

- అఖిల భారత మాలసంఘాల జేఏసీ

అవనిగడ్డ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, ఇది ఎస్సీ వర్గాల మధ్య అనైక్యతను సృష్టించేదిలా ఉందని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి, అఖిల భారత మాలసంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీ ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డలోని ఏ1 మార్ట్ సమావేశం హాలులో మాలల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు ఎస్సీలకు వ్యతిరేకమని, 59 కులాలు ఈ తీర్పు వల్ల నష్టపోతాయన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని చెప్పటం మాదిగలతో సహా ఎస్సీలందరికీ నష్టమే అన్నారు. దేశంలో 22 శాతం ఎస్సీ జనాభా ఉంటే కేవలం 15 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, దానిని 22 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశంలో 23 రాష్ట్రాలు వర్గీకరణను వ్యతిరేకిస్తుంటే తెలుగు రాష్ట్రాలు మాత్రం వర్గీకరణ అమలుకు సిద్ధపడుతున్నాయన్నారు. ఈ నెల 15న వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులోని నల్లపాడు వద్ద జరిగే మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంతగాని రమేష్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్, పుల్లగోరు రాజేంద్ర, జైభీమ్ భారత్‌పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్, కర్రా సుధాకర్, మాలమహానాడు సంఘాల నేతలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

జి.కొండూరు/విస్సన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో ఓ గృహంలో నిఖిల్ అనే వ్యక్తి అక్రమంగా దాచిన 8.5 టన్నుల పీడీఎస్ రైస్‌ను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకొని పీడీఎస్ డీటీ మాధవిలతకు అప్పగించారు. నిఖిల్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



విస్సన్నపేటలో రేషన్ షాపు తనిఖీ

● విస్సన్నపేటలో మంగళవారం పీడీఎస్ అధికారులు రేషన్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో షాపు నంబరు 1, 2లలో బియ్యం అధికంగా ఉండటాన్ని గుర్తించారు. 1 షాపులో 69 క్వింటాళ్లు, రెండో షాపులో 9.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీటీ నాగరాజు తెలిపారు.

7న పాఠశాలల్లో పెద్ద పండుగ

- తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మెగా సమావేశం
- విద్యార్థుల వికాసం, సమస్యల పరిష్కారానికి దిక్సూచి
- కార్యక్రమ విజయవంతానికి పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ఈనెల 7న పాఠశాల విద్యావ్యవస్థకే అతిపెద్ద పండుగ. మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాన్ని (మెగా పీటీఎం) నిర్వహించనుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (ఎంపీటీఎస్) సన్నద్ధతపై ఎంఈవోలతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం పాఠశాలల పటిష్ఠత, విద్యార్థి వికాసం, సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఆత్మీయ వారధిని నిర్మిస్తుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వవిద్యార్థులు తదితరులు కార్యక్రమానికి హాజరవుతారని, తద్వారా పిల్లల చదువు, ప్రవర్తన, క్రమశిక్షణ తదితర వివరాలను తల్లిదండ్రులు తెలుసుకోవచ్చన్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న కార్యక్రమానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుధ్యం, ఆవరణ సుందరీకరణ, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమ నిర్వహణ, నిరంతర విద్యుత్‌సరఫరా, హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టుల పంపిణీ, ఆరోగ్య బుక్‌లెట్ల పంపిణీ, అతిథులు, తల్లిదండ్రులకు ఆహ్వానం తదితరాలకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్న ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు పార్టీ జెండాలు, కండువాలు, రంగులు వేసుకుని రావద్దని విజ్ఞప్తి చేయాలని సూచించారు. తల్లిదండ్రులకు ఆహ్వానం పలకడం దగ్గర నుంచి కామన్ లంచ్ వరకు ప్రతి కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రూపొందించిన పదో తరగతి పీఎస్ ప్రశ్నల నిధిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో యూవీ సుబ్బారావు, డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణాధికారులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

నేడు 109 పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో ఎంపిక చేసిన 109 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్యాధారిత పరీక్షలు బుధవారం నిర్వహించనున్నట్టు డీఈవో పీవీజే రామారావు పేర్కొన్నారు. పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్లతో పరీక్షల ఏర్పాట్లపై డీఈవో మాట్లాడారు. నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా పరక్ పేరుతో నిర్వహిస్తున్న సామర్థ్యాధారిత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 109 పాఠశాలల్లో 123 సెక్షన్లలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యం ఎంతవరకు ఉందో బేరీజు వేసేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. జిల్లా అబ్జర్వర్ మాధురి, సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో రికార్డులు సృష్టించాలి

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే సునాయాసంగా విజయాలు సాధించవచ్చని డీఈవో పీవీజే రామారావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, నవరత్నాలు పేరిట మానవత విద్యా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో నూరురోజుల ప్రణాళిక అమలు జరుగుతోందన్నారు. విద్యార్థులకు త్వరలో స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. మోటివేషనల్ స్పీకర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, స్టార్ విద్యా సంస్థల మెంటార్ శ్రీరామ్ మాట్లాడుతూ, విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదిత్య, హెచ్ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలపై సమీక్ష

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లా గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలపై మంగళవారం డీఈవో కార్యాలయంలో డీఈవో రామారావు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మచిలీపట్నం సబ్‌జోన్ పోటీలు తాళ్లపాలెం, పెడన బాలుర సబ్‌జోన్ సంగమూడి, బాలికల సబ్‌జోన్ గూడూరులో, గుడివాడ సబ్‌జోన్ ఎన్టీఆర్ స్టేడియం, పామర్రు సబ్‌జోన్ పమిడిముక్కల, గన్నవరం బాలుర సబ్‌జోన్ గన్నవరం జిల్లా పరిషత్, బాలికల సబ్‌జోన్ గన్నవరం బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించాలన్నారు. పెనమలూరు సబ్‌జోన్ ఈడుపుగల్లులో బాలుర, ఆకునూరులో బాలికలకు జరుగుతాయన్నారు. అవనిగడ్డ బాలుర తలగడదీవిలో, బాలికలకు లింగారెడ్డిపాలెంలో నిర్వహించాలన్నారు. బాలుర సెంట్రల్ జోన్ పోటీలు ఘంటసాల మండలం గోగినేనిపాలెంలో నిర్వహించాలన్నారు.

విధుల్లోకి అసిస్టెంట్ డైరెక్టర్లు

మచిలీపట్నం టౌన్ : బదిలీల్లో భాగంగా కృష్ణా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఇద్దరు అసిస్టెంట్ డైరక్టర్లు సయ్యద్ అబ్దుల్ రవూఫ్, మద్దుల విద్యాలతలు విధుల్లో చేరారు. వీరు సమగ్ర శిక్ష కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఇక్కడ అసిస్టెంట్ డైరక్టర్లుగా పనిచేస్తున్న ఎండీ అజీజ్, మనోహర్ నాయక్‌లు సమగ్ర శిక్ష కార్యాలయానికి బదిలీఅయ్యారు. బాధ్యతలు చేపట్టిన అసిస్టెంట్ డైరక్టర్లు డీఈవో రామారావును కలిసి రిపోర్టు చేసారు.

తుప్పు పట్టించారు..!

(7వ పేజీ తరువాయి)

చిక్కుకుపోతున్నాయి. దీన్ని క్లీయర్ చేయడానికి రెండు క్రేన్లు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను విజయవాడ ట్రాఫిక్ డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు తాజాగా అభ్యర్థించటంతో వినియోగంలోలేని క్రేన్ల అంశం చర్చనీయాంశంగా మారింది.


డీఆర్‌సీ సమావేశంలో ట్రాఫిక్ రచ్చ

అమరావతి రాజధానికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాజమార్గంగా ఉన్న వీఐపీ కారిడార్‌పై ట్రాఫిక్ సమస్యల అంశం ఇటీవల జరిగిన డీఆర్‌సీ సమావేశాన్ని కుదిపేసింది. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో పదహారవ నంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)పై గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కనకదుర్గవారధి వరకు 'వీఐపీ కారిడార్'గా ఉన్న మార్గంలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు విజయవాడ పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్ జోన్ డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు మొరపెట్టుకున్నారు. వీఐపీ కారిడార్ మార్గం నాలుగు వరసలుగా మాత్రమే ఉండటం, ఎగువన చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు విజయవాడ పశ్చిమ బైపాస్ ఇంకా పూర్తి కాకపోవటం వంటి అంశాలను ఆయన ఏకరువు పెట్టారు. దేశ ప్రధాని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, వీవీఐపీలు, వీఐపీలు, విదేశీ అతిథులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలంతా అమరావతి రాజధానికి రావటానికి గన్నవరంలోని విజయవాడ విమానాశ్రయానికి వస్తున్నారని.. నాలుగు వరుసలుగా ఉన్న వీఐపీ కారిడార్‌లో భారీ వాహనాలు తిరుగుతున్న కారణంగా ప్రమాదాలు తలెత్తిన సందర్భంలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోందని చెప్పారు. వీఐపీ కారిడార్‌లో ప్రయాణం నరకప్రాయంగా మారుతోందన్న అంశాన్ని డీసీపీ స్పష్టం చేశారు. రోడ్ల మీద ఆగిపోయిన లారీలను కానీ, ప్రమాదానికి గురైన వాహనాలను కానీ తొలగించాలంటే కష్టమైపోతుందని, క్రేన్లు కూడా తమ దగ్గర లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వీఐపీ కారిడార్‌లో సిటీ వెలుపల ఒక క్రేన్, సిటీ లిమిట్‌లో మరో క్రేన్ చొప్పున రెండు క్రేన్లు అవసరమని, వాటిని సమకూర్చి పెట్టాల్సిందిగా అభ్యర్థించారు. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ పరిశీలిస్తామన్నారు.

ఎనిమిదేళ్ల కిందటే కేంద్రం నుంచి వచ్చిన క్రేన్లు



క్రేన్లు కొనాలంటే భారీ బడ్జెట్ కేటాయించాలి. దీని మీదనే పోలీసు, జిల్లా అధికార యంత్రాంగాలు ఆలోచిస్తున్నాయి. కానీ రెండు క్రేన్లు జిల్లాకు కేంద్రం ఎనిమిదేళ్ల కిందటే మంజూరు చేసింది. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ అప్పట్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు కేంద్రంగా ఉన్న విజయవాడలోని రవాణా శాఖ కార్యాలయానికి రెండు భారీ క్రేన్లను అందించింది. కోట్ల రూపాయల వ్యయంతో కూడిన క్రేన్లను ఆపరేట్ చేయటానికి సిబ్బంది లేక, వాటిని నిర్వహించలేక కార్యాలయంలోనే చాలా కాలం వదిలేశారు. ఆ తర్వాత కాలంలో క్రేన్లను అలా వదిలివేయటంపై విమర్శలు వస్తుండటంతో.. వీటిని కాస్తా గన్నవరంలోని రవాణా శాఖ ఫిట్‌నెస్ సెంటర్‌కు పంపించి అక్కడ ఓ మూలన పడేశారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టి ఉన్నాయి. ఎనిమిదేళ్లుగా వీటిని ఉపయోగించటం లేదు. ఈ క్రేన్లను కంపెనీకి పంపించి సర్వీసింగ్ చేయిస్తే ఇప్పటికైనా ఉపయోగించుకునే అవకాశం ఉంది. కలెక్టర్ లక్ష్మీశ చొరవ చూపి.. రవాణా శాఖ అధికారులతో చర్చించి.. అవసరమైతే స్వయంగా వాటిని పరిశీలించి పోలీసు శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పీఎం జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు ఏం చర్యలు తీసుకున్నారు

- పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పీఎం జనఔషధి కేంద్రాల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్న లేవనెత్తారు. పీఏసీఎస్‌ల ద్వారా ఏర్పాటు చేసేందుకు తీసుకున్న చర్యలు, ఇప్పటివరకు ఎన్ని పీఏసీఎస్‌లనుంచి దరఖాస్తులు అందాయి, ఎన్నింటికి అనుమతులు, ఆర్థికసహకారం అందించారు, తదితర వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు. కేంద్ర హోంశాఖ, సహకార శాఖల మంత్రి అమిత్‌షా రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పీఏసీఎస్‌లనుంచి పీఎం జనఔషధి కేంద్రాల ఏర్పాటుకు 4,470 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఏపీలోని 684పీఏసీఎస్‌ల నుంచి దరఖాస్తులు అందినట్టు తెలిపారు. వీటిద్వారా మందులు విక్రయించేందుకు ప్రత్యేకకోడ్‌ను ఇచ్చామని తెలిపారు. ఔషధి కేంద్రాలు కొనుగోలు చేసే మందులపై 20శాతం, లేదా నెలకు రూ.20వేల పరిమితిని మించకుండా ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందన్నారు.

భూసార ఆరోగ్య పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందలేదు

- కేంద్ర సహాయ మంత్రి భగీరథ్ చౌదరి

వన్‌టౌన్ : ఐదేళ్లుగా నూతన భూసార ఆరోగ్య పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎటువంటి ప్రతిపాదనలు అందలేదని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి తెలిపారు. ఉపయోగం లేని భూసార ఆరోగ్య పరీక్షా కేంద్రాల పునరుద్ధరణపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆయన పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఏపీలో 47 స్థిర, 13 మొబైల్, 1,328 మినీ భూసార పరీక్షా కేంద్రాలు ఉన్నట్టు, ఐదేళ్లలో 4,76,519 మట్టి నమూనాలు పరీక్షించినట్టు ఆయన గణాంకాలు వెల్లడించారు. ఈ ఏడాది స్థిర భూసార పరీక్షా కేంద్రాల్లో 10వేలు, మొబైల్ పరీక్షా కేంద్రాల్లో 5వేలు, మినీ పరీక్షా కేంద్రాల్లో 3 వేల మట్టి నమూనాలు మాత్రమే పరిక్షించేందుకు అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు.

ఎగుమతుల ప్రోత్సాహానికి నిధులు ఇవ్వలేదు

గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా ఎగుమతుల హబ్ ప్రణాళిక కింద జిల్లాలకు ఎటువంటి ప్రోత్సాహక నిధులు ఇవ్వలేదని కేంద్ర వాణిజ్య పరిశ్రమల సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుమళ్ల ప్రసాదరావులు అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. జిల్లా స్థాయిల్లో రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీలు, జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు తెలిపారు.

బాలికను మోసగించిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు

బంటుమిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాలికకు మాయమాటలు చెప్పి తల్లిని చేసిన నిందితుడిపై బంటుమిల్లి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతులూరు హరిజనవాడకు చెందిన దరిసే వెంకటేశ్వరస్వామి(23)కి సమీప ప్రాంతానికి చెందిన బాలిక(18)తో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. ఆ పరియంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను గర్భవతిని చేశాడు. సోమవారం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో బాలిక ఆడపిల్లకు జన్మనిచ్చింది. అనంతరం పెళ్లికి మొఖం చాటేయడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరస్వామిపై పోక్సో, అత్యాచార చట్టాల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ అబ్దుల్ సుభాని తెలిపారు.

వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి

- సెర్ప్ సీఈవోకు కాంగ్రెస్ వినతి

విజయవాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తొలగించిన గ్రామ సంఘ సహాయకురాళ్లను విధుల్లోకి తీసుకోవాలని కాంగ్రెస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సీఈఓ వీరపాండియన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులుపై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేస్తే, కూటమి ప్రభుత్వం అదే పంథాలో నడుస్తుందని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలలో సుమారుగా 150 మంది వరకు వీఓఏలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎటువంటి నోటీసు లేకుండా విధుల నుంచి తొలగించారన్నారు. దీనిపై అధికారులు, ఎమ్మెల్యేలను కలిసినా ఫలితం లేక పోయిందన్నారు. వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలన్నారు.

మిర్చి రైతుకు ధరాఘాతం!

పంట ఆశాజనకం.. మార్కెట్లో గిట్టుబాటుకాని ధర.. లక్షల్లో నష్టం

ఈ ఏడాది మార్చి నెలలో కల్లంలో ఉన్న తేజ రకం మిర్చి క్వింటా రూ. 21 వేలకు ధర పలికినప్పటికీ పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలకు చెందిన రైతు కొమ్మినేని సత్యనారాయణ అమ్మలేదు. ఇంకా ధర పెరుగుతుందన్న ఆశతో శీతల గిడ్డంగిలో 70 క్వింటాళ్లు నిల్వ చేశాడు. ధర పెరగకపోగా దారుణంగా పడిపోయింది. నిస్సహాయ స్థితిలో రూ. 13 వేల వంతున అమ్మాడు. తగ్గిన ధరతో పాటు గిడ్డంగి ఖర్చులు కలిపి రూ.6 లక్షలకు పైగా రైతు నష్టపోయాడు. మార్కెట్ పతనం కావటంతో మిర్చి ఘాటు రైతుల నషాళానికంటింది.

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

మిర్చి ధర బాగా దిగజారింది. గత సీజన్‌తో పోల్చితే క్వింటాకు రూ.10 వేలకు పైగా ధర పడిపోయింది. ధర పెరుగుతుందన్న ఆశతో గత సీజన్ పంటను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన రైతులు, మార్కెట్లో నెలకొన్న సంక్షోభం వల్ల తీవ్రంగా నష్టపోయారు. మార్కెట్లోకి కొత్త పంట వస్తున్న తరుణంలో ధర తగ్గటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో తేజ రకం మిర్చిని కల్లాల్లోనే వ్యాపారులు క్వింటా రూ. 21 వేల నుంచి రూ. 22 వేలకు అడిగారు. కొద్ది మంది తప్పితే ఎక్కువ మంది రైతులు ధర పెరుగుతుందన్న ఆశతో టిక్కీ రూ. 150ల ఖర్చుతో ఎక్కడికక్కడ శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. సెప్టెంబరు నుంచి మార్కెట్ దిగజారటం ప్రారంభమైంది. రోజు రోజుకు ధర తగ్గుతోంది. ఇటీవల గుంటూరు యార్డులో తేజ రకం రూ.13 వేల నుంచి రూ.15 వేలు ధర పలకగా, బెస్ట్ క్వాలిటీకి రూ.16,500ల ధర వచ్చింది. 355 రకానికి రూ. 8 వేల నుంచి రూ. 13 వేలు, 341 రకానికి రూ. 10 వేల నుంచి రూ. 14 వేలు, నెం. 5 రకానికి రూ. 10 వేల నుంచి రూ. 13 వేలు, 5531 రకానికి రూ. 8 వేల నుంచి 11,500లు, ఆర్మూర్ రకానికి రూ. 9వేల నుంచి రూ. 12 వేలు, క్లాసిక్ రకానికి రూ. 9వేల నుంచి రూ. 11 వేల ధర పలికింది. దేశీయ అవసరాలకు తప్పితే ప్రధానంగా ఎగుమతులు లేనందున మిర్చి ధర పడిపోయిందని వ్యాపారులు చెపుతున్నారు.



ఆరబోసిన మిరపకాయలు

గిట్టుబాటు కాని ధరలు..

ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ధరలు మిర్చి రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావు. ఎకరానికి సగటున రూ.1.50 లక్షల పెట్టుబడి అవుతున్నది. సాగునీటి వసతి ఉన్న భూముల కౌలు రూ.30 వేల నుంచి రూ.40 వేలు. ముఖ్యంగా తేజ రకం కాయ కోయటానికి క్వింటాకు రూ.5 వేలకు తగ్గకుండా కూలి అవుతోంది. పంట దిగుబడిపై ముఖ్యంగా వాతావరణం, తెగుళ్ల ప్రభావం చూపుతున్నాయి. మిర్చి రైతులను బొబ్బర తెగులు, అకాల వర్షాలు నట్టేట ముంచుతున్నాయి. ప్రతికూల పరిస్థితులను తట్టుకుని ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చినప్పటికీ మార్కెట్లో గిట్టుబాటు ధర లేనందున నష్టపోవటం తప్ప రైతులకు మిగిలేది ఏమీ లేదు.

తోటలు ఆశాజనకం

జిల్లాలో 30 వేల ఎకరాల్లో మిర్చి తోటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మిర్చి సాగు ఎక్కువ. ఇక్కడ తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. లేత తోటలు ఒక మాదిరిగా ఉన్నాయి. అయితే ఒకవైపు మునేటి కాల్వ నీళ్లు, మరోవైపు సాగర్ జలాలు వస్తుండటంతో తోటలకు ప్రస్తుతం సాగునీటి



కొరత లేదు. ఇప్పటి వరకు ఏలాంటి చీడపీడలు ఆశించనందున మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశపడుతున్నారు.

తగ్గిన ధర.. లక్షల్లో నష్టం..

- కొమ్మినేని సత్యనారాయణ, రైతు



ప్రస్తుత ధర మిర్చి రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన ఒక్కొక్క రైతుకు, ధర దారుణంగా పడిపోవటంతో లక్షల్లో నష్టం వస్తున్నది. దీనికితోడు మార్కెట్‌పై కూడా రైతులకు సరైన అవగాహన లేక మార్కెట్లో ధర ఎందుకు పెరుగుతుందో, ఎందుకు తగ్గుతుందో ఏమాత్రం తెలియటం లేదు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మిర్చి మార్కెట్, పంట దిగుబడులు, అవసరాలు, ఎగుమతులు గురించి ఎప్పటికప్పుడు పాలకులు, ఉన్నతాధికారులు అవగాహన కల్పించాల్సిఉంది.

జనశిక్షణా సంస్థాన్ ఉపాధి శిక్షణ కార్యక్రమాలు

మొగల్రాజపురం: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి నిమిత్తం జనశిక్షణా సంస్థాన్ డిసెంబరులో చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాలున్నా ఆధ్వర్యంలో పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ ఏ. పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. జ్యూట్ బ్యాగ్ తయారీ, మగ్గం, టైలరింగ్ కటింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ రిపేరు, డ్రెస్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సు, టెక్స్‌టైల్ ప్రింటింగ్, మిర్రర్‌వర్కు, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, హోమ్‌క్రాఫ్ట్ తయారీ, జామ్, జ్యూస్‌ల తయారీలో శిక్షణ ఇస్తామని తెలిపారు. పాస్‌పోర్టు ఫొటో, ఆధార్ కార్డు నకలుతో ఈ నెల 12 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి కల అభ్యర్థులు మొగల్రాజపురంలోని రావిచెట్టు సెంటర్‌లో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

దోపిడీదారులకు వరం ఉచిత ఇసుక హామీ

- టన్నులకొద్దీ ఇసుక అక్రమ రవాణా
- వారధికి పొంచి ఉన్న ప్రమాదం
- చోద్యం చూస్తున్న అధికారులు



నదీ గర్భంలో ఇసుకను బస్తాలకెత్తుతూ, ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న ఇసుక

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)

టీడీపీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు ఇచ్చిన ఉచిత ఇసుక హామీ ఇసుక దోపిడీదారులకు వరంగా మారింది. ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌లలో మాత్రమే ఉచిత ఇసుక తీసుకువెళ్లాలని నిబంధనలు ఉన్నా అవి కృష్ణలంకలోని ఇసుకాసురులకు మాత్రం వర్తించడం లేదు. కృష్ణలంక వారధి, మెట్లబజార్, స్వర్గపురి వద్ద నిత్యం టన్నుల కొద్దీ ఇసుక అక్రమ రవాణా అవుతున్నా ఆపే నాథుడు, పట్టించుకునే ప్రభుత్వ వ్యవస్థ లేకపోవడంతో అక్రమ రవాణాదారులు ఇసుకను అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వారధితో పాటు మిగిలిన ప్రాంతాల్లో నిత్యం పగలు, రాత్రీ అనే తేడా లేకుండా ద్విచక్ర వాహనాలపై ఇసుకను తరలిస్తున్నారు. ఈ దోపిడీని అడ్డుకోవలసిన పలు ప్రభుత్వ శాఖల అధికారులు చోద్యం చూస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా వారధి వద్ద ఇసుక తవ్వకాలు జరిపితే వారధికి పెను ప్రమాదం అని, ఇసుక తవ్వకాలు జరపరాదనే నిబంధనలు ఉన్నాయి. అయితే ఇక్కడికి కూత వేటు దూరంలో జాతీయ రహదారుల కార్యాలయం ఉన్నా ఆ అధికారులు మాత్రం కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇక ఇరిగేషన్ అధికారులు ఇసుక తవ్వకాలు తమ పరిధి కాదని పోలీస్, రెవెన్యూ, మైన్స్ శాఖలు మాత్రమే చర్యలు తీసుకోవాలనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇరిగేషన్‌కు సంబంధించి ఒక ఉద్యోగి నిత్యం కృష్ణానది పరివాహక ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్నా ఇసుక దోపిడీని మాత్రం కట్టడి చేయలేకపోతున్నారు. ఇక మిగిలిన శాఖల అధికారులు కూడా ఎందుకు చర్యలు తీసుకోలేపోతున్నారో అర్థం కాని పరిస్థితి.

గేటు ఏర్పాటుతో ఇసుక దోపిడీకి అడ్డుకట్ట

వారధి వద్ద గేటు ఏర్పాటు చేస్తే ఇసుక దోపిడీని అరికట్టవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నిత్యం ఇసుక బస్తాల తరలింపు వాహనాలతో వారధి పక్క నివసించే తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పోలీసులు ఇసుక తరలిస్తున్న వారిని ఆపే సాహసం చేయలేక పోతున్నారని అంటున్నారు. ఇక్కడ ఇసుక తరలిస్తున్న వారిని ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మెల్యే అనుమతితోనే ఇసుక తరలిస్తున్నామని చెబుతున్నారని, వీరికి అడ్డుకట్ట వేయాలంటే ఇక్కడ గేటు ఏర్పాటు చేయడమే మార్గమని అంటున్నారు.

మా ఎమ్మెల్యే అటువంటివి ప్రోత్సహించరు



మా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఇటువంటి చర్యలను ప్రోత్సహించరు. ప్రభుత్వ ఖజానాకు నష్టం చేసే వారిపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలి. తమ ఎమ్మెల్యే పేరు చెప్పి ఎవరు ఇసుకను దొంగలిస్తున్నా పోలీసులతో పాటు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలి.

వేముల దుర్గారావు,
18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు

లయోలా గేట్లు తెరిపించండి

- సీపీకి వాకర్స్ వినతి

విజయవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉదయం పూట వాకింగ్ చేసుకునేందుకు ఆంధ్రా లయోలా కళాశాలలో అనుమతి ఇప్పించాలని వాకర్స్ అసోసియేషన్ నేతలు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు విన్నవించారు. వారు మంగళవారం సీపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రా లయోలా కళాశాల యజమాన్యం ఉద్దేశ్యపూర్వకంగా గేట్లకు తాళాలు వేస్తోందని ఫిర్యాదు చేశారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

టవర్‌లైన్ రోడ్డును తీర్చిదిద్దుతాం

తూర్పు ఎమ్మెల్యే గద్దెరామ్మోహన్



స్థల యజమానులు, అధికారులతో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె

భారతీనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరానికి మణిహారంగా టవర్‌లైన్ రోడ్డును తీర్చిదిద్దుతామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గురునానక్‌రోడ్డులోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో టవర్‌లైన్ రోడ్డు నిర్మాణంపై, కల్యాణ మండపం దగ్గర ఉన్న స్థలాలపై చర్చించడానికి స్థల యజమానులు, అధికారులతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-2019లో ఆనాటి టీడీపీ ప్రజాప్రతినిధులందరూ ఏకకంఠంతో టవర్‌లైన్ రోడ్డు నిర్మాణం చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ రోడ్డుకు సుమారుగా రూ.17కోట్ల వ్యయంతో సుమారు 80శాతం పైగా రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. ఈ టవర్‌లైన్ రోడ్డులో ఎన్ఏసీ కల్యాణ మండపం దగ్గర కొంచెం రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఈ స్థలం కల్యాణ మండపానికి చెందినదని , ఈ స్థలం విలువ సుమారు రూ.100కోట్లకు పైనే ఉంటుందన్నారు. అంత ఖరీదైన స్థలంలో రోడ్డు నిర్మాణం చేయడానికి స్థల యజమానులను ఒప్పించి వారికి నష్టపరిహారం అందజేసే అంశంపై యజమానులు. అధికారులతో కలిసి చర్చించామని అన్నారు. డీడీఆర్ బాండ్లు కావాలని స్థల యజమానులైన కాశీ, అఖిల్ అడుగుతున్నారని, వారి న్యాయపరమైన డిమాండ్‌ను మున్సిపల్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళతామని అన్నారు. త్వరలోనే మున్సిపల్ కమిషనర్, స్థల యజమానులతో మరోసారి సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, నల్లూరి కాశీ, అఖిల్, ఏసీపీ మోహన్‌బాబు, గద్దె రమేష్, రాజనాల పవన్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో పీబీ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు

మొగల్రాజపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకల్లో సత్యసాయి సేవా సంస్థల విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో నగర స్థాయిలో తమ విద్యార్థులు ప్రథమ ,ద్వితీయ బహుమతులు సాధించినట్లు పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలల స్థాయిలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ విభాగంలో ఇచ్చుట- క్షమించుట అనే అంశంపై తెలుగు మాధ్యమం విద్యార్థులకు, గివింగ్ అండ్ ఫర్‌గివింగ్ మేక్ వన్ ఎ రియల్ హ్యూమన్‌బీయింగ్ అనే అంశంపై ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారని చెప్పారు. ఈ పోటీల్లో జూనియర్ ఇంటర్ సీఈసీ విద్యార్థి షేక్ రౌషన్ జమీర్ ఆంగ్లమాధ్యమంలో ప్రథమ బహుమతి, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి ఎం.తేజ ద్వితీయ బహుమతి సాధించారని చెప్పారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం అధ్యాపకేతర, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.





ఏపీఐఐసీ కాలనీ అంతర్గత రోడ్లో, జమాక్ అపార్టుమెంట్ సమీపంలో రోడ్డుమీద మురుగునీరు

పూడికతో డ్రెయినేజీలు

- రోడ్డుపై పారుతున్న మురుగునీరు
- దుర్వాసనతో స్థానికుల వెతలు

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

పూడికతో నిండిన ప్రధాన డ్రెయినేజీలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏపీఐఐసీ కాలనీ మెయిన్, అంతర్గత రోడ్డుల్లో డ్రెయినేజీలు పూడికతో నిండిపోయాయి. వీటిని తొలిగించడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహించడంతో మురుగు నీరు పారుదల లేదు. డ్రెయినేజీలు పొంగి మురుగు నీరు రోడ్లపై పారుతోంది. రోజుల తరబడి మురుగునీరు పారుదల లేక నిల్వవుండి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ చార్జీలు పెంచి వంచించిన కూటమి

సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు

విజయవాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచబోమని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించి భారీగా చార్జీలను పెంచిందని 50వ డివిజన్ కార్పొరేటర్, సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు విమర్శించారు. గొల్లపాలెంగట్టు కొండప్రాంతంలో మంగళవారం పర్యటించి స్థానికుల విద్యుత్ బిల్లులను పరిశీలించారు. చలికాలం అయినా చార్జీల మోత మోగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. కె. శివకుమారి అనే మహిళ ఇంటికి 36 యూనిట్లకు రూ.359 బిల్లు వచ్చిందని, అందులో రూ.284 పన్నుల రూపంలో వేశారన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలపై ప్రజలు గళం విప్పాలి. కేంద్ర, రాష్ట్ర పాలకులను నిలదీయాలని సత్యబాబు అన్నారు. నగర కమిటీ సభ్యులు పి.రాజు పాల్గొన్నారు.





కండ్రికలో విభిన్న ప్రతిభావంతులకు ట్రై మోటార్ సైకిళ్లు, ట్రై సైకిళ్లు అందజేస్తున్న బొండా ఉమా

విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లను అందజేస్తున్న ఎస్ఎల్‌వీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు

అంగ వైకల్యం శరీరానికే ..మనస్సుకు కాదు

ఎమ్మెల్యే బొండా ఉమా ● సుధీక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మందికి కృత్రిమ కాళ్లు పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంగ వైకల్యం శరీరానికే గాని మనస్సుకు కాదని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సుధీక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొండా ఉమా ముఖ్య అతిథిగా, ఎస్ఎల్‌వీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా 200 మంది విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ వైకల్యంతో ఎన్నో అవరోధాలను, కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని జయిస్తూ ఎందరో విభిన్న ప్రతిభావంతులు ఆదర్శవంతంగా ఉన్నారన్నారు. పెన్మత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లు అందజేసిన సుధీక్షన్ ఫౌండేషన్‌ను అభినందించి, తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసమే ఊపిరిగా పయనించి ఎన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

ట్రై మోటారు సైకిళ్లు, ట్రై సైకిళ్లు పంపిణీ

పాయకాపురం: విభిన్న ప్రతిభావంతులకు టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకొల్లు రవికుమార్ ఆధ్వర్యంలో 64వ డివిజన్ కండ్రిక కాలనీలో టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం విభిన్న ప్రతిభావంతులకు ట్రై మోటార్ సైకిళ్లు, ట్రై సైకిళ్లు, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా ట్రై మోటారు సైకిళ్లు, ట్రై సైకిళ్లు, 125 మంది విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరుకుల కిట్లు అందజేశారు.

చెస్ చాంపియన్ షిప్‌లో చిరాగ్ కొమ్మినేని ప్రతిభ



చాంపియన్ షిప్‌లో పాల్గొన్న చిరాగ్ కొమ్మినేని

విజయవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింగపూర్‌లో ఇటీవల జరిగిన చెస్ చాంపియన్ షిప్‌లో నలంద స్కూల్ విద్యార్థి చిరాగ్ కొమ్మినేని ప్రతిభ చూపాడు. పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న చిరాగ్ కొమ్మినేని అంతర్జాతీయ స్థాయిలో జరిగిన చాంపియన్ షిప్‌లో 1456 రేటింగ్ సాధించాడు. తొమ్మిదో రౌండ్‌లో 41/2 పాయింట్లు సాధించి సింగపూర్‌కి చెందిన సతీష్ సాత్విక్(1503)తో డ్రా చేశాడు. అలాగే భారతదేశానికి చెందిన అక్షర గోబినాథ్ (1441)తో ఆడి విజయం సాధించాడు. ఈ నెల ఒకటిన వరల్డ్ చెస్ ఫెడరేషన్ సందర్భంగా చాంపియన్‌షిప్ నిర్వాహకులు రేటింగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ మంగళవారం విద్యార్థి చిరాగ్ కొమ్మినేనిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తవ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో జరిగిన రాష్ట్ర సదస్సులో సిద్ధార్థ వైద్య విద్యా కళాశాల, ప్రభుత్వ సర్వజనా సుపత్రి విజయవాడ చర్మవ్యాధుల విభాగంలోని వైద్యులు ప్రొఫెసర్ టి.వాణి ఆధ్వర్యంలో సమర్పించిన పేపర్ ప్రజెంటేషన్‌కు రెండో స్థానం లభించింది. ఈమేరకు వారిని సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు, ఎస్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తదితరులు అభినందించారు. అఖిల భారత చర్మవ్యాధుల నిపుణుల సమాఖ్య, ఏపీ రాష్ట్ర విభాగం గత నెల 30 నుంచి డిసెంబరు ఒకటి వరకు గుంటూరులో నిర్వహించిన సదస్సులో రాష్ట్ర నలుమూలల నుంచి చర్మవ్యాధి వైద్య నిపుణులు హాజరయ్యారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ టి.వాణి ఆధ్వర్యంలో సమర్పించిన పేపర్ ప్రజెంటేషన్‌కు రెండో స్థానం లభించింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే యార్లగడ్డ



మంగళగిరి టీడీపీ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : టీడీపీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని అర్జీలను స్వీకరించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొందరి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పెనమలూరు మండలం చోడవరం రెవెన్యూ పరిధిలో తన పుట్టింటి వారు తనకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన భూమిని అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారని దాని నుంచి తొలగించాలని ఆవుల వేణు కుమారి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి తన భూమిని మరొకరికి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని కేసరపల్లికి చెందిన మూల్పూరు వెంకట లక్ష్మీప్రసాద్ విజ్ఞప్తి చేశారు. వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తామని యార్లగడ్డ తెలిపారు.



రెండో ఫ్లై ఓవర్ నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

సెంట్రల్‌కు మరో ఫ్లై ఓవర్..!

- సీఎం చంద్రబాబు నాయుడికి బొండా ఉమా వినతి

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని అజిత్‌సింగ్‌నగర్‌లోని ప్రస్తుత ఫ్లై ఓవర్ పక్కన మరో ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతూ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి వినతిపత్రం అందజేశారు. అమరావతిలోని సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిని కలిసిన ఉమా నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలను వివరించారు. 1995 జనాభా, ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని అప్పటిలో ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగిందని ప్రస్తుతం జనాభా, వాహనాల రద్దీ విపరీతంగా పెరిగి రోజూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వివరించారు. ఈ ఫ్లై ఓవర్ మీదుగా నిత్యం లక్షమందికి పైగా రాకాపోకలు సాగిస్తున్నారని అందుకే ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందని, సమస్యలను దృష్టిలో పెట్టుకుని రెండో ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన అవసరం ఉందని వినతిపత్రంలో కోరారు. ఇప్పటికే ఎంపీ కేశినేని చిన్నితో కలిసి 2వ ఫ్లై ఓవర్ విషయమై కేంద్ర రైల్వే మంత్రితో రెండు సార్లు మాట్లాడగా మంత్రి సానుకూలంగా స్పందించినట్టు సీఎం దృష్టికి బొండా ఉమా తీసుకెళ్లారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఈ రెండవ ఫ్లై ఓవర్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉమా ముఖ్యమంత్రిని కోరారు.

క్రీడాపాలసీతో క్రీడాకారులకు సత్వర న్యాయం

- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు
- స్టేట్ సీనియర్ ఆర్చరీ టోర్నీ ప్రారంభం



బాణం సంధించి పోటీను ప్రారంభిస్తున్న రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడ లేని విధంగా హర్యానా రాష్ట్రాన్ని మించి క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్‌లో మేలైన క్రీడా పాలసీని తీసుకువచ్చామని, అన్ని విధాలుగా పేద క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కంకణబద్ధులై పనిచేస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు స్పష్టం చేశారు. నగరంలోని శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 3 నుంచి 5 వరకు జరగనున్న ఆంధ్రప్రదేశ్ 31వ సీనియర్ ఇండియన్ రౌండ్, 44వ సీనియర్ రికర్వ్, 20వ సీనియర్ కాంపౌండ్ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) ఆర్చరీ టోర్నీని ఆయన రికర్వ్ విభాగంలో బాణం సంధించి పోటీలను మంగళవారం ప్రారంభించారు. తొలుత దివంగత ఇండియా ఆర్చరీ కోచ్ లెనిన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన సభలో రవినాయుడు మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఆర్చరీ అకాడమీని చెరుకూరి సత్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాటు చేసేలా తన వంతు కృషి చేస్తామన్నారు. కోచ్ పోస్టుల భర్తీలో 50 శాతం సీనియర్ క్రీడాకారులకు రిజర్వేషన్‌తో భర్తీ చేస్తామని, సగంలో ఆగిన క్రీడా వికాస కేంద్రాలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబుకిచ్చిన హామీలో భాగంగా పారిస్ ఒలింపిక్స్‌కు ఆర్చరీ నుంచి ఏపీ నుంచి క్రీడాకారుడ్ని పంపామని, రానున్న రోజుల్లో అత్యుత్తమ ప్రమాణాలతో క్రీడాకారులను తయారు చేస్తానని హామీ ఇచ్చారు. బాయ్ మాజీ ఉపాధ్యక్షుడు పున్నయ్య చౌదరి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ (బుజ్జి), కోశాధికారి శ్రావణ్‌కుమార్, వెంకటరమణ, జి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలను
సద్వినియోగం చేసుకోవాలి

- అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, చిత్రంలో శాఖ కార్యదర్శి సూర్యకుమారి

మొగల్రాజపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మొగల్రాజపురం వీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఆత్మవిశ్వాశాన్ని నింపుకుని ముందడుడు వేస్తున్న విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే ఏదైనా సాధిస్తారంటూ సీఎం చంద్రబాబు పంపిన సందేశాన్ని వినిపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ అందిస్తోందన్నారు. ప్రజా ప్రతినిధులుగా విభిన్న ప్రతిభావంతులు ఎదిగేలా కోటాకోసం పోరాడే లక్ష్మీనారాయణ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ సూర్యకుమారి మాట్లాడుతూ సంక్షేమ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి వచ్చిన వారు తమతో పాటు మరికొందరికి ఉపాధి చూపించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అందించే ఉపాధి పథకాలను సమర్థంగా జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. వయో వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎంఏ కుమార్ రాజా మాట్లాడుతూ తెలిగ్గా పొందే ఉపకరణాల గురించి, బ్రెయిలీ లిపి పాఠ్య పుస్తకాల గురించి తెలిపారు. తొలుత విభిన్న ప్రతిభావంతులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. క్రీడాపోటీల్లో గెలుపొందిన 61 మందికి మొదటి బహుమతులు, మరో 61 మందికి ద్వితీయ, 45 మందికి తృతీయ బహుమతులు అందించారు. ఎన్టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి. కామరాజు పాల్గొన్నారు.

విధి వంచితులకు
సుధీక్షణ్ అభయం

- ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన క్షతగాత్రులు
- ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల పంపిణీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: జీవనోపాధి కోసం వివిధ రంగాల్లోని వారి తలరాతలను విధి మార్చింది. అప్పటి వరకు ఏదో ఒక ఉపాధి చేసుకుంటున్న వారిని వికలాంగులను చేసి ఇళ్లకు పరిమితం చేసింది. హెల్మెట్ ధరించిన వారు కొందరు.. బైక్‌లపై వెనుక కూర్చున్నవారు మరికొందరు.. ఇలా ప్రమాదాల బారిన పడి ప్రాణాపాయం నుంచి తప్పించుకుని వికలాంగులయ్యారు. ఇలాంటి వారికి విజయవాడకు చెందిన సుధీక్షణ్ ఫౌండేషన్ కృత్రిమ అవయవాలను ఉచితంగా అందజేస్తోంది. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా బాలోత్సవం భవన్‌లో వివిధ ప్రమాదాల్లో కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి ప్రతి ఏడాది ఈ కృత్రిమ అవయవాలను అందజేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన వికలాంగులను ఆంధ్రజ్యోతి పలకరించింది. వారు చెప్పిన వివరాలివే.

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన జి.రాజ్‌కుమార్ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఈ ఏడాది మే 19న బిర్యానీ తినాలనిపి వరుసకు అన్నయ్య అయిన సాయికుమార్‌కు చెప్పాడు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా జాతీయ రహదారిపైనున్న దాబాకు బయలుదేరారు. జాతీయ రహదారిపై మలుపు తీసుకోవాల్సి వచ్చి ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేశారు. లారీ వెనుక భాగం తగలి ఈడ్చుకుపోయింది. సాయికుమార్ దుర్మరణం చెందాడు. వెనుక కూర్చున్న రాజ్‌కుమార్‌కు తెలివి వచ్చేసరికి ఒక కాలు తొలగించి ఉంది. అలాగే తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం గ్రామానికి ఎస్‌కే షాబుద్దీన్ కుటుంబంతో కలిసి కృష్ణా జిల్లాకు వచ్చాడు. ముందుగాకు ఉటుంబంతో కలిసి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు కారులో ఉయ్యూరు బయలుదేరారు. షాబుద్దీన్ ఆయన బావ రాహుల్ మాత్రం బైక్‌పై వస్తుండగా కరకట్టపై కారు ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న రాహుల్ హెల్మెట్ ధరించి ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడగా, వెనుక కూర్చున్న షాబుద్దీన్ మాత్రం కాలు కోల్పోయాడు. అలాగే కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన జి.రాంబాబు ఆటోడ్రైవర్. గత ఏడాది శివారున ఉన్న జగనన్న కాలనీకి బయలుదేరాడు. తలపై హెల్మెట్ పెట్టుకుని స్కూటర్‌పై బయలుదేరాడు. కొంతదూరం వెళ్లాక స్కూటర్ అదుపు తప్పి పడిపోయాడు. హెల్మెట్ ఉండడంతో తలకు గాయం కాలేదు. కుడికాలు పాదానికి స్వల్ప గాయాలయ్యాయి. పాదం బాగా వాచింది. చిన్న గాయాలే కదా ఇంటివద్దే చికిత్స చేసుకున్నాడు. తర్వాత కాలు వాపు పెరగడంతోపాటు లోపల ఇన్‌ఫెక్షన్ సోకింది. క్రమంగా కాలు తొలగింపునకు కారణమైంది. ఇలా రోజుకు ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు, వికలాంగులుగా మారుతున్నారు.

రైల్వే స్టేడియాల్లో పారా క్రీడలకు సౌకర్యాలు

- డీఆర్ఎం పాటిల్



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, అధికారులు

రైల్వే స్టేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్లలోని అన్ని రైల్వే స్టేషన్లలో పారా క్రీడలకు అనువైన సౌకర్యాలు కల్పిస్తామని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయవాడ రైల్వే డివిజన్ దివ్యాంగుల సంక్షేమ సంఘం, విజయవాడ రైల్వే పరిపాలనా విభాగం సహకారంతో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడీఆర్ఎం కే శ్రీనివాసరావు, రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటిండెంట్ శౌరిబాల, మజ్దూరు యూనియన్ నేతలు లక్ష్మీ, ఎంప్లాయిస్ సంఘ నేత ఆమంచి శ్రీనివాసరావు, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నేత పాపారావు, పాల్గొన్న ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ దివ్యాంగుల సంక్షేమ సంఘం చైర్మన్ రామకృష్ణ అధ్యక్షత వహిస్తూ దివ్యాంగ ఉద్యోగులకు ప్రతి అధికారి కూడా ఎంతో సహకరిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ 2015లో ప్రధాని నరేంద్ర మోదీ సుగమ్య భారత్‌ను ప్రారంభించి వికలాంగుల పేరును తీసేసి దివ్యాంగులుగా మార్చారని గుర్తు చేశారు. 90 విమానాశ్రయాలు, 700 రైల్వే స్టేషన్లలో దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించారన్నారు. దివ్యాంగులు సౌకర్యాలు పొందేందుకు 1.10 కోట్లకు పైగా ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా పారా క్రీడాకారుడు సుబ్బయ్య తిరుమలయ్య కుమార్‌ను దుశ్శాలువా కప్పి జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా తిరుమలయ్య కుమార్ ఒలింపిక్ క్రీడలతో పాటు పారా క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీఆర్ఎం స్పందిస్తూ అన్ని డివిజన్లలోని రైల్వే స్టేషన్లలో పారా క్రీడలకు అనువైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగులకు మోటర్ ట్రై సైకిళ్ల కొనుగోలుకు ఎస్‌బీఎఫ్ ఫండ్ ద్వారా రూ.25వేలు, రైల్వే మహిళా సంక్షేమ సంఘం ద్వారా రూ.10 వేలు ఇస్తామని, అవసరమైతే బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. శౌరిబాల, ఏడీఆర్ఎంలు తమ సందేశాలను ఇచ్చారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి శివకుమార్, కోశాధికారి జగదీశ్వరరావు, డివిజన్ అసిస్టెంట్ ఎక్రటరీ ఎర్రంనాయుడు, రవి, రాంబాబు, వి.ఎల్.ఎస్.మూర్తి, చిలుకా కిషోర్, ఆదినారాయణ, వెంకట రావు, మురళి, త్రివిక్రమరావు పాల్గొన్నారు.

నా గెలుపునకు సహకరించండి..!

- సీపీఐ నేతల్ని కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కలిసి మద్దతు కోరుతున్న పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు, చిత్రంలో వనజ

గవర్నర్‌పేట, డిసెడిసెడింబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి వివిధ ప్రజా సంఘాలు బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కలిసి తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు తాను గత 14ఏళ్లుగా మండలిలో, బయట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, విద్యార్థులు, అంగన్వాడీలు, రైతులు, కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలపై పోరాటాలు చేస్తున్నామని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నట్టు రామకృష్ణకు వివరించారు. ఈ ఎన్నికల్లో వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు కోరుతున్నానని, దాదాపు 50కి పైగా సంఘాలు మద్దతు తెలిపాయని, సీపీఐ కూడా అండగా నిలవాలని కోరారు. సీపీఐ జాతీయ కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టీటీ పోటీలకు పలువురి ఎంపిక



టీటీ ప్లేయర్స్‌తో కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధులు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు సత్తా చాటారు. ఇందిరాగాంధీ స్టేడియంలో రెండురోజులుగా జరుగుతున్న పోటీల్లో విజేతలను అసోసియేషన్ ప్రకటించింది. వీరంతా ఈ నెలలో కాకినాడలో ఈ నెల 20, 21న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్లేయర్స్ జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా జాయింట్ సెక్రటరీ బొడ్డు శ్రీనివాస్ తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు


అండర్-15 బాలబాలికల విభాగాల్లో జి.లోహిత్, వేదాన్ష్, కపిల్ భార్గవ, వైభవ్, పి.ధృతి, నజ్మా, శాన్విత, మోక్ష తన్మయి, పురుషులు, మహిళల విభాగాల్లో సత్య, ప్రత్యాకాష్, గౌస్, అబ్దుల్, వేదాన్ష్, పి ధృతి, సైరాబాను, మనస్వి, ఎం చార్వి, నజ్మా.

కృష్ణా జిల్లా క్రీడాకారులు

అండర్-15 బాలబాలికల విభాగాల్లో చేతన్, అభిరామ్, జయరామ్, కిరణ్ తేజ, చార్వి, మనస్వి, అనన్య ఆనంద్, పురుషుల, మహిళా విభాగాల్లో ఫిరోజ్, సుభాస్‌బాబు, భువన్, లోహిత్, కపిల్, తన్వి, మోక్ష, బృహతి, శాన్విత, మౌతిక.

మూఢనమ్మకాలపై గోరా కొరడా

- శాస్త్రీయ దృష్టిని పెంపొందించడమే గోరా సైన్స్ సెంటర్ ముఖ్యోద్దేశం
- గోరా సైన్స్ డైరెక్టర్ నియంత



భూమి చుట్టు కొలతను కనుగొన్న అప్పటి చాయాచిత్రం



4 లక్షల ఏళ్ల నాటి వృక్షం ఆనవాలు



గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత



టెలిస్కోపు ద్వారా గ్రహాలను చూస్తున్న గెలీలియో



మైక్రోస్కోప్‌తో పరిశీలిస్తున్న సైంటిస్టు ఆంటోనీ వాన్ లీవెన్‌హుక్



మైక్రోస్కోప్‌లో పేను చిత్రం

పటమట - ఆంధ్రజ్యోతి: సైన్స్‌తో పాటు శాస్త్రీయ దృష్టిని పెంపొందించే ముఖ్య ఉద్దేశంతో 1961లో గోరా సైన్స్ సెంటర్ స్థాపించామని గోరా సైన్స్ డైరెక్టర్ నియంత తెలిపారు. సైన్స్‌ను అభివృద్ధి చేయాలనుకునే వాళ్లందరూ క్లబ్‌లో సభ్యులేనన్నారు. గోరా సంతానం 9 మంది సైన్స్ సెంటర్ కలాపాల్లో చురుగ్గా పాల్గొంటారని వివరించారు. 1920 నుంచే గోరా అశాస్త్రీయ ఆచార వ్యవహారాలు, మూఢనమ్మకాలను ఖండించటం మొదలెట్టారన్నారు. అమావాస్యంటే ఎందుకంత భయం. చంద్రకళలో అమావాస్య ఒకటని దానికి భయపడనవసరం లేదని తెలిపారు. భూమికి సూర్యుడికి మధ్యలో తిరిగే క్రమంలో చంద్రుడు అడ్డుతగటం వల్ల గ్రహణం ఏర్పడుతుందని, గ్రహణమనేది మూఢనమ్మకమని, అలాగే గర్భిణులు గ్రహణం నాడు బయట కొస్తే అంగవైకల్యం వస్తుందంటారని, ఇదీ మూఢ నమ్మకమేనన్నారు. ఈ సంప్రదాయం ప్రపంచంలో ఎక్కడా లేదని, కేవలం భారతదేశంలో హిందూ సంప్రదాయాన్ని పాటించేవాళ్లలో మాత్రమే ఉందన్నారు. గతంలో వినాయకుడు పాలు తాగుతున్నాడని వదంతులు షికారు చేశాయని, అసలు విషయమేంటంటే ఘన పదార్థాలు, ద్రవపదార్థాలను సంగ్రహిస్తాయని ఇది కొహిడిల్ ఫోర్సు అనే సూత్రం ఆధారంగా జరుగుతాయన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ ముఖ్యోద్దేశం ప్రదర్శనాత్మక విశ్లేషణ ఇవ్వడం కోసమే ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత పరిశోధకులు శుక్ర గ్రహం వెలుపలి వరకు చూడగలుతున్నారని, అక్కడ కార్బన్ డైయాక్సైడ్ 98శాతం, వేడి 46 డిగ్రీలు ఉంటుందని, సల్ఫర్ డైఆక్సైడ్ కూడా ఎక్కువగా ఉందని, అందుకే పరిశోధనలకు పంపిన శాటిలైట్స్ కరిగిపోతున్నాయన్నారు. అక్కడ ఇంకా పరిశోధనలు విస్తృతం చేయాలన్నారు. న్యూటన్ గెలీలియోలు కనుగొన్న శాస్త్రీయ విషయాల వలన అంతరిక్షణం, సైన్స్ రంగాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. గతంలో పూర్వీకులు ఈజిప్టు నుంచి అలెగ్జాండ్రియా వరకు కర్రనీడల పరీక్ష ద్వారా మార్పుని గమనించి భూవి ం గుండ్రంగా ఉందని, భూమి చుట్టు కొలతలను కనిపెట్టగలిగారన్నారు. 70 వేల ఏళ్ల క్రితమే మానవులు సహజీవనం చేశారని, 1600 నుంచి సైన్స్ అభివృద్ధి ప్రారంభమైందని, దీనికి కారణం పరిశోధనేనన్నారు.

ఈ కేసుతో నాకెలాంటి సంబంధం లేదు

- వైసీపీ నేత గౌతమ్‌రెడ్డి

సత్యనారాయణపురం, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్‌కు వైసీపీ నేత పి.గౌతమ్‌రెడ్డి మంగళవార సాయంత్రం హత్యాయత్నం కేసులో విచారణకు హాజరయ్యారు. ఏసీపీ స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో పోలీసులు గౌతమ్‌రెడ్డిని విచారణ చేశారు. అనంతరం తిరిగి 7న విచారణకు రావాలని పోలీసులు గౌమ్‌రెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు అడిగిన 10 ప్రశ్నలకు జవాబు ఇచ్చానని, ఈ కేసుకు తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. నాపై టీడీపీ ప్రభుత్వం కేసు నమోదు చేసిందన్నారు. గత టీడీపీ హయాంలో నన్ను చంపేందుకు పోలీసు కమిషనర్ ప్రయత్నించారని ఆరోపించారు. పోలీసులు అర్ధరాత్రి సమయంలో మా ఇంట్లో అక్రమంగా దొంగల్లా చొరబడ్డారని, నన్ను చంపేందుకు తలుపులు పగలకొట్టి దొంగలకు మార్గ చూపించారన్నారు. ఆ భయంతోనే ముందస్తు బెయిల్‌కి వెళానన్నారు. కోర్టులో ఈ కేసు ఉన్నందున ఏ విషయం మాట్లాడలేనన్నారు.

వేధించారని చెబితే సస్పెండ్ చేశారు..!

- భారత్ బైబిల్ కళాశాల విద్యార్థి బ్లెస్సీ ఆవేదన

మేడ్చల్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత్ బైబిల్ కళాశాల రిజిస్ట్రార్ డైరెక్టర్లు మానసికంగా, శారీరకంగా వేధించారంటూ భారత్ బైబిల్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కళాశాల యాజమాన్యం తనను కళాశాల నుంచి తొలగించి కేసు పెట్టారని మొరపెట్టుకుంది. తనకు జరిగిన అన్యాయం పట్ల బాధిత విద్యార్థిని బ్లెస్సీ నందక (20) మంగళవారం డబిల్‌పూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. విజయవాడకు చెందిన తాను మండలంలోని డబీల్‌పూర్ గ్రామ శివార్లలో ఉన్న భారత్ బైబిల్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ థియాలజీ చదువుతున్నానని, కొద్దిరోజులుగా రిజిస్ట్రార్ వినయ్ కుమార్ తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని, దీనిపై కళాశాల డైరెక్టర్ జోజిరెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపింది. ఈ ఘటన తరువాత వారిద్దరూ ఇద్దరూ కలిసి వేధిస్తుండటంతో నవంబరు 1న మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వారిపై కేసు నమోదు చేశారని తెలిపింది. అయితే పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని వారు ఒత్తిడి తేగా ఒప్పుకోలేదని పైగా కళాశాల విద్యార్థులకు, కళాశాలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించిందంటూ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో బ్లెస్సీ, ఆమెతో పాటు అక్షయ్ అనే యువకుడిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేశారని తెలిపింది. విషయాన్ని బయట పొక్కకుండా యాజమాన్యం తీవ్ర ఒత్తిడి తెచ్చినా వినక పోవటంతో మానసికంగా చిత్రహింసలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంకా 3 నెలల్లో తన ఫైనలియర్ పూర్తి కానుందని ఈ పరిస్థితుల్లో సస్పెండ్ చేయటం ఎంతవరకు న్యాయమంటూ బాధితురాలు ప్రశ్నించింది.

విచారణ జరుపుతున్నాం

- సీఐ సత్యనారాయణ

భారత్ బైబిల్ కళాశాల విద్యార్థిని బ్లెస్సీ ఫిర్యాదుపై నవంబరు 1న కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నాం. బాధితురాలు బ్లెస్సీ, అక్షయ్ అనే యువకుడితో కలిసి కళాశాలలో తరగతులు నిర్వహించకుండా అడ్డుకోవటంతో కళాశాల యాజమాన్యం ఆమెపై ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేశాం. ఈ కేసు విచారణకు ప్రత్యేకంగా మహిళ ఎస్ఐను నియమించాం. కళాశాల యాజమాన్యంతో పాటు, విద్యార్థుల వాంగ్మూలాలను సేకరిస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఉత్సాహంగా రాష్ట్ర చౌకీబాల్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రాష్ట్ర చౌకీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ జట్ల ఎంపికలు ఉత్సాహపూరిత వాతావరణంలో మంగళవారం జరిగాయి. ఎంపికైన జట్లకు ఈ నెల 18 నుంచి కోచింగ్ క్యాంపు నిర్వహించి, తర్వాత ఈ నెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్‌లో జాతీయ చౌకీబాల్ చాంపియన్‌షిప్‌కు పంపుతామని రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌రావు తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే...

బాలుర అండర్-19: జి.సాయికిరణ్, జాన్ రష్మిక్, స్టీఫెన్‌రాజు, వి.ఉమామహేశ్వరరావు, సీహెచ్ పార్థు, ఈ రామ్ చరణ్, టి.జాగర్, (విశాఖ), భాను ప్రకాష్, ఎస్‌కే హనీఫ్ సాహిల్, సందీప్ (అల్లూరి జిల్లా), ఎస్ నాగశివ ధీరజ్, ఎం చైతన్య (ఎన్టీఆర్ జిల్లా), స్టాండ్ బైలుగా బీ వరేష్, ఎం దీపక్‌కుమార్ ఎంపికయ్యారు. బాలికలు అండర్-19 ఎం బ్యూలా, సాక్షి (అల్లూరి జిల్లా), భాగ్యశ్రీ (విశాఖ), ఎస్ కావ్యశ్రీ (శ్రీకాకుళం), కె.మానస, గీతురాయ్ (గుంటూరు), బత్ర గున్నీసా, శ్రావణి, సయ్యద్ సమీరా (ఎన్టీఆర్).

జాతీయ క్రీడలకు జట్లను పంపేందుకు చర్యలు

- ఏపీవోఏ సెక్రటరీ కేపీ రావు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరగనున్న 38వ జాతీయ క్రీడల్లో అర్హత సాధించిన మన జట్లను పాల్గొనేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కేపీ రావు క్రీడా సంఘాలకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికల కోసం ఈ నెలలో హైకోర్టు తీర్పు ఇవ్వనుందని, అన్ని క్రీడల్లో ఒకే సంఘం ఉండేలా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటి వరకు 38 సభ్య రాష్ట్ర సంఘాల్లో మెజార్టీ సభ్యులు మనతోనే ఉన్నారన్నారు. హైకోర్టు ఉత్తర్వులు జారీ చేశాక ఏపీవోఏ ఎన్నికలపై చర్చించి నిర్ణయించడానికి ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని కేపీ రావు వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- రవాణా శాఖ మంత్రికి వినతి

బస్టేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర శాఖ నేతలు మంగళవారం రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. నేతలు మాట్లాడుతూ ఇంతకు ముందే ఎన్నో అంశాలతో పాటు తాజాగా ప్రస్తావించిన సమస్యలను కూడా మంత్రికి, ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. వారంతా సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్ణయాలు చేస్తామని చెప్పారన్నారు. డ్రైవర్, కండక్టర్లకు ఈ ఏడాది జూలై నుంచి నిలిపివేసిన నైట్ హాల్ట్ అలవెన్స్ ఫైల్ ఆర్థికశాఖలో ఉందని, క్లియర్ చేయాలని మంత్రికి తెలిపామన్నారు. తాను త్వరలోనే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి తెలిపారన్నారు. అన్ని సమస్యలకు సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపామన్నారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పి.వి. మోహన్ ఉన్నారు.

బిజినెస్

విజయవాడ ● బుధవారం 4 డిసెంబరు 2024

నిర్వహణలో లేని ఖాతాలను తగ్గించుకోండి

బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: నిర్దిష్ట కాలం పాటు ఎలాంటి లావాదేవీలు నిర్వహించని ఖాతాలు లేదా స్తంభింపచేసిన ఖాతాల సంఖ్య తగ్గించాలని బ్యాంకులను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆదేశించింది. అలాంటి ఖాతాల సంఖ్య ఎంత ఉన్నది ప్రతి త్రైమాసికానికి ఒకసారి ప్రతి బ్యాంకు ప్రకటించాలని సూచించింది. అలాంటి ఖాతాల్లో నిల్వ ఉండిపోతున్న సొమ్ము క్రమక్రమంగా పెరిగిపోతూ ఉండడం పట్ల ఆవేదన ప్రకటించింది. ఇలా ఖాతాలు స్తంభించిపోవడానికి కారణాలెన్నో ఉన్నట్టు తమ తనిఖీల్లో తేలిందని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐకి చెందిన సూపర్‌విజన్ డిపార్ట్‌మెంట్ ఇలాంటి ఖాతాలపై ఇటీవల విశ్లేషణ నిర్వహించింది.

మొత్తం డిపాజిట్లలో చలామణిలో లేని ఖాతాలు/క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల సంఖ్య పలు బ్యాంకుల్లో పెరుగుతున్నట్టు తేలిందని తెలిపింది. అలాంటి ఖాతాలన్నింటినీ తేలికైన విధివిధానాలు అనుసరించడం ద్వారా పునరుద్ధరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచిస్తూ బ్యాంకు చీఫ్‌లందరికీ నోటిఫికేషన్ పంపింది. మొబైల్/ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా కేవైసీ అప్‌డేట్ చేయడానికి , వీడియో కస్టమర్ గుర్తింపు విధానం అనుసరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే సమాజంలో దిగువ వర్గాలకు చెందిన ఖాతాలను ఇలాంటి ఖాతాల నుంచి వేరు చేసి ఆ ఖాతాల్లోకి నిరంతరాయంగా నగదు బదిలీ పథకాల నిధులు డిపాజిట్ అయ్యే వెసులుబాటు కల్పించాలని కూడా కోరింది. ఈ దిశగా బ్యాంకులు తీసుకుంటున్న చర్యలను ఆయా బ్యాంకులకు చెందిన కస్టమర్ సర్వీస్ కమిటీ (సీఎస్‌సీ) పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించింది. అలాగే ఖాతాల సంఖ్య తగ్గించడంలో సాధిస్తున్న పురోగతిని దక్ష్ పోర్టల్ ద్వారా ప్రతి త్రైమాసికానికి ఒకసారి సీనియర్ సూపర్‌వైజరీ మేనేజ్‌కు (ఎస్ఎస్ఎం) నివేదించాలని తెలిపింది. డిసెంబరు త్రైమాసికం నుంచే ఈ కృషి ప్రారంభం కావాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా రుణ ప్రణాళికల రూపకల్పనలో బ్యాంకులు "దిగువ నుంచి ఎగువకు" వైఖరి అనుసరించాలని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ సూచించారు. డేటా విస్తృతంగా అందుబాటులో ఉంటున్న ప్రస్తుత యుగంలో రుణ ప్రణాళికల రూపకల్పనకు డేటా ఆధారిత వైఖరిని అనుసరించాలని కూడా సూచించారు. ఇలాంటి విధానాలు అనుసరించడం వల్ల లక్షిత వ్యూహాల రూపకల్పన సరళం అవుతుందన్నారు.

ఇండియా ఏఐ మిషన్‌కు కంట్రోల్ఎస్ జీపీయూలు!

న్యూఢిల్లీ: ఇండియా ఏఐ మిషన్‌కు గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూ) సరఫరా చేసేందుకు 19 కంపెనీలు పోటీపడుతున్నాయి. ఇందులో హైదరాబాద్ కేంద్రంగా పని చేసే కంట్రోల్ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కూడా ఉంది. ఈ కంపెనీతో పాటు టాటా కమ్యూనికేషన్స్, జియో ప్లాట్‌ఫామ్స్ కూడా ఇందుకోసం బిడ్ వేశాయి. ఈ ఏఐ మిషన్ కోసం 10,000 జీపీయూల సరఫరా కోసం కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఆగస్టు 16న టెండర్లు పిలిచింది. ముందు 50 కంపెనీలు ఇందుకు ఆసక్తి చూపినా టెండర్ చివరి తేదీ నవంబరు 28 నాటికి 19 కంపెనీలు మాత్రమే బిడ్స్ వేశాయి. ఈ నెల 2న ఈ బిడ్స్ ఓపెన్ చేశారు. కంపెనీల అర్హత, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఈ జీపీయూలు సరఫరా చేసే కంపెనీలను ఎంపిక చేస్తారు.

సిగరెట్లు, శీతల పానీయాలు మరింత ప్రియం!

35 శాతానికి పెరగనున్న జీఎస్టీ?

- రూ.1,500-10,000 మధ్య ధర ఉండే దుస్తులపై 18% జీఎస్టీ!
- రూ.10,000 మించిన వస్త్రాలు 28% పరిధిలోకి
- జీఎస్టీ మండలి ఆమోదమే తరువాయి



న్యూఢిల్లీ: సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలు (కూల్‌డ్రింక్స్) మరింత ప్రియం కానున్నాయి. వీటిపై విధించే జీఎస్టీని ప్రస్తుత 28 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని మంత్రుల బృందం (జీఓఎం) సిఫారసు చేసింది. ఈ నెల 21న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్టీ మండలి దీనిపై నిర్ణయం తీసుకోనుంది. జీఎస్టీ మండలి ఆమోదిస్తే వీటి ధరలు మరింత పెరగనున్నాయి. సిగరెట్లతో పాటు పొగాకు, పొగాకు ఉత్పత్తులపైనా 35 శాతం జీఎస్టీ విధించాలన్న ప్రతిపాదనతో చుట్టలు, బీడీలు, గుట్కా ధరలూ పెరగనున్నాయి. బట్టలు, దుస్తులపై విధించే జీఎస్టీ రేట్లనూ హేతుబద్ధం చేయాలని జీఓఎం కోరింది. రూ.1,500 వరకు ఉండే రెడీమేడ్ దుస్తులపై 5 శాతం, రూ.1,500 నుంచి రూ.10,000 మధ్య ధర ఉండే దుస్తులపై 18 శాతం జీఎస్టీ విధించాలని సిఫారసు చేసింది. రూ.10,000కు మించి ధర ఉండే వస్త్రాలను 28 శాతం జీఎస్టీ పరిధిలోకి తేవాలని సూచించింది.

ఇక ఐదు శ్లాబులు !

ప్రస్తుతం జీఎస్టీలో 5, 12, 18, 28 శాతం పేరుతో నాలుగు శ్లాబులు ఉన్నాయి. జీఓఎం తాజాగా సిఫారసు చేసిన 35 శాతం శ్లాబును జీఎస్టీ మండలి ఆమోదిస్తే ఈ సంఖ్య ఐదుకు చేరనుంది. ప్రస్తుతం కార్లతో పాటు కొన్ని విలాస వస్తువులు, ఆరోగ్యాన్ని దెబ్బతీసే కొన్ని హానికర వస్తువులపై 28 శాతం జీఎస్టీతో పాటు ప్రత్యేక సెస్సు విధిస్తున్నారు. సిగరెట్లు, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలను 35 శాతం జీఎస్టీ పరిధిలోకి తెచ్చిన తర్వాత వాటిపై ప్రత్యేక సెస్సు విధించాలా? వద్దా? అనే విషయాన్ని మాత్రం జీఓఎం స్పష్టం చేయలేదు.

జీఓఎం ఇతర సిఫారసులు

- రూ.15,000 కంటే ఎక్కువ ధర ఉండే బూట్లపై జీఎస్టీని 18% నుంచి 28 శాతానికి పెంచాలి.
- రూ.25,000 కంటే అధిక ధర ఉన్న రిస్ట్ వాచ్‌లపై విధించే జీఎస్టీని 18% నుంచి 28 శాతానికి పెంచాలి.

బీమాపై భారం తగ్గేనా?

మరోవైపు ఈ నెల 21న జరిగే జీఎస్టీ మండలి భేటీ అయినా బీమా రంగం జీఎస్టీపై నిర్ణయం తీసుకుంటుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ పాలసీలపై 18 శాతం జీఎస్టీ అమల్లో ఉంది. ఈ భారం తగ్గించకపోతే 2047 నాటికి 'అందరికీ బీమా' కలగానే మిగిలిపోతుందని బీమా పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కనీసం ఆరోగ్య, టర్మ్ పాలసీలపైనైనా జీఎస్టీ రద్దు చేయడమో, 5 శాతం శ్లాబులో చేర్చడమో చేయాలని పరిశ్రమ వర్గాలు ఇప్పటికే ప్రభుత్వానికి విజ్ఞప్తులు సమర్పించాయి.

అందరికీ కాకపోయినా కనీసం సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా పాలసీలనైనా జీఎస్టీ పోటు నుంచి తప్పించాలని కోరుతున్నాయి. ఆర్థిక మంత్రి సీతారామన్ ఇటీవల దీనిపై సానుకూలంగానే స్పందించారు. దీంతో ఈ నెల 21న జరిగే జీఎస్టీ మండలి భేటీపై బీమా పరిశ్రమ చాలా ఆశలు పెట్టుకుంది.

సెస్ నివేదికకు మరో ఆరు నెలలు

మరోవైపు జీఎస్టీ సెస్సులో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సిఫారసుల కోసం ఏర్పాటైన జీఓఎం, తన నివేదిక సమర్పించేందుకు మరో ఆరు నెలల గడువు కోరింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి నాయకత్వంలోని ఈ కమిటీలో అస్సాం, చత్తీస్‌గఢ్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ అధికారులు సభ్యులుగా ఉన్నారు. సెస్సుకు సంబంధించి అనేక అంశాలను కూలంకషంగా చర్చించాల్సి ఉన్నందున తమ నివేదిక సమర్పించేందుకు మరింత సమయం కావాలని కమిటీ కోరింది.

జీఓఎం నివేదిక ఇంకా అందలేదు: సీబీఐసీ

కాగా జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ కోసం ఏర్పాటు చేసిన జీఓఎం ఇంకా తన నివేదిక సమర్పించలేదని వార్తలు వినిపిస్తున్నాయి. కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) కూడా ఇదే విషయం స్పష్టం చేసింది. ఈ నివేదిక అందితే గానీ జీఎస్టీ మండలి ఈ నెల 21న జరిగే సమావేశంలో పన్ను రేట్ల సవరణ, హేతుబద్ధీకరణపై ఏ నిర్ణయం తీసుకుంటుందనేది తెలిపింది.

'6ఈ'పై ట్రేడ్‌మార్క్ గొడవ

మహీంద్రాపై కోర్టు కెక్కిన ఇండిగో

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), దేశీయ విమానయాన సంస్థ ఇండిగో మధ్య ట్రేడ్ మార్క్ వివాదం తలెత్తింది. మహీంద్రా ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) 'బీఈ 6ఈ' ఎస్‌యూవీ పేరులోని '6ఈ' తన ట్రేడ్ మార్క్ అని పేర్కొంటూ ఇండిగో కేసు నమోదు చేసింది. మహీంద్రా మాత్రం ఈ విషయాన్ని సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఇండిగోతో చర్చలు జరుపుతున్నట్టు ప్రకటించింది. తమ కొత్త ఈవీ ఎస్‌యూవీకి పెట్టిన 'బీఈ 6ఈ'కి ఇండిగో ట్రేడ్‌మార్క్ '6ఈ'కు అసలు సంబంధమే లేదని పేర్కొంది.

మూడు ఐఐటీలతో హ్యుండయ్ జట్టు

న్యూఢిల్లీ: బ్యాటరీలు, విద్యుత్ వాహనాలపై ఉమ్మడి పరిశోధన కోసం హ్యుండయ్ మోటార్ గ్రూప్ దేశంలోని మూడు ఐఐటీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. రాబోయే ఐదేళ్ల కాలంలో ఈ విభాగాలపై ఈ గ్రూప్ 70 లక్షల డాలర్లు ఇన్వెస్ట్ చేస్తోంది. హ్యుండయ్ భాగస్వామ్యం కుదుర్చుకున్న వాటిలో ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే, ఐఐటి మద్రాస్ ఉన్నాయి. ఇందులో భాగంగా ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో హ్యుండయ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు చేస్తారు.

లాభాల హ్యాట్రిక్

- మూడో రోజూ మార్కెట్ ముందుకే..
- సెన్సెక్స్ మరో 597 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజు లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 597.67 పాయింట్ల వృద్ధితో 80,845.75 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 181.10 పాయింట్లు బలపడి 24,457.15 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ ఇన్వెస్టర్లు మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా పలు బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు పెంచడం సూచీల ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 25 రాణించాయి. అదానీ పోర్ట్స్ షేరు 6 శాతానికి పైగా పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 2 శాతానికి పైగా పుంజుకోగా.. ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా వృద్ధి చెందాయి. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలపై జీఎస్టీని 28 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని మంత్రుల బృందం ప్రతిపాదించిన నేపథ్యంలో ఐటీసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, వరుణ్ బెవరేజెస్ నష్టాలు చవిచూశాయి. ఇంట్రాడేలో 3 శాతం క్షీణించిన ఐటీసీ షేరు చివరికి 1.02 శాతం నష్టంతో సరిపెట్టుకుంది. వరుణ్ బెవరేజెస్ 1.86 శాతం తగ్గింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ @ రూ.14 లక్షల కోట్లు

ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఒక దశలో దాదాపు 2 శాతం పెరిగి రూ.1,837 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. దీంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా రూ.14 లక్షల కోట్ల స్థాయికి చేరింది. చివరికి బ్యాంక్ షేరు 1.24 శాతం లాభంతో రూ.1,826.85 వద్ద ముగిసింది. మార్కెట్ క్యాప్ రూ.13.96 లక్షల కోట్ల స్థాయి వద్ద స్థిరపడింది.

గ్రాన్యూల్స్ షేరు ఢమాల్

హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ గ్రాన్యూల్స్ లిమిటెడ్ షేరు బీఎస్ఈలో 10.12 శాతం క్షీణించి రూ.534.45 వద్దకు జారుకుంది. తెలంగాణలోని గాగిల్లాపూర్‌లో ఉన్న యూనిట్‌లో తనిఖీలు జరిపిన యూఎస్ఎఫ్‌డీఏ ఆరు లోపాలను గుర్తించినట్లు కంపెనీ వెల్లడించడం ఇందుకు కారణమైంది. ఎందుకంటే, కంపెనీకి మెజారిటీ ఆదాయం ఈ యూనిట్‌లో తయారయ్యే ఔషధాల ద్వారానే సమకూరుతోంది.

రూ.45 కోట్ల ఐపీఓ నిధులను ఇన్వెస్టర్లకు తిరిగి ఇచ్చేయండి..

ట్రాఫిక్‌సోల్‌కు సెబీ ఆదేశాలు

నోయిడాకు చెందిన ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్‌కు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గట్టి షాకిచ్చింది. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా సమీకరించిన రూ.45 కోట్ల నిధులను ఇన్వెస్టర్లకు వారం రోజుల్లో రిఫండ్ చేయాలని మంగళవారం ఆదేశించింది. రిఫండ్ ప్రక్రియను పర్యవేక్షించాల్సిందిగా బీఎస్ఈని సెబీ నిర్దేశించింది. ఐపీఓ ద్వారా నిధుల సేకరణ కోసం ఈ కంపెనీ తన పత్రాల్లో తప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు ఓ షెల్ కంపెనీతో కుమ్మక్కైనట్లు సందేహాలున్న నేపథ్యంలో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్‌కు అనూహ్య స్పందన లభించింది. కంపెనీ ఆఫర్ ఏకంగా 345 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ.10,000 కోట్లకు పైగా విలువైన బిడ్లను ఆకర్షించింది. ఐపీఓ అనంతరం ఈ కంపెనీ బీఎస్ఈ ఎస్ఎంఈ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో తన షేర్లను నమోదు చేయాల్సింది. కానీ, ఈ ఐపీఓపై రిటైల్ మదుపరుల సంఘం అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో సంస్థ షేర్ల లిస్టింగ్‌ను బీఎస్ఈ వాయిదా వేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,780 ▲	71,300 ▲	99,500 ▼
ముంబై	76,324 ▲	69,913 ▲	89,980 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	104
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	92
కర్నూలు	90	నెల్లూరు	92
విశాఖపట్నం	100	అనంతపురం	92
గోదావరి	104		

స్పోర్ట్స్

ఫైనల్లో మన కుర్రాళ్లు

జూనియర్ ఆసియా కప్ హాకీ

- మలేసియాపై 3-1తో గెలుపు
- నేడు పాక్‌తో భారత్ తుదిపోరు

మస్కట్: డిఫెండింగ్ చాంపియన్ యువ భారత్ జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో 3-1తో మలేసియాను చిత్తు చేసింది. భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్, రోహిత్, శార్దానంద్ తివారీ తలో గోల్ చేశారు. మలేసియాలో ఏకైక గోల్‌ను అజీముద్దీన్ సాధించాడు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా ఫైనల్ చేరిన భారత్ బుధవారం జరిగే టైటిల్‌పోరులో పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో పాక్ 4-2తో జపాన్‌పై గెలిచింది.



గుకేష్ చేజేతులా..

- భారత జీఎంకు త్రుటిలో చేజారిన విజయం
- లిరెన్‌తో ఏడో గేమ్ డ్రా ● ప్రపంచ చెస్


సింగపూర్: అమూల్యమైన అవకాశాన్ని చేజార్చుకొన్న భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేష్.. ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో మరో గేమ్‌ను డ్రాగా ముగించాడు. మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో డిఫెండింగ్ చాంప్ డింగ్ లిరెన్‌తో గుకేష్ పాయింట్ పంచుకొన్నాడు. దీంతో ఇద్దరూ చెరో 3.5 పాయింట్లతో సమంగా నిలిచారు. 5 గంటల 22 నిమిషాలపాటు ఉత్కంఠ నడుమ సాగిన గేమ్‌లో తెల్లపావులతో ఆడిన గుకేష్ ఆధిపత్యం ప్రదర్శించినా.. ఒక్క తప్పిదంతో లిరెన్ త్రుటిలో ఓటమి కోరల నుంచి తప్పించుకొన్నాడు. దీంతో 72 ఎత్తులపాటు సాగిన గేమ్‌లో గుకేష్‌కు నిరాశే ఎదురైంది. ఓపెనింగ్‌లోనే భారత జీఎం విభిన్న ఎత్తులో లిరెన్‌ను ఆశ్చర్యపర్చాడు. అయితే, నియో గ్రన్‌ఫెల్డ్ డిఫెన్స్‌తో లిరెన్ అడ్డుకొనే ప్రయత్నం చేశాడు. క్రమంగా మిడిల్ గేమ్‌పై పట్టు సాధించిన గుకేష్ ఎత్తులకు పైఎత్తులు వేయడానికి లిరెన్ తీవ్రంగా ఆలోచించాల్సి వచ్చింది. దీంతో 40 ఎత్తుకు వచ్చే సరికి సమయాభావంతో అతడు ఒత్తిడికి గురయ్యాడు. కానీ, 45వ ఎత్తులో గుకేష్.. కింగ్‌ను కదిలించాల్సింది పోయి హెచ్4 లోకి పాన్‌ను జరపడం పెద్ద తప్పిదంగా మారింది. దీన్ని అవకాశంగా మార్చుకొన్న లిరెన్ రుక్‌తో గుకేష్ బిషప్‌కు గురిపెట్టాడు. దాన్ని కాపాడుకోవడానికి వేసిన ఎత్తులతో గేమ్‌పై గుకేష్ పట్టు చేజార్చుకొన్నాడు. మరోవైపు సెకండ్ టైమ్ కంట్రోల్‌లో చైనా జీఎం మెరుగైన ఆటతో ఊపిరిపీల్చుకొన్నాడు. చివరగా గుకేష్‌కు బిషప్ మాత్రమే మిగిలింది. ఫలితం తేలే అవకాశాలు లేకపోవడంతో 72 ఎత్తుల అనంతరం ఇరువురూ డ్రాకు అంగీకరించారు.

నార్వే టోర్నీ బరిలో అర్జున్

స్టావెంజర్ (నార్వే): భారత యువ గ్రాండ్ మాస్టర్, వరల్డ్ నెం:4 అర్జున్ ఇరిగేసి ప్రఖ్యాత నార్వే చెస్ టోర్నీ బరిలో నిలవనున్నాడు. వచ్చే ఏడాది మే 26 నుంచి జూన్ 6 వరకు టోర్నీ జరగనుంది. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత గోల్డ్ స్టాండర్డ్ ఎలో రేటింగ్ 2800 సాధించిన రెండో భారత ఆటగాడిగా అర్జున్ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే.

క్రీడా సంఘాల్లో కేటుగాళ్లు!

రెండు దశాబ్దాల కిందటే జాతీయ క్రీడలను అట్టహాసంగా నిర్వహించిన ఘన చరిత్ర ఆంధ్రప్రదేశ్‌ది. సిడ్నీ ఒలింపిక్స్‌లో పతకం కొల్లగొట్టిన కరణం మల్లీశ్వరి నుంచి కోనేరు హంపి, పీవీ సింధు, వెన్నం జ్యోతి సురేఖ, పారిస్ ఒలింపియన్లు సాత్విక్ సాయిరాజ్, యర్రాజి జ్యోతి వరకు ఒక స్ఫూర్తివంతమైన క్రీడా వారసత్వం ఆంధ్ర సొంతం. అలాంటి రాష్ట్రంలో క్రీడాకారులకు ప్రోత్సాహం కంటే క్రీడా సంఘాల పేరుతో చేసే చిల్లర రాజకీయాలు, నకిలీ సర్టిఫికెట్ల కుంభకోణాలు, దొడ్డి దారిన విద్యా ప్రవేశాలు, లంచాలతో స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలు, దొంగ ప్రాజెక్టుల పేరిట ప్రజాధనాన్ని లూటీ చేయడం నిత్యకృత్యంగా మారిపోయింది. అసలు సదరు క్రీడలకు సంబంధించిన కనీస నిబంధనలు తెలియని వారు, ఆ క్రీడను ఎప్పుడూ ఆడని వారు విద్యా, ఉద్యోగ ప్రవేశాల్లో లబ్ధి పొందుతుండడంపై నిజమైన క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఐదారు క్రీడా సంఘాలు కాసుల కక్కుర్తితో బరితెగించి చేస్తున్న ఈ దందాకు శాప్‌లోని కొందరు ఉన్నతాధికారులు కూడా తోడవడంతో కంచే చేను మేసే పరిస్థితులు దాపురించాయి.



దొంగ సర్టిఫికెట్లతో స్పోర్ట్స్ కోటా దుర్వినియోగం

- విద్యా ప్రవేశాలు, ఉద్యోగాల్లో మోసాలు
- అక్రమార్కులతో కొందరు శాప్ అధికారులు కుమ్మక్కు!
- టాలెంట్ హంట్ పేరిట రూ.7 కోట్లు హాంఫట్

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉమ్మడి కృష్ణా, విశాఖపట్నంతో పాటు దాదాపు 10 పాత జిల్లాల్లో కొన్ని క్రీడా సంఘాలు చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. జూడో, సాఫ్ట్‌బాల్, వాటర్ స్పోర్ట్స్, రోలర్ స్కేటింగ్, ఖో-ఖో, ఫెన్సింగ్, అథ్లెటిక్స్‌తో పాటు మరికొన్ని క్రీడా సంఘాలు అక్రమాలకు అడ్డాగా మారిపోయాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్)లోని ఓ ఉన్నతాధికారే అక్కడ జరిగే సగం అక్రమాలకు సూత్రధారని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పశుసంవర్ధక, గ్రామ సచివాలయ ఉద్యోగాల్లో నకిలీలు!

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో పశుసంవర్ధక శాఖకు సంబంధించిన ఉద్యోగాల భర్తీలో 18 మంది స్పోర్ట్స్ కోటాలో ఎంపికయ్యారు. వీరిలో ఒక క్రీడాంశంనుంచే ఆరుగురు నకిలీ సర్టిఫికెట్లు పెట్టి అక్రమంగా ఉద్యోగాలు పొందారన్న ఆరోపణలున్నాయి. 2018 నుంచి 2021 మధ్య ఈ ఆరుగురు నకిలీ సర్టిఫికెట్లను పొందినట్టు సమాచారం. ఈ సర్టిఫికెట్ల పరిశీలన సమయంలోనే అవి నకిలీవని ఆ రాష్ట్ర సంఘం శాప్ వీసీ-ఎండీకి ఈ-మెయిల్, పోస్ట్ ద్వారా తెలియజేసినా కింది స్థాయి సిబ్బంది అవేమీ పట్టించుకోకపోవడంతో నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి ఉద్యోగాలు లభించాయి. విశాఖపట్నం ప్రాంతంలోని సచివాలయాల్లోని వివిధ ఉద్యోగాల్లో 23 మంది నకిలీ సర్టిఫికెట్లతో విధుల్లో చేరిపోయారట. వీటిలో ఎక్కువ దొంగ సర్టిఫికెట్లు 2018 నుంచి 2021 మధ్యనే సదరు సంఘం జారీ చేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ దొంగ సర్టిఫికెట్ల బ్యాచ్ ఎంబీబీఎస్‌తో పాటు ఇతర ఉన్నత విద్యా ప్రవేశాల్లోనూ తమ కళను ప్రదర్శించి, డబ్బులు దండుకున్నారన్న విమర్శలున్నాయి. తిరుపతి కేంద్రంగా ప్రస్తుతం ఈ ఎంబీబీఎస్ సీట్ల వ్యవహారంపై విచారణ జరుగుతోంది. పశుసంవర్ధక, గ్రామ సచివాలయం, ఎంబీబీఎస్ సీట్లలో వెలుగు చూసిన ఈ బాగోతంలో ఆయా జాతీయ క్రీడా సంఘాలు కూడా అవి నకిలీ సర్టిఫికెట్లని తేల్చినా..చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనుకాడుతున్నారన్న దానిపై సందేహాలు నెలకొన్నాయి. గత ఐదేళ్లలో 500ల నుంచి 700 మంది వరకు ఈ నకిలీ సర్టిఫికెట్లతో విద్యా, ఉద్యోగ ప్రవేశాల్లో చేరినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ మధ్య రాష్ట్ర హైకోర్టులోని ఉద్యోగ నియామకాల్లోనూ సాఫ్ట్‌బాల్ దొంగ సర్టిఫికెట్లతో కొందరు కొలువులు పొందడంతో ఒంగోలు జిల్లాకు చెందిన అర్హులైన క్రీడాకారులు ఆందోళన చేశారు. దీనిపై రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేయడం తెలిసిందే.

టాలెంట్ హంట్‌తో రూ.7 కోట్లు హాంఫట్!

రాష్ట్రంలోని ప్రతిభావంతులైన అథ్లెట్లను వెలికి తీసి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తామంటూ మసిపూసి మారేడుకాయ చేసి ప్రాజెక్టు గాండీవలో ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ సంఘం సుమారు రూ.7 కోట్లు మింగేసినట్టుగా తీవ్రమైన ఆరోపణలున్నాయి. పైలెట్ ప్రాజెక్టు కింద గుంటూరు, కడప, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళంలోని దాదాపు పది లక్షల మంది విద్యార్థులకు అథ్లెటిక్ బ్యాటరీ టెస్టు (శరీర సామర్థ్య పరీక్షలు) నిర్వహించి, ఇందులో గుర్తించిన మెరికల్లాంటి క్రీడాకారులకు ప్రభుత్వ, దాని అనుబంధ క్రీడా అకాడమీల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించి వారిని చాంపియన్లుగా తీర్చిదిద్దాలనేది గాండీవ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు ఒక్కో విద్యార్థిపైన రూ.130లు ఖర్చు చేసేందుకు పది లక్షల మందికి గాను సుమారు రూ.15 కోట్ల అంచనాలను ఓ కంపెనీ రూపొందించింది. ఈ కంపెనీ ఆంధ్ర అథ్లెటిక్స్ సంఘంలోని విజయవాడకు చెందిన ఒక ముఖ్య నేతకు సంబంధించిన బినామీ అని చెబుతున్నారు. సదరు కంపెనీకి స్పోర్ట్స్ ప్రాజెక్టులు చేసిన సరైన అనుభవం లేకపోయినా అప్పుడు శాప్‌లోని కొందరు ఉన్నతాధికారుల అండదండలతో విడతల వారీగా సుమారు రూ.7 కోట్లు దండుకున్నారన్న ఆరోపణలున్నాయి. 10 లక్షల విద్యార్థుల లక్ష్యంగా ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో కనీసం 15 వేల మందికి కూడా పరీక్షలు చేయలేదని, దీనికి సంబంధించిన డేటా కూడా శాప్ వద్ద లేదని సమాచారం. వీటిపై దర్యాప్తు చేయాలంటూ ఇటీవల ఆంధ్ర ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ) రాష్ట్ర డీజీపీకి కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

క్రీడా సంఘాల్లో కుటుంబ పాలన

ప్రస్తుతం కొన్ని క్రీడా సంఘాలు ఎంతసేపూ ఏదోఒక టోర్నమెంట్ నిర్వహిస్తూ డబ్బులు దండుకోవడం, దొంగ సర్టిఫికెట్ల వ్యాపారం చేయడంలో ఆరితేరిపోయాయి. ఆ సంఘాల్లో ఎల్లకాలం తమ మాటే చెల్లుబాటయ్యేలా వారి కుటుంబ సభ్యులు, బంధువులతో నింపేసి కుటుంబ ఆస్తిగా మార్చేశాయి. ఇప్పటికైనా శాప్‌లోని అవినీతి అధికారులు, అక్రమాలకు కేరాఫ్‌గా మారిన క్రీడా సంఘాలపైన ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ సంస్థతో దర్యాప్తు చేయిస్తేగానీ రాష్ట్రంలో క్రీడారంగం బాగుపడదని క్రీడాకారులు వాపోతున్నారు.

ఉర్విల్.. ఉరుములా..

36 బంతుల్లోనే సెంచరీ



ఇండోర్: ఐపీఎల్‌లో అమ్ముడుపోని గుజరాత్ బ్యాటర్ ఉర్విల్ పటేల్.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ క్రమంలో టీ20 క్రికెట్‌లో 40 బంతుల్లోపు రెండు శతకాలు సాధించిన తొలి బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఉత్తరాఖండ్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పటేల్ (41 బంతుల్లో 115 నాటౌట్) కేవలం 36 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. దీంతో ఉత్తరాఖండ్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 13.1 ఓవర్లలోనే ఛేదించింది. వారం క్రితం త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో పటేల్ 28 బంతుల్లో వేగవంతమైన శతకం సాధించాడు.

ఆంధ్ర పాంచ్ పటాక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ఆంధ్ర జట్టు వరుసగా ఐదో విజయం సాధించి గ్రూప్-ఈలో అగ్రస్థానంలో నిలిచింది. మంగళవారం సికింద్రాబాద్ జింఖానా స్టేడియంలో కేరళతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. టాస్ గెలిచిన ఆంధ్ర.. ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. పేసర్ కేవీ శశికాంత్ (3/23) సహా బౌలర్లంతా సమష్టిగా రాణించడంతో కేరళ 18.1 ఓవర్లలో 87కు ఆలౌటైంది. స్వల్ప లక్ష్యం ఛేదనలో ఓపెనర్ శ్రీకర్ భరత్ (33 బంతుల్లో 56 నాటౌట్) చెలరేగడంతో ఆంధ్ర 13 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసి గెలుపొందింది. ఇక, ఇదే ట్రోఫీలో భాగంగా రాజ్‌కోట్‌లో మధ్యప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఏడు పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఉప్పల్‌లో సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 39 పరుగుల తేడాతో నెగ్గింది. ముంబై బ్యాటర్లు సూర్యకుమార్ యాదవ్ (70), శివం దూబే (71 నాటౌట్) అర్ధ శతకాలతో చెలరేగారు.

16 బంతుల్లో.. 5 వికెట్లు



- సుఫియాన్ సంచలన బౌలింగ్
- జింబాబ్వే 57 ఆలౌట్ ● పాక్‌దే సిరీస్

బులవాయో: పాకిస్థాన్ స్పిన్నర్ సుఫియాన్ ముఖీమ్ (2.4-0-3-5) సంచలన బౌలింగ్‌తో జింబాబ్వే వెన్ను విరిచాడు. మంగళవారం జరిగిన రెండో టీ20లో ముఖీమ్ ధాటికి ఆతిథ్య జట్టు 12.4 ఓవర్లలో కేవలం 57 పరుగులకే కుప్పకూలింది. టీ20ల్లో ఈ జట్టుకిదే అత్యల్ప స్కోరు. ఇక పది వికెట్ల తేడాతో నెగ్గిన పాక్ మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సిరీస్‌ను దక్కించుకుంది. మరోవైపు ఈ ఫార్మాట్‌లో పాక్ తరఫున సుఫియాన్‌దే ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన కావడం విశేషం. 16 బంతులు వేసిన సుఫియాన్ కేవలం మూడు పరుగులు మాత్రమే ఇచ్చి సగం జట్టును పెవిలియన్‌కు చేర్చడం విశేషం. ఆ తర్వాత స్వల్ప ఛేదనను పాక్ 5.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 61 పరుగులు చేసి నెగ్గింది.



రేషన్.. పరేషాన్

ఆ బియ్యం దించేయడమే

స్టెల్లా నౌక సీజ్ ఇక అసాధ్యమేనా?

- అడ్మిరాలిటీ కోర్టులో కేసు వేసినా నిలబడే అవకాశం లేదంటున్న అధికారులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

రేషన్ బియ్యం లోడైన కాకినాడ పోర్టులోని స్టెల్లా ఎల్ నౌకను సీజ్ చేయడం అసాధ్యమేనని అధికారులు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. నౌక సీజ్ కోసం కేసుపెట్టినా అడ్మిరాలిటీ న్యాయస్థానంలో అది నిలబడే అవకాశం చాలా తక్కువని భావిస్తున్నారు. పైగా మరో దేశానికి చెందిన నౌకను సీజ్ చేయడం అతికష్టమైన పనిగా నిపుణులతో మాట్లాడాక ఓ అంచనాకు వచ్చారు. ఇటీవల కాకినాడలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... బియ్యం లోడు అవుతున్న షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. అయితే అప్పటికే తుఫాను ముప్పు వల్ల సముద్రం అల్లకల్లోలంగా మారడంతో.. నౌకలోకి లోడింగ్ నిలిచిపోయింది. దీంతో పవన్ షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించిన తర్వాత దీన్ని ఆపడానికి పెద్దగా చిక్కులు ఎదురుకాలేదు. అయితే ఇప్పుడు తుఫాను ముప్పు తొలగిపోయింది. దీంతో పోర్టులో మిగిలిపోయిన బియ్యం లోడింగ్ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఒకవేళ లోడింగ్ చేయకపోతే డెమరేజీ భారం పడనుంది. మరోవైపు.. కస్టమ్స్ అధికారులేమో బియ్యం స్మగ్లింగ్ పరిధిలోకి రావంటూ నౌకను సీజ్ చేయడానికి ముందుకు రాలేదు. పౌరసరఫరాలశాఖ అడ్మిరాలిటీ న్యాయస్థానంలో కేసు దాఖలకు సోమవారం ప్రయత్నాలు చేసింది. అయితే, ఈ న్యాయస్థానం.. నౌకలకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల వివాదాలకు మాత్రమే పరిమితమై తీర్పులు ఇస్తుంది. దీంతో ఒకవేళ నౌక సీజ్‌కు పిటిషన్ వేసినా నిలబడదనే వాదన అధికారుల్లో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కాకినాడలో ఉన్న నౌకను కస్టమ్స్, అడ్మిరాలిటీ న్యాయస్థానం ఆదేశాలు లేకుండా ఆపడం ఇబ్బందని అధికారులు భావిస్తున్నారు. నౌకలోని రేషన్ బియ్యాన్ని కిందకు దింపేసి నౌకకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

చేతనైతే అంబటి, పేర్ని తనిఖీ చేసుకోవచ్చు: కేశవ్

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడలో తన వియ్యంకుడిపై ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలు అంబటి రాంబాబు, పేర్ని నానికి చేతనైతే పోర్టు గేటు ముందు నిలబడి తనిఖీలు చేసుకోవచ్చునని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. 'అంబటి, పేర్ని కావాలంటే కాకినాడ పోర్టు గేటు ముందు నిలబడి మా వియ్యంకుడి బియ్యం లారీల్లో ప్రతి బస్తానూ తనఖీ చేసుకోవచ్చు' అని కేశవ్ వ్యాఖ్యానించారు. కాగా, 'రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం కేంద్రంగా ఉంది. ఆ స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. అలాగే కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం తరలింపు వ్యవహారాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పార్థసారథి చెప్పారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎంలు సీరియస్‌గా ఉన్నారన్నారు.

ఆ బియ్యం ఎక్కడివో తేలుస్తాం!

స్టెల్లా ఎల్ నౌకలో తనిఖీల కోసం మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు

- పోర్టుకు వచ్చే ప్రతి లోడుపైనా నిఘా
- కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో వివాదాస్పదంగా మారిన స్టెల్లా ఎల్ నౌక వ్యవహారంపై సమగ్ర తనిఖీలు చేసేందుకు ప్రభుత్వంలోని ఐదు శాఖల అధికారులతో మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఆ నౌకలో గుర్తించిన బియ్యం గతంలో సీజ్ చేసి బ్యాంకు గ్యారెంటీపై విడుదల చేసిన రేషన్ బియ్యామా కాదా అనే కోణంలో పరిశీలన చేపడుతున్నామని పేర్కొన్నారు. కాకినాడ పోర్టుకు వచ్చే బియ్యం ప్రతి లోడునూ కమిటీ తనిఖీ చేస్తుందని స్పష్టం చేశారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "గతనెల 27న కాకినాడ ఆర్డీవోతో కలిసి స్టెల్లా ఎల్ నౌకలో జరిపిన తనిఖీలో పీడీఎస్ బియ్యం బయటపడ్డాయి. ఈ వ్యవహారంపై విచారణకు రెవెన్యూ, పోలీసు, కస్టమ్స్, పౌరసరఫరాలు, పోర్టు అధికారులతో మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేశాం. ఈ కమిటీ నౌకలో ఉన్న మొత్తం బియ్యాన్ని తనిఖీ చేసి నివేదిక సమర్పిస్తుంది. అలాగే ఎగుమతిదారులు, మిల్లులకు సంబంధించిన బిల్లులు, ఎగుమతిదారులు నిల్వ ఉంచిన గోదాముల నుంచి భారీ నౌక వరకు జరిపిన రవాణాకు సంబంధించిన ట్రాక్ షీట్లు తనిఖీ చేస్తాం. ఈ తనిఖీ ద్వారా నౌకలో ఉన్నది పీడీఎస్ బియ్యామా కాదా అనేది తేలుతుంది" అని కలెక్టరు వివరించారు. ప్రస్తుతం స్టెల్లా ఎల్ నౌక పోర్టు ఆధీనంలోనే ఉన్నదని, కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు కాకినాడ పోర్టు నుంచి అక్రమ ఎగుమతులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాకినాడ పోర్టుకు వచ్చే బియ్యాన్ని 24 గంటలూ తనిఖీలు చేసేవిధంగా మూడు షిఫ్ట్‌ల్లో టీమ్‌లను నియమిస్తున్నామన్నారు. పీడీఎస్ రైస్ తరలిస్తున్నట్లు గుర్తిస్తే ఆ వాహనాన్ని ఈ టీమ్‌లు సీజ్ చేస్తాయన్నారు. ఆ లోడ్ ఏ గోదాము నుంచి వచ్చిందో చూసి అక్కడి స్టాక్‌ను కూడా సీజ్ చేస్తామన్నారు.



కాకినాడ కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

జగన్ 'అరబిందో' పాయం

- కాకినాడ డీప్‌వాటర్ పోర్టు, సెజ్‌లో అడ్డగోలు అరాచకాలు
- 'ఆంధ్రజ్యోతి' ఆనాడే చెప్పింది
- తయారుచేసిన ఆడిట్ రిపోర్టులు చూపి పెద్దవాటాదారు కేవీరావు మెడపై కత్తి
- జరిమానా, జైలు పేరుతో నోటీసులు
- చేసేది లేక మొత్తం వాటాలను అరబిందోకు రాసిచ్చేసిన రావు
- పక్కపక్కనే ఒకే కంపెనీకి 2 పోర్టులు ఉండకూడదన్న రూల్స్‌కూ తూట్లు
- ఎట్టకేలకు సీఐడీకి కేవీ రావు ఫిర్యాదు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అరాచకమే హద్దుగా చెలరేగిపోయిన వైసీపీ తన ఐదేళ్ల పాలనలో చేయని దౌర్జన్యాలు లేవు. దేనిపైనైనా అప్పటి సీఎం జగన్ కన్ను పడితే చాలు.. బెదిరించడం.. అడిగింది ఇవ్వనంటే కేసుల బూచితో దారికి తెచ్చుకోవడం. కాకినాడ డీప్‌వాటర్ పోర్టు, కాకినాడ సెజ్ వాటాదారు అయిన కేవీరావును బెదిరించి అరబిందో పేరిట మొత్తం కొట్టేశారు. దీనిపై ఇప్పుడు సీఐడీకి ఫిర్యాదు అందింది. కానీ ఈ దందాను మూడేళ్ల కిందటే 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. ప్రభుత్వం ముసుగులో ఏవిధంగా జగన్ అరాచకాలు సాగిస్తున్నారో ప్రపంచానికి తెలియజెప్పింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నాటి దందాపై కొత్త ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీస్తూ 'అరబిందో ఆటలు' పేరిట కథనం ప్రచురించింది. కాకినాడ నగరానికి ఆనుకుని ఉన్న కాకినాడ సీపోర్టు (డీప్‌వాటర్ పోర్టు) నుంచి విదేశాలకు రసాయనాలు, ఎరువులు, గ్రానైట్‌రాయి మొదలైనవి విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. 1999లో దీని ప్రారంభ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సీపోర్టు యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా పోర్టులో నాలుగు బెర్తులను ఆపరేషన్-మెయింటెనెన్స్-మేనేజ్‌మెంట్ విధానం కింద కాకినాడ సీపోర్టు యాజమాన్యం నిర్వహించాలి. వచ్చే లాభాల్లో 22 శాతం వాటా ప్రభుత్వానికి చెల్లించాలి. కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కన్సార్షియం పోర్టు ప్రైవేట్ లిమిటెడ్, సౌత్ ఇండియా ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కంపెనీ, వీఆర్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలన్నీ కన్సార్షియంగా ఏర్పడి మొదటి నుంచీ ఈ పోర్టును నిర్వహిస్తున్నాయి. ఇందులో అతి పెద్ద వాటాదారు కేవీ రావు. అత్యధికంగా ఈయనకు 41.12 శాతం వాటా కింద 2.15 కోట్ల షేర్లున్నాయి. పోర్టు లాభాల్లో 22 శాతం వాటా కింద రాష్ట్రప్రభుత్వానికి ఏటా రూ.100 కోట్ల వరకు చెల్లిస్తోంది. అయితే ఈ పోర్టు నిర్వహణ కింద వచ్చే లాభాల్లో కచ్చితంగా ఇంత మొత్తం ఏటా చెల్లించి తీరాలనే క్లాజులను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కన్సార్షియంకు అనుకూలంగా సవరించారు. అంతేకాకుండా వచ్చే 50 ఏళ్లు సీపోర్టు దాని అధీనంలోనే కొనసాగేలా ఆదేశాలు కూడా ఇచ్చారు. దీంతో కేవీ రావు ఆధిపత్యం మరింత పెరిగింది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాకినాడ సీపోర్టుపై నాటి సీఎం జగన్ కన్ను పడింది. కార్గో రవాణా, వ్యాపార లావాదేవీల నిర్వహణ, ఆదాయ, ఖర్చుల విషయంలో కేవీ రావుకు చెందిన కేఐహెచ్‌పీఎల్ లాభాలను తక్కువగా చేసి చూపుతోందని నెపం మోపారు. తన సన్నిహితుడైన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని రంగంలోకి దించారు. ఈయన పోర్టుల నిర్వహణలో జరిగే అంతర్గత అక్రమాలు, దర్యాప్తులో ఆరితేరిన క్రోల్ అనే ఆడిట్ సంస్థను తెరపైకి తెచ్చారు. ఈ సంస్థ సీపోర్టులో రికార్డుల ఆడిట్ నిర్వహించి పలు లోపాలను జగన్‌కు కావలసిన విధంగా 'గుర్తించింది'. కొన్ని వందల కోట్లు స్వాహా చేసినట్లు ఆధారాలు తయారుచేసింది. ఈ నివేదికను చూపించి కేవీ రావు మెడపై కత్తిపెట్టారు. జరిమానా.. జైలు.. వాటా విక్రయం.. అనే మూడు మార్గాలను ఆయన ముందుంచారు. చేసేది లేక ఆయన తన 41.12 శాతం వాటాను అరబిందోకు విక్రయించారు. కొంతకాలానికి కాకినాడ సెజ్‌లో సీపోర్టు లిమిటెడ్‌కు ఉన్న వాటాలను సైతం అరబిందో బలవంతంగా కొనేసింది. దీంతో కాకినాడ సెజ్‌లో దాదాపు నూరుశాతం వాటాను లాగేసుకుంది.



కాకినాడ డీప్‌వాటర్ పోర్టులో జగన్ వాటా వశంపై 2021 మార్చి 12న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం

సెజ్‌నూ చుట్టేశారు..

కాకినాడ ఎస్ఈజెడ్ పదివేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇది దేశంలోనే అతి పెద్దది. 2010లో జీఎంఆర్ సంస్థ భూసేకరణ ద్వారా సెజ్‌లో 51శాతం వాటా కొనుగోలు చేసింది. 46 శాతం వాటా కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్‌కు, 3శాతం వాటా ఏపీఐఐసీకి ఉండేది. తొండంగి మండలంలో తీరాన్ని ఆనుకుని రూ.2,300 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవు నిర్మాణం కూడా చేపట్టాలని జీఎంఆర్ నిర్ణయించింది. 2019లో నాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు. అయితే నిధుల సమస్యతో అదానీతో 2020 మార్చిలో జీఎంఆర్ జట్టు కట్టింది. 49శాతం వాటాను దానికి కట్టబెట్టింది. అయితే తర్వాత ఆకస్మికంగా 2021లో సెజ్‌లో తనకున్న 51 శాతం వాటాను జీఎంఆర్ సంస్థ అరబిందోకు విక్రయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది కార్పొరేట్ వర్గాల్లో పెనుసంచలనం సృష్టించింది. ఫార్మా కంపెనీ అయిన అరబిందో ఏకంగా సెజ్‌ను కొనుగోలు చేయడం వెనుక చాలా కథే నడచింది. విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ కాంట్రాక్టును 2019లో టీడీపీ ప్రభుత్వం జీఎంఆర్‌కు కట్టబెట్టింది. కాకినాడ సెజ్‌లో వాటాను అరబిందోకు అమ్మకపోతే విమానాశ్రయ కాంట్రాక్టును రద్దు చేస్తామని జగన్ ప్రభుత్వంలోని పెద్దలు బెదిరించారు. చేసేది లేక సెజ్‌ను, అందులో పోర్టులో వాటాను అరబిందోకు అది అమ్మాల్సి వచ్చింది. కాకినాడ డీప్‌వాటర్ పోర్టులో జగన్ వాటా వశంపై 2021 మార్చి 12న, కూటమి సర్కారు వచ్చాక అరబిందోపాయంపై ఈ ఏడాది జూలై 9న 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురించింది. మెడపై కత్తి పెట్టి వాటాలు రాయించుకున్నారని కేవీ రావు తాజాగా సీఐడీకి ఫిర్యాదు చేయడంతో మరోసారి జగన్ దందా చర్చనీయాంశమైంది.

ఆలీషా నౌకల తయారీదారు!

పవన్ కల్యాణ్‌కు అధికారుల నివేదిక

కాకినాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ఆలీషా బార్జిల (పెద్ద పడవలు లేదా నౌకలు) తయారీ వ్యాపారవేత్త అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పంపిన నివేదికలో కాకినాడ జిల్లా అధికారులు వివరించారు. ఇటీవల కాకినాడ వచ్చిన పవన్ పోర్టులో బియ్యం తనిఖీల సందర్భంగా 'హూ ఈజ్ ఆలీషా' అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఆయన వివరాలను తెలియజేస్తూ ఉపముఖ్యమంత్రికి నివేదిక పంపారు. 'కాకినాడ పోర్టులో ఆలీషా రెండెకరాలు లీజుకు తీసుకుని నౌకలు నిర్మిస్తున్నారు. ఒకప్పుడు ఆయిల్ స్మగ్లింగ్‌లో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ముంబైలో బార్జిలు/నౌకలు నిర్మిస్తున్నారు. గతంలో ఆయిల్ మాఫియాకు ఆయన గోదాములు ఇచ్చారని.. గత ప్రభుత్వంలో బార్జిల వ్యాపారంలో పైచేయిగా ఉండేలా చక్రం తిప్పారని, పలు రాష్ట్రాలతోపాటు దుబాయ్‌లో ఆస్తులు పోగేశారని రిపోర్టులో ప్రస్తావించారు. కాగా.. ఆలీషాకు బియ్యం వ్యాపారాలు ఉన్నాయన్న అనుమానంతో పవన్ ఆరా తీయగా.. అధికారులు విచారించి ఆయనకు అసలు బియ్యం వ్యాపారమే లేదని తేల్చారు.

బియ్యం స్మగ్లింగ్‌తో తగ్గిన రెవెన్యూ రాబడి

- వెంటనే విజిలెన్స్ కమిషన్ విచారణ చేపట్టాలి
- టీడీపీ సీనియర్ నేత యనమల

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పినట్లు వైసీపీ నేతలు కాకినాడ పోర్టు నుంచి బియ్యం స్మగ్లింగ్ చేయడం వల్ల రాష్ట్రానికి రెవెన్యూ రాబడి తగ్గిపోతుందని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆదాయం తగ్గినప్పుడు రాష్ట్ర విజిలెన్స్ కమిషన్ అందుకు కారణమైన స్మగ్లింగ్‌పై విచారణకు ఆదేశించవచ్చని పేర్కొన్నారు. విచారణ ఆలస్యం చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదముందన్నారు. కాకినాడ పోర్టు నుంచి ఎన్నో ఏళ్ల తరబడి బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని ప్రభుత్వమే పేర్కొంటున్నందున వెంటనే ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వాన్ని అదే కోరుకుంటున్నారని యనమల ఆ ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- చాగంటి సూచనల మేరకు నైతిక విలువలపై పాఠ్యాంశాలు: లోకేశ్

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో హాజరు శాతం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రి లోకేశ్ నిర్ణయించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. 'పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం కల్పించడం ద్వారా డ్రాపౌట్స్‌ని కొంత మేర తగ్గించే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబరు 7న నిర్వహించే మెగా పేరెంట్-టీచర్ సమావేశాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలి. బాపట్ల ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించే మెగా పీటీఎంకు సీఎం చంద్రబాబుతో పాటు నేను కూడా హాజరవుతున్నా. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా స్టార్ రేటింగ్ ఇవ్వాలి. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు పాఠ్యాంశాల కోసం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సలహాలు తీసుకోవాలి. స్కూల్ మైదానాలను జాబ్ మేళాలకు మినహా ఎలాంటి కార్యకలాపాల నిర్వహణకు అనుమతి ఇవ్వరాదు' అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. సమావేశంలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు, ఇంటర్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా పాల్గొన్నారు.

నేర నియంత్రణలో డ్రోన్ల వినియోగం పెరగాలి: సీఎం

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో డ్రోన్ల వినియోగం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా నేర నియంత్రణ, భద్రతా చర్యల్లో డ్రోన్ల వినియోగం పెంచాలి' అని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బెంగళూరుకు చెందిన ప్రైవేట్ సంస్థ రూపొందించిన మల్టీపర్పస్ డ్రోన్లను మంగళవారం రాత్రి అమరావతి సచివాలయంలో సీఎం ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, 'అన్ని ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ల వినియోగం విస్తృతం చేయాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్లతో మందుల సరఫరా చేయాలి. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు, దోమల నియంత్రణకు మందుల పిచికారికి డ్రోన్లను వాడాలి. అడవుల్లో కార్చిచ్చు లాంటి ప్రమాదాలను డ్రోన్లతో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ కార్యదర్శి సురేష్ కుమార్, సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

జగన్ బంధువులకు నోటీసులు

- వివేకా పీఏ కృష్ణారెడ్డి కేసులో పులివెందుల డీఎస్పీ జారీ

పులివెందుల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి పీఏ కృష్ణారెడ్డి ఇచ్చిన ప్రైవేట్ కంప్లయింట్‌కు సంబంధించిన కేసులో మాజీ సీఎం వైఎస్ జగన్ బంధువులకు పులివెందుల డీఎస్పీ నోటీసులు జారీ చేశారు. పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ అభిషేక్ రెడ్డి, ఈసీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, న్యాయవాది ఓబుళరెడ్డితో పాటు మరో ఐదుగురికి డీఎస్పీ మురళీ నాయక్ నోటీసులు ఇచ్చారు. గురువారం ఉదయం పది గంటలకు పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వివేకా హత్య కేసులో ఆయన కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డి, అప్పటి సీబీఐ ఎస్పీ రాంసింగ్‌లపై పులివెందుల కోర్టులో కృష్ణారెడ్డి ప్రైవేటు కంప్లైంట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దానిపై కోర్టు ఆదేశాల మేరకు గతేడాది డిసెంబరు 15న పులివెందుల పోలీసులు కేసు నమోదు చేసి అప్పట్లోనే విచారణ చేపట్టారు. దీనిపై మరింత లోతుగా విచారణ చేయాలని కోర్టు ఆదేశించడంతో మరోసారి కృష్ణారెడ్డిని విచారించి వాంగ్మూలం తీసుకున్నారు. ప్రస్తుతం సీఆర్‌పీసీ 160 కింద పది మందిని విచారించనున్నారు.

వర్రా కేసులో విచారణకు నలుగురు హాజరు

సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రారెడ్డి కేసులో భాగంగా వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సునీతారెడ్డితో పాటు మరో ముగ్గురిని డీఎస్పీ మురళీనాయక్ మంగళవారం విచారించారు. గతంలో ఇచ్చిన 41ఏ నోటీసులకు వివరణ ఇచ్చేందుకు డీఎస్పీ కార్యాలయానికి సునీతారెడ్డి, శరత్ కుమార్‌రెడ్డి, లింగాల రాజశేఖర్ రెడ్డి, వరకుమార్ వచ్చారు. ఈ సందర్భంగా వారిని డీఎస్పీ విచారించారు.

బెదిరించి, భయపెట్టి కొట్టేశారు!

(మొదటి పేజీ తరువాయి)

సీఐడీకి ఫిర్యాదు చేశారు. భయపెట్టి, బెదిరించి మరీ తమ ఆస్తులు కొల్లగొట్టిన వైనాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. పోర్టు, సెజ్ 'అరబిందో'కు అప్పనంగా దక్కిన తీరు గురించి తెలిపారు. "2500 కోట్ల వాటాను 494కోట్లకు లాక్కున్నారు. సెజ్‌లో నా వాటా విలువ 1109కోట్లు! దానిని కేవలం 12కోట్ల రూపాయలకు లాగేసుకున్నారు. నిజాయితీగా వ్యాపారం చేశాం. ప్రభుత్వానికి రూపాయి ఎగ్గొట్టలేదు. అయినా.. తీరని అన్యాయం చేశారు" అని సెజ్, పోర్టు ఏర్పాటు చేసిన 'కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్' యజమాని కేవీ రావు(65) సీఐడీ అదనపు డీజీకి ఫిర్యాదు చేశారు. ఈ అన్యాయం ఏమిటని అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మొరపెట్టుకోగా... వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి చెప్పినట్లు చెయ్యమన్నారని, కనీసం తన మాట వినలేదని తెలిపారు. కేవీ రావు 1999లో రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కాకినాడ పోర్టును అభివృద్ధి చేశారు. జీఎంఆర్‌తో కలిసి కాకినాడ సెజ్‌ను స్థాపించారు. దీని కోసం ఆయన 'కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్'ను ఏర్పాటు చేశారు. తన కంపెనీ ఆదాయంలో 22శాతం ప్రభుత్వానికి చెల్లించేలా అప్పట్లో ఒప్పందం కుదిరింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేదాకా అంతా సాఫీగా సాగింది. ఆ తర్వాతే ఇబ్బందులు మొదలయ్యాయి. దీనిపై ఆయన సీఐడీ అధిపతికి పది పేజీల ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు మంగళగిరి సీఐడీ అధికారులు సోమవారం కేసు నమోదు చేశారు.

ఇదీ కేవీరావు ఫిర్యాదు...

జగన్ సీఎం కాగానే... కాకినాడ సీ పోర్టు లిమిటెడ్‌కు రాష్ట్ర సర్కారుతో ఇక్కట్లు మొదలయ్యాయి. మారిటైమ్ బోర్డు సహకారం కరువైంది. చెన్నైకి చెందిన శ్రీధర్ అండ్ సంతానం కంపెనీతో ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చింది. ముంబైకి చెందిన మరో సంస్థతోనూ ఆడిట్ అంటూ సమాచారం ఇచ్చారు. రెండు సంస్థలకూ మేం సహకరించాం. రికార్డులన్నీ వారి ముందుంచాం. కానీ... మా సంస్థ ప్రభుత్వానికి 994కోట్ల రూపాయలు ఎగ్గొట్టినట్లు ఆడిట్ కంపెనీ వైసీపీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఇదే సమయంలో... మాకు విజయసాయిరెడ్డి ఫోన్ చేశారు. జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డిని కలవాలని సూచించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న విక్రాంత్ ఇంటికెళ్లి కలిసి మాట్లాడగా.. "మీరు ప్రభుత్వానికి వెయ్యి కోట్లు ఎగ్గొట్టారు. మొత్తం కుటుంబం జైలుకు వెళ్లకూడదు అనుకుంటే మీ కంపెనీ షేర్లన్నీ విక్రయించేయండి" అని చెప్పారు. మేము 1999 నుంచి వ్యాపారం చేస్తున్నామని, ఎక్కడా రూపాయి కూడా ప్రభుత్వానికి ఎగ్గొట్టలేదని చెప్పగా... "ఇది నా మాట కాదు. ముఖ్యమంత్రి జగన్ హుకుం. కాదని ధిక్కరిస్తే మీ కుటుంబం మొత్తం కటకటాల్లోకే" అని భయపెట్టారు. దిక్కుతోచని స్థితిలో భయంతో మా కంపెనీ షేర్లు విక్రయించేందుకు అంగీకరించాం. అయితే షేర్ విలువ ఎంతో చెప్పలేదు. మర్చంట్ బ్యాంకర్‌ను ప్రవేశపెట్టి షేర్ విలువ నిర్ధారిస్తామన్నారు. రూ.100 కోట్లు అడ్వాన్సు కింద చెల్లిస్తున్నామని అగ్రిమెంట్‌పై సంతకాలు చేయించుకున్నారు. ఆ తర్వాత మమ్మల్ని పిలిచి, మీ వాటా కింద ఉన్న షేర్లలో 41.14శాతానికి 494కోట్ల రూపాయలు ఖరారు చేశామని, డీల్ సెట్ చేసుకోమని చెప్పారు. ఒక్క ఏడాది(2019-20)లోనే 170కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించిన తమ సంస్థ షేర్లకు ఇంత తక్కువ విలువకట్టడమేమిటని ప్రశ్నించినా వినిపించుకోలేదు. బెజవాడ బెంజ్ సర్కిల్‌లో స్థిరాస్తిని ప్రభుత్వ విలువకన్నా తక్కువకు లాక్కున్నారు.

కాకినాడ సెజ్‌లో ఇలా...

కాకినాడ సెజ్‌ను మేము, జీఎంఆర్ కలిపి 1999 నుంచి అభివృద్ధి చేశాం. అందులో 48.74శాతం మా కుటుంబ వాటా! మిగిలింది జీఎంఆర్ వాటా. మా వాటాలో 8వేల ఎకరాల భూమి, పోర్టులో షేర్ ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం నుంచి ఇబ్బందులు పడలేమంటూ ఆ మొత్తం భూమి, వాటాను రూ.400 కోట్లకు ఇచ్చేలా జీఎంఆర్‌కు ఇచ్చేయాలనుకున్నాం. నిజానికి... ఆ ఆస్తి విలువ రూ.1104 కోట్లు! అయినప్పటికీ... భాగస్వామికే (జీఎంఆర్) వదిలేయాలనుకుని అగ్రిమెంట్ చేసుకున్నాం.. కానీ, జీఎంఆర్‌తో ఒప్పందం రద్దుచేసుకుని అందంతా తమకే కట్టబెట్టాలని అరబిందో యాజమాన్యం బెదిరించింది. లేదంటే... జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించింది. కేవలం రూ.12 కోట్లు ఇచ్చి కాకినాడ సెజ్‌లో ఉన్న మా వాటా 48.74శాతాన్ని దక్కించుకున్నారు.

విక్రాంత్ చెప్పినట్లు వినండి...

వేలకోట్ల ఆస్తులను కొట్టేసిన అనంతరం... వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌కు నన్ను (కేవీ రావు) తీసుకెళ్లారు. 'కేవీ రావు పెద్దమనసుతో వేల కోట్ల వాటాను 12కోట్లకే మనకు ఇచ్చేశారు' అని జగన్‌కు చెప్పారు. 'ఇది చాలా అన్యాయం' అని నేను చెప్పబోతుండగా... 'విక్రాంత్ చెప్పినట్లు చెయ్యండి' అంటూ జగన్ హుకుం జారీ చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మొత్తం షేర్లు బదిలీ చేశాను. అంతకుముందు మేము ప్రభుత్వానికి రూ.994 కోట్లు ఎగ్గొట్టామని నివేదిక ఇచ్చిన శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీ... ఆ తర్వాత పన్ను ఎగవేత తొమ్మిది కోట్లే అని తేల్చింది.

ఇవీ సెక్షన్లు..: ఐపీసీ 506, 384, 420, 109, 467, 120(బి) రెడ్ విత్ 34ఐపీసీ, భారతీయ న్యాయ సంహితలోని ఆర్గనైజ్డ్ క్రైమ్ బీఎన్ఎస్ 111

ప్రోబా-3 ప్రయోగానికి సిద్ధం

- నేడు పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో చేపడుతున్న విదేశీ ఉపగ్రహం ప్రోబా-3 ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ)కి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లో ప్రథమ ప్రయోగ వేదిక నుంచి బుధవారం సాయంత్రం 4:08 గంటలకు ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం 2:38 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ కూడా మొదలైంది. ఈ ప్రయోగం ద్వారా ఈఎస్ఏకి చెందిన 550 కిలోల బరువున్న ప్రోబా-3 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. సూర్యుడిపై పరిశోధనల నిమిత్తం ఈ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపుతున్నారు. ప్రోబా-3లో ఉండే రెండు ఉపగ్రహాలు సూర్యుడి బాహ్య వాతావరణం, సౌర కరోనాపై అధ్యయనం చేస్తాయి. వాతావరణం అనుకూలించి, అన్నీ సజావుగా సాగితే బుధవారం సాయంత్రం 4:08 గంటలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లనుంది.

భూ సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలు, తప్పుడు రిజిస్ట్రేషన్లపై టీడీపీ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. బాపట్ల జిల్లా వెల్లటూరులో తన భూమిని అక్రమించి, తనపైనే దాడికి దిగుతున్నారని పేరయ్య అనే వ్యక్తి వాపోయారు. నంద్యాల జిల్లా సిద్ధాపురంలో తన భూమిని రిటైర్డ్ ఎమ్మార్వో దొంగ సంతకాలతో రాంబాబు అనే వ్యక్తి ఆక్రమించాడని బాధితుడు ఫిర్యాదు చేశారు. కృష్ణా జిల్లా చోడవరంలో తన పుట్టింటి వారిచ్చిన రిజిస్టర్డ్ భూమిని అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారని వేణుకుమారి అనే మహిళ వాపోయారు. తన భూమిని మరొకరికి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కేసరపల్లికి చెందిన లక్ష్మీప్రసాద్ కోరారు. పల్నాడు జిల్లా కనుమలచెరువులో తమ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి, ఇల్లు కట్టుకోకుండా అడ్డుపడుతున్నారని వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.

వక్ఫ్‌బోర్డుపై తప్పుడు ప్రచారం: షరీఫ్

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నియమించిన వక్ఫ్ బోర్డు కమిటీని కూటమి ప్రభుత్వం ఉపసంహరిస్తే.. వక్ఫ్ బోర్డును రద్దు చేసినట్లుగా బ్లూ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు ఎంఏ షరీఫ్ మండిపడ్డారు. ఎన్నికల ముందు గత వైసీపీ ప్రభుత్వం నియమించిన కమిటీని మాత్రమే ఉపసంహరించినట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

'స్వయం ఉపాధి'లో మన మహిళలే టాప్!

- తర్వాతి స్థానాల్లో బిహార్, పశ్చిమ బెంగాల్
- లోక్‌సభకు తెలిపిన కేంద్ర మంత్రి పెమ్మసాని

ఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి సంఘాల్లోని మన రాష్ట్ర మహిళలు సంపాదనలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. దేశంలోని 1 కోటి 15 లక్షల మంది మహిళలు స్వయం ఉపాధి సంఘాల ద్వారా ఏడాదికి రూ.లక్షకు పైగా సంపాదిస్తుండగా, వీరిలో 14 లక్షల 87 వేల 631 మంది మహిళలతో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. బిహార్ మహిళలు (13.47 లక్షలు) రెండో స్థానంలో.. పశ్చిమ బెంగాల్ మహిళలు (11.81 లక్షలు) మూడో స్థానంలో ఉన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మంగళవారం లోక్‌సభలో ఈ విషయాన్ని ప్రకటించారు. దీనివల్ల మహిళల్లో పొదుపు 28 శాతానికి పెరగ్గా, బయట రుణాలు తీసుకునేవారు 20 శాతానికిపైగా తగ్గిపోయారని మంత్రి తెలిపారు. శ్రామికుల సంఖ్య కూడా పెరిగిందని, వీరిలో మహిళల సంఖ్య కూడా ఎక్కువేనని తెలిపారు.

'ముద్ర' నిధులపై వైసీపీ నిర్లక్ష్యం: దగ్గుమళ్ల

న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతిఖ): ముద్ర రుణాలకు సంబంధించిన నిధులను ఏపీకి తీసుకురావడంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, దీంతో రాష్ట్రం వెనుకబాటుకు గురైందని టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చెప్పారు. ఈసారి ముద్ర రుణాల మంజూరులో ఏపీకి ప్రాధాన్యమివ్వాలని మంగళవారం లోక్‌సభలో ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాన్ని(పీఎంఈజీపీ) చిత్తూరు నియోజకవర్గంలో అమలు చేస్తున్నామని, దీనికి కేంద్ర ఆర్థిక శాఖ సహకరించాలని కోరారు. దరఖాస్తుదారులందరికీ బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

గత ఐదేళ్లుగా ప్రతిపాదనలే రాలేదు

- ఏపీలో భూసార పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి గత ఐదేళ్లుగా భూసార ఆరోగ్య పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని, ఉపయోగంలో లేని కేంద్రాలను పునరుద్ధరించడంపైనే గత ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి చెప్పారు. టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని మంగళవారం పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈమేరకు సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థిర భూసార పరీక్ష కేంద్రాలు 47, మొబైల్ కేంద్రాలు 13, మినీ కేంద్రాలు 1,328 కొనసాగుతున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ఈ కేంద్రాల ద్వారా 4,76,519 మట్టి నమూనాలు పరీక్షించినట్లు పేర్కొన్నారు.

లోక్‌సభలో ముందు వరుసలో
మంత్రి రామ్మోహన్‌కు చోటు

● నాడు తండ్రి ఎర్రన్నాయుడికీ దక్కిన గౌరవం



న్యూఢిల్లీ, శ్రీకాకుళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకి లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా ముందు వరుసను కేటాయించారు. పార్లమెంటులోని ఉభయసభల్లో ముందు వరుసలో కేంద్ర కేబినెట్‌లోని ముఖ్యమైన శాఖల మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ తదితరులు ఆసీనులవుతున్న విషయం తెలిసిందే. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామ్యపక్షం అయినందువల్ల రామ్మోహన్‌నాయుడికి ఈ ప్రాధాన్యం ఇచ్చారని పరిశీలకులు భావిస్తున్నారు. గతంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో తెలుగుదేశం కీలక భాగస్వామ్యపక్షం అయినందువల్ల రామ్మోహన్ నాయుడి తండ్రి ఎర్రన్నాయుడికి కూడా ముందు వరుసలో సీటు కేటాయించిన విషయం తెలిసిందే. కేంద్ర కేబినెట్‌లో ముఖ్యమైన శాఖల మంత్రులకు మాత్రమే దక్కే ఈ ఘనత దక్కడంపట్ల రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ 'తెలుగు వారికి, శ్రీకాకుళం ప్రజలకు దక్కిన గౌరవం'గా అభివర్ణించారు.

ఆస్తులు లాక్కోవడం జగన్ ప్రభుత్వం ట్రెండ్

● కాకినాడ, కృష్ణపట్నం పోర్టులను అప్పట్లో గుంజుకున్నారు

● గంగవరం పోర్టును అప్పనంగా అమ్మేశారు

● వాటిపై మౌనంగా ఉండటం కూటమి ప్రభుత్వం ట్రెండ్‌గా మారింది: పీసీసీ చీఫ్ షర్మిల



అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆస్తులు లాక్కోవడం జగన్ సర్కారుకు అలవాటేనని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. జగన్ హయాంలో ఆస్తులు లాక్కోవడం ట్రెండ్ అయితే.. వాటిని చూసీ చూడనట్లుగా వదిలేయడం కూటమి ప్రభుత్వానికి ట్రెండ్‌గా మారిందని మంగళవారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. "అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా గత ప్రభుత్వం ధారాదత్తం చేసిన ఏ ఒక్క ఆస్తిపైనా కనీసం చర్య కూడా లేదు. రాష్ట్రంలో కాకినాడ పోర్టుతో సహా.. కృష్ణపట్నం పోర్టునూ అప్పట్లో గుంజుకున్నారు. ప్రభుత్వాధీనంలోని అత్యధిక లాభాలు గడిస్తున్న గంగవరం పోర్టునూ అప్పనంగా అమ్మేశారు. ఏపీని పోర్టులకు హబ్‌లుగా మార్చే పాలసీలు సరే.. మరి గంగవరం పోర్టు మాటేమిటి. ఏటా దాదాపు రూ. 2,000 కోట్ల లాభాలు గడించే పోర్టును వైసీపీ ప్రభుత్వం 2021లో అదానీకి రాసిచ్చేసింది. నికర ఆర్థిక నిల్వలతో పాటు రూ. 9,000 కోట్లు విలువచేసే 10 శాతం వాటాలను కేవలం రూ. 640 కోట్లకే అమ్మేశారు. బీవోటీ కింద మరో పదిహేనేళ్లలో ప్రభుత్వ పరం అవ్వాల్సిన పోర్టు అది. ఎలాంటి టెండర్లు లేకుండానే అదానీకి జగన్ కట్టబెట్టేశారు. పైగా మిగతా పోర్టుల అభివృద్ధికి ఆ నిధులు ఉపయోగపడతాయని జగన్ బుకాయించారు. ప్రతిపక్షంలో ఉండగా గంగవరం పోర్టుపై కూటమి పక్షాలు చెప్పిన మాటలకు.. చేస్తున్న విధానాలకూ పొంతనే లేదు" అని షర్మిల విమర్శించారు.

సీపేజీ.. జగన్ పాపమే!!

పోలవరం స్పిల్‌వే గేట్లు మూయడంతో కాఫర్ డ్యాం మీదుగా వరద ప్రవాహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టును అనాథను చేశారని తేటతెల్లమైంది. ఆయన నిర్వాకం కారణంగానే కాఫర్ డ్యాంల్లో సీపేజీ ఎగదన్నుతోందని తాజాగా వెలుగులోకి వచ్చింది. 2020, 2021 వరదల కారణంగానే డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని.. కేంద్ర జలసంఘం, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలు భావించాయి. అయితే జగన్ ప్రభుత్వ నిర్వాకం వల్లే నష్టం జరిగిందని నిరుడే వెల్లడైంది. గత ఏడాది డిసెంబరు 5న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నిర్వహించిన సమీక్షలో ఇది బయటపడింది. డ్యాం గేట్ల నిర్వహణలో మార్గదర్శకాలు పాటించకుండా.. వరదలు వచ్చినప్పుడు స్పిల్‌వే గేట్లను మూసివేశారని.. దీంతో వరద జలాలు ప్రధాన డ్యాం వైపు వెళ్లి.. కాఫర్ డ్యాంల పైనుంచి ప్రవహించాయని.. దీనివల్ల ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య భారీగా నిల్వ చేరి.. సీపేజీ ఏర్పడిందని కేంద్ర జలసంఘం, ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సహా కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు ఆ సందర్భంగా చెప్పారు. డయాఫ్రం వాల్‌కు కూడా అంతర్గతంగా నష్టం జరిగిందని.. గైడ్‌బంగ్ కుంగిపోయిందని.. వీటన్నిటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఆ సమయంలో ఎన్నికల వాతావరణం నెలకొనడంతో ఇది బయటకు పొక్కలేదని నిపుణులు అంటున్నారు. ఇప్పుడైనా లోతుగా విచారణ జరిపితే అసలు నిజాలు వెలుగు చూస్తాయని చెబుతున్నారు. లోపాలు, నష్టాలకు బాధ్యులను గుర్తించకపోవడంతో మరిన్ని అరిష్టాలు జరిగాయని.. డయాఫ్రం వాల్ దెబ్బతినడమే గాక.. కాఫర్ డ్యాంలలో సీపేజీ, గైడ్‌బండ్ కుంగిపోవడం వంటి వాటిని ప్రస్తావిస్తున్నారు.

'బాధ్యత'పై ఒప్పందమేదీ?

2019 మే నెలాఖరులో ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన వెంటనే జగన్ పోలవరం పనులను ఆపేశారు. అప్పటివరకు శరవేగంగా పనులు చేస్తున్న నవయుగ సంస్థపై వ్యక్తిగత కక్షతో దాని కాంట్రాక్టును రద్దుచేశారు. రివర్స్ టెండరింగ్‌లో రూ.1,771 కోట్ల పనులను రూ.1,556 కోట్లకు మేఘా ఇంజనీరింగ్‌కు అప్పగించారు. ఆ వెంటనే.. స్పిల్‌వే, స్పిల్ చానల్, రేడియల్ గేట్లు, డయాఫ్రం వాల్ వంటి పనులు పూర్తయినందున.. వాటి బాధ్యతపై మేఘాతో ఒప్పందం చేసుకోవలసిన జల వనరుల శాఖ.. ఆ దిశగా అడుగులు వేయలేదు. ఫలితంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా.. గైడ్‌బండ్ కుంగిపోయినా.. ఆ నష్టానికి కాంట్రాక్టు సంస్థ బాధ్యత వహించేలా చేయలేకపోయింది. దీంతో ఇప్పుడు కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం అదనంగా రూ.998 కోట్లను కేంద్రమే భరించాల్సి వస్తోంది. అదేవిధంగా గైడ్‌బండ్ కుంగిపోవడంపైనా కాంట్రాక్టు సంస్థను గానీ, అధికారులను గానీ బాధ్యులను చేయకుండా వదిలేశారు. గడచిన ఐదేళ్లలో పోలవరం పనుల్లో ఎంత లేదన్నా రూ.4,500 కోట్ల దాకా నష్టం వాటిల్లింది. ఇందుకు ఎవరినీ బాధ్యులను చేయకుండా వదిలేయడంపై నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈసీఆర్ఎఫ్ డ్యాం పరిస్థితేంటో!

ప్రాజెక్టు స్టాండర్డ్స్ ప్రకారం చూస్తే.. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణం 2028 డిసెంబరుకు మాత్రమే పూర్తవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ డ్యాం చాలా ముఖ్యమైన కట్టడమైనందున.. తగు జాగ్రత్తలు తీసుకోకపోతే దిగువన ఉన్న ఊళ్లు మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాఫర్ డ్యాంలలో సీపేజీ, గైడ్‌బండ్‌లు కుంగిపోవడంపై సమగ్ర విచారణ జరపాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అప్పుడే ఈసీఆర్ఎఫ్ డ్యాం విషయంలో కాంట్రాక్టు సంస్థ, అధికారులు అప్రమత్తంగా ఉంటారని అంటున్నారు.

నాడు నిరంతర పర్యవేక్షణ

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టులో కీలక కట్టడాల డిజైన్లు, ఆమోదం, పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండేది. సెంట్రల్ సాయిల్-మెటీరియల్స్ రీసెర్చ్ సెంటర్ (సీఎస్ఎంఆర్ఎస్), రివైజ్డ్ కాస్ట్ కమిటీ (ఆర్‌సీసీ), సుప్రీంకోర్టు కేసుల వంటి బాధ్యతలు చూసేందుకు ప్రత్యేకంగా ఇంజనీరింగ్ సిబ్బంది ఉండేవారు. ప్రత్యేక పర్యవేక్షణకు అధికారుల బృందాలు ఉండేవి. కానీ 2019-24 నడుమ వీటిని పట్టించుకునేవారే కరువయ్యారు. తాజాగా సమాంతర డయాఫ్రం వాల్ నిర్మాణానికి కేంద్రం ఆమోద ముద్ర వేసినా.. ఇప్పటిదాకా వాల్ మిక్స్ డిజైన్, స్ట్రక్చరల్ డిజైన్స్ పూర్తి కాలేదు. డిజైన్లే కొలిక్కి రానప్పుడు పనులు ఎప్పుడు మొదలవుతాయని నిపుణులు నిలదీస్తున్నారు. పనులు సత్వరమే పూర్తి చేసేందుకు అందుబాటులో ఉన్న యంత్రాలను పెంచుతారో లేదో స్పష్టత ఇవ్వకపోవడంపై వారిలో అసహనం వ్యక్తమవుతోంది. అన్నిటినీ మించి.. చేసిన పనులపై థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఎవరు చేస్తారో కూడా చెప్పడం లేదు. నాణ్యతా లోపాలకు ఎవరిని బాధ్యులను చేస్తారో కూడా తేల్చడం లేదు. క్వాలిటీ కంట్రోల్ సరిగా లేనందునే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని.. పోలవరంలోనూ ఇదే జరిగితే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇంజనీర్ల పూర్వానుభవాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ కూడా ఆక్షేపించిందని.. దీనిని కూడా ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవడం లేదని అంటున్నారు. పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులను నియమించకపోవడాన్ని తప్పుబడుతున్నారు.

పచ్చని చెట్లకు పూసిన.. సీతాకోకమ్మలు!







సప్తవర్ణ శోభితం... సీతాకోకచిలుకల విహారం. పచ్చని చెట్లకు రంగులద్దినట్లున్న సీతాకోక చిలుకలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. కమలాపురం నియోజక వర్గంలోని చెన్నూరు వద్ద పెన్నా నది సమీపంలో ఈ రంగు రంగుల సీతాకోక చిలుకలు కనువిందు చేస్తున్నాయి.

ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) అండ్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్(జీసీసీ) పాలసీ 4.0కి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి సంబంధించిన 20 ఇంజనీరింగ్ పనులను రూ.11,467.27 కోట్లతో చేపట్టడానికి పచ్చజెండా ఊపింది. అదేవిధంగా పలు పాలసీలకు ఆమోద ముద్ర వేసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం సచివాలయంలో మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను మంత్రులు కొలుసు పార్థసారథి, నారాయణలు మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు అవసరమైన కొన్ని ముఖ్యమైన పాలసీలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. -అమరావతి-ఆంధ్రజ్యోతి

మారిటైం హబ్‌గా ఏపీ



కేబినెట్ ఆమోదించిన పాలసీలు

1 ఏపీ ఐటీ, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) పాలసీ: అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు నేడు ప్రపంచ వ్యాపార రంగంలో కీలకంగా మారాయి. సాంకేతిక వ్యాపార పరిభాషలో వీటిని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు(జీసీసీ)గా పేర్కొంటారు. రిమోట్ వర్క్, హైబ్రీడ్ వర్క్, కో వర్కింగ్ స్పేస్‌ల వంటి అత్యాధునిక సర్వీస్ డెలివరీ మోడళ్లను ఉపయోగించుకోవడం ఈ పాలసీ లక్ష్యం. నూతన ఆవిష్కరణలు, గిగ్ ఎకానమీ, వ్యవస్థాపకత, స్థిరమైన ఆర్థిక అభివృద్ధికి పెద్ద ఎత్తున సాంకేతిక ఆధారిత విద్యార్థులను, ప్రతిభావంతులైన వర్క్ ఫోర్స్‌ను ఉపయోగించుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. తిరుపతి, వైజాగ్, విజయవాడ, అమరావతి తదితర కేంద్రాల్లో వర్క్ స్పేస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. వీటికి అనుబంధంగా గ్రామాల్లో, మండలాల్లో కో-వర్కింగ్ స్పేస్ సెంటర్లు పని చేస్తాయి. కనీసం 100 సీట్ల నుంచి 10 వేల చదరపు అడుగులతో కో-వర్కింగ్ స్పేస్ సెంటర్లు అభివృద్ధి పర్చే వారికి పెట్టుబడిలో 50% రాయితీ ఇవ్వనుంది. గరిష్ఠంగా రూ.2 వేలను ఒక చదరపు అడుగుకు రాయితీగా ఇవ్వనుంది. వంద మందికి వర్కింగ్ స్పేస్ ఏర్పాటు చేస్తే రూ.2 లక్షలను ఆరు మాసాలకు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు. 5 లక్షల చదరపు అడుగుల ఫ్లోర్ ఏరియా పైబడిన ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేసే వారికి పెట్టుబడిలో 50% రాయితీ, ఐదు సంవత్సరాల్లో ప్రతి స్క్వేర్ ఫీట్‌కు రూ.2000 వేలు ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రాడ్యుయేట్‌ను గ్లోబల్ మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు, వారు అత్యధిక జీత భత్యాలు పొందేందుకు ఈ పాలసీ దోహదపడుతుంది.

2 ఏపీ టెక్స్ టైల్, అపెరల్, గార్మెంట్ పాలసీ4.0: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉద్యోగాలు కల్పించే రంగం. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో రూ.10వేల కోట్ల పెట్టుబడులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2లక్షల మందికి ఉపాధి లక్ష్యంగా దీనిని రూపొందించారు. 2024-29 మధ్య రాష్ట్రం నుంచి వస్త్ర ఎగుమతుల్ని 1 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పద్మశాలీలు, చేనేత కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఈ పాలసీ దోహదపడుతుంది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో(పీపీపీ) 5 కొత్త సమగ్ర టెక్స్‌టైల్ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. టెక్స్‌టైల్ రంగంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఈ పార్కులను మూడు కేటగిరీలుగా విభజించి ఎంఎస్ఎంఈలకు 30%, మధ్య తరహా పార్కులకు 20%, భారీ పార్కులకు 25% పెట్టుబడి రాయితీ అందిస్తారు.

3 మారిటైమ్ పాలసీ 4.0: 975 కిలోమీటర్ల పొడవైన తీర ప్రాంతాన్ని ప్రభావితం చేస్తూ ప్రపంచ స్థాయి సముద్ర తీర రాష్ట్రంగా అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించారు. ఈ విషయంలో గుజరాత్ ప్రథమ స్థానంలో, ఏపీ 2వ స్థానంలో ఉంది. పోర్టుల అభివృద్ధితోపాటు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన మారిటైం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. షిప్ నిర్మాణ పరిశ్రమను కూడా అభివృద్ధి చేస్తారు. రాష్ట్రంలో ఒక మెగా షిప్ యార్డును ఏర్పాటు చేయనున్నారు. పోర్టుల్లో సరకు నిల్వ, నౌకల నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవడంతోపాటు రోడ్డు, రైలు కారిడార్లను అనుసంధానిస్తారు.

4 గ్రామీణ నీటి సరఫరా ప్రాజెక్టులు: గ్రామీణ నీటి సరఫరాకు చెందిన 24 నెలల కాంట్రాక్టు పీరియడ్ ఉన్న కొన్ని తాగునీటి సరఫరా ప్రాజెక్టు వ్యయాల పెంపునకు జారీ చేసిన జీవో 62కు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, కడప జిల్లా పులివెందుల, కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గాల్లో 3 నీటి సరఫరా ప్రాజెక్టుల వ్యయాలను పెంచనున్నారు. ఈ ప్రాజెక్టులను కొనసాగించడం ద్వారా నీటి సమస్యను పరిష్కరిస్తారు. వీటి ద్వారా 10.37 లక్షల మంది ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుంది.

5 పీఎం ఆవాస్ యోజన గ్రామీణం: ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్(పీఎం-జన్‌మన్) పథకాలను ప్రస్తుత యూనిట్ విలువ, పద్ధతితో కొనసాగించడానికి, పెండింగ్‌లో ఉన్న గృహాలను పూర్తి చేయనున్నారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించే లక్ష్యంతో పని చేయనున్నారు. పీఎంఏవై అర్బన్ 1.0 పథకం కొనసాగింపు, ప్రస్తుత యూనిట్ ధరతో ఇళ్లను పూర్తి చేయడం, డ్రోన్‌లను ఉపయోగించి పెద్ద లేఅవుట్లలో నాణ్యత పరీక్షలు, డిస్కమ్‌లు, పంచాయతీరాజ్, ఎంఏయూడీ విభాగాల సమన్వయంతో హౌసింగ్ కాలనీల్లో మౌలికవసతుల కల్పన చేపడతారు.

6 ఇళ్ల నిర్మాణం: ఈ నెలాఖరు నాటికి ఆయా పథకాల కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలనే నిబంధన ఉన్నప్పటికీ 2026, మార్చి వరకు గడువు ఇచ్చారు. అర్బన్‌లో 6.41 లక్షలు, గ్రామాల్లో 1.09 లక్షల ఇళ్ల పూర్తి చేయనున్నారు.

7 ఏపీ టూరిజం కల్చర్ పాలసీ: 2024-29 సమగ్ర పర్యాటక విధానానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఏపీ క్రీడల పాలసీ 2024-29 సవరణలకు కూడా పచ్చజెండా ఊపింది. పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేలా భారీ పెట్టుబడులు రాబట్టనున్నారు. కేంద్ర పథకాల అమలుకు తోడు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో పెట్టుబడులను ప్రోత్సహించనున్నారు. పర్యాటకులను ఆకర్షించేలా టెంపుల్, ఎకో, అడ్వెంచర్, వెల్‌నెస్, అగ్రి టూరిజంలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌లు ఏర్పాటు చేస్తారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వడం ద్వారా కొత్త ఉద్యోగాల కల్పనకు వీలవుతుంది.

8 ఆంధ్రప్రదేశ్ క్రీడల పాలసీ: 2024-29 ఏపీ క్రీడల పాలసీకి మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

9 మెడికల్ పాలసీ: ఏపీ ఆయుర్వేద, హోమియోపతి మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 1956, మార్గదర్శకాలతోపాటు నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ యాక్ట్ 2020కి అనుగుణంగా బోర్డును పునర్నిర్మించడానికి కేబినెట్ ఆమోదం. ప్రస్తుతం ఉన్న ఆంధ్రా బోర్డు ఆఫ్ ఆయుర్వేదాన్ని ఇకపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్‌గా పిలుస్తారు. అదేవిధంగా ఆంధ్రా బోర్డు ఫర్ హోమియోపతిని ఏపీ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ హోమియోపతిగా పేర్కొంటారు.

10 ఏపీ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ: అమరావతిని ఎలక్ట్రిక్ మొబిలిటీ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీకి ఆమోదం తెలిపింది. ఈ పాలసీ ద్వారా రూ.30 వేల కోట్ల పెట్టుబడులు, దాదాపు 60 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై రాయితీలు ప్రకటించారు.

రియల్‌టైమ్ గవర్నెన్స్: రియల్‌టైమ్ గవర్నెన్స్ 4.0 అమలుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పౌర సేవలను సులభతరం చేయడం, పాలనలో వేగం పెంచడమే లక్ష్యంతో దీనిని ప్రతిపాదించారు. వాట్సాప్ ద్వారా ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు. డాటా ఇంటిగ్రేషన్, అనలటిక్స్ గవర్నెన్స్ హబ్‌గా తీర్చిదిద్దుతారు.

రాజధాని నిర్మాణాలు: అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రతిపాదించిన 20 ఇంజనీరింగ్ పనులను రూ.11,467.27 కోట్లతో చేపట్టనున్నారు.

డిసెంబరు 15న ఆత్మార్పణ దినం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఏటా డిసెంబరు 15న ఆత్మార్పణ దినంగా పాటిస్తారు. ఈ కార్యక్రమ నిర్వహణకు మార్గదర్శకాలు రూపొందిస్తారు. పొట్టి శ్రీరాములు జన్మ స్థలంలోని ఇంటిని మ్యూజియంగా తీర్చిదిద్దుతారు.

జలజీవన్ మిషన్: రూ.51 వేల కోట్ల ప్రాజెక్టు అయిన జల్‌జీవన్ మిషన్‌ను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఈ మిషన్‌పై కేంద్రంతో చర్చించి అమలయ్యేలా చూడనున్నారు.


అమరావతికి వందల కోట్ల నష్టం

జగన్ మూడు ముక్కలాటే కారణం

మళ్లీ టెండర్లతో భారీగా వ్యయం

అయినా మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి

మంత్రి నారాయణ వెల్లడి



అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అభివృద్ధికి సంబంధించిన అనేక పనులు 2014-19 మధ్య చేపట్టామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గత జగన్ ప్రభుత్వం మూడు ముక్కలాట కారణంగా పనులు నిలిచిపోవడంతో రూ.వందల కోట్ల నష్టం వచ్చిందన్నారు. పనులు ఆగిపోయినా ఏజెంట్లను అలాగే ఉంచారని, వారి మిషనరీ ఇక్కడే ఉండిపోయిందన్నారు. అప్పట్లో ఇచ్చిన టెండర్ల ధరలకు ఇప్పుడు చేయలేమని కాంట్రాక్టర్లు అంటున్నారని, దీంతో టెండర్ల ధరలను పెంచాల్సి వచ్చిందని తెలిపారు. సుమారు రూ.286.78 కోట్ల మేరకు నష్టం జరిగిందన్నారు. ప్రస్తుతం రూ.11,467 కోట్ల పనులకు కొత్త టెండర్లు పిలిచేలా కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. రాజధానిలో ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో పనులు చేయకపోగా ఉన్న రోడ్ల తవ్వి ఏసీలు, డోర్‌లను తీసుకెళ్లిపోయారని, ఇప్పుడు టెండర్లు పిలవడంతో జీఎస్టీ 452.35 కోట్లకు పెరిగిందన్నారు. పరిపాలనా భవనాలు, అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు ఈ నెలాఖరులోగా టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. అప్పట్లో రూ.41 వేల కోట్ల బడ్జెట్ అనుకుంటే ఇప్పుడు 30 శాతం పెరిగిందన్నారు. ఇప్పుడు చేపడుతున్న పనులు మూడేళ్లలో పూర్తిచేయనున్నట్టు మంత్రి చెప్పారు.



మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మంత్రులు

అంతులేని దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావనకు వచ్చినప్పుడు జగన్ హయాంలో కాకినాడ కేంద్రంగా జరిగిన దందాలకు అంతేలేదని, చరిత్రలో ఏనాడూ ఎవరూ చేయని విధంగా దారుణంగా దోచుకున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. 'కాకినాడ డీప్ వాటర్ పోర్టు ప్రైవేటు యాజమాన్యంలో ఉంది. జగన్ ముఖ్యమంత్రి కాగానే ఆ పోర్టు యాజమాన్యంపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి బెదిరించి అందులో 59శాతం వాటాను తమకు చెందిన అరబిందో సంస్థకు రాయించారు. కేవలం పదిశాతం విలువ చెల్లించి ఏకంగా 60శాతం వాటా రాయించుకొన్నారు. కాకినాడ సెజ్‌లో కూడా అదే జరిగింది. ఆ సెజ్ కూడా ప్రైవేటు యాజమాన్యంలో ఉంది. దాని కింద 7వేల ఎకరాల భూమి ఉంది. దాని యాజమాన్యాన్ని కూడా బెదిరించి లొంగదీసుకొని అత్యధిక శాతం వాటా అరబిందో కంపెనీ పేరుతో రాయించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇంత దారుణంగా వాటాలు రాయించుకోవడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేదు. అందుకే ఈ కబ్జాలపై దర్యాప్తునకు సీఐడీని వేయాలని నిర్ణయం తీసుకొన్నాం' అని ఆయన వివరించారు. సెజ్‌లో జగన్ టీమ్ రాయించుకొన్న భూముల విలువ రూ.3వేల కోట్లు ఉండవచ్చని సీఎం చెప్పినప్పుడు దానిని కొందరు మంత్రులు సవరించారు. ఆ భూముల విలువ రూ.ఐదు నుంచి ఆరు వేల కోట్లు ఉంటుందని చెప్పారు. కాకినాడ పోర్టు వద్ద నెలకొన్న వాతావరణం గురించి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వివరించారు. 'విదేశాల్లో పోర్టుల వద్దకు సామాన్య ప్రజలను కూడా అనుమతిస్తారు. ఒక స్థాయి వరకూ ఎవరైనా వచ్చి సందర్శించడానికి అనుమతి ఉంటుంది. కానీ కాకినాడ పోర్టు దరిదాపుల్లోకి కూడా ఎవరినీ రానివ్వరు. దానిని ఒక ప్రైవేటు సామ్రాజ్యం మాదిరిగా తయారు చేశారు. అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నందువల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు అనిపిస్తోంది' అన్నారు. మద్యం, ఇసుకకు సంబంధించి చాలావరకూ సమస్యలను పరిష్కరించామని, రేషన్ బియ్యం మాఫియా, లాండ్ మాఫియాల పని పట్టాల్సి ఉందని సీఎం వ్యాఖ్యానించారు. ఈ రెండు అంశాలను పీడీ చట్టం పరిధిలోకి తెచ్చామని, కొద్దిరోజుల్లోనే ఫలితం చూపిస్తామన్నారు. వైసీపీ హయాంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేసిన వాళ్లే ఇప్పుడు మళ్లీ అరుస్తున్నారని, వ్యవస్థలను నాశనం చేశామన్న బాధ వారిలో ఏ కోశానా లేదని ఒక సీనియర్ మంత్రి విమర్శించారు.

అధికారికంగా ఆత్మార్పణ దినం

తెలుగువారికి ఒక రాష్ట్రం కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు వదిలిన పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన డిసెంబర్ 15న ఆత్మార్పణ దినం అధికారికంగా నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. తెలుగువారికి ముఖ్యమైన రోజైనందున దానికి ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈలోపు అన్ని పాఠశాలల్లో దీనిపై కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

అధికారుల్లో బద్ధకం వదలలేదు...

కొందరు అధికారుల్లో ఇంకా బద్ధకం వదలలేదని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. జల్ జీవన్ పథకం ప్రస్తావన వచ్చినప్పుడు ఆయన అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కొన్ని రాష్ట్రాలు రూ. వెయ్యి నుంచి రూ. పదిహేను వందల కోట్ల వరకూ ఈ పథకం కింద నిధులు కేంద్రం నుంచి తీసుకొన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పైసా కూడా తీసుకోలేకపోయారు. వచ్చే ఏడాదితో ఈ పథకం గడువు ముగిసిపోతోంది. అధికారుల వెంట నేను ఎంత పడుతున్నా ఈ నిధులకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి ఢిల్లీకి పంపలేకపోతున్నారు. నేను ఢిల్లీ వెళ్లి నిధుల కోసం అడిగితే రాష్ట్రం నుంచి ప్రతిపాదనలే రాకుండా నిధులు ఎలా ఇస్తామని ప్రశ్నిస్తున్నారు. నేను ఎన్నిసార్లు చెప్పినా కొందరు అధికారుల్లో చలనం రావడం లేదు' అని అన్నారు. తాను ఢిల్లీ వెళ్లినప్పుడు ఇదే సమస్య ఎదురైందని పవన్ చెప్పారు. 'నేను ఇటీవల ఒక గ్రామం వెళ్లినప్పుడు ఆ గ్రామంలో మంచినీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. రూ.4లక్షలు ఇస్తే పని పూర్తయ్యి ఆ గ్రామం మొత్తానికి మంచినీరు అందుతుంది. అధికారులు ప్రతిపాదన పంపకపోవడంతో నిధులు విడుదల కాలేదు. కొందరు అధికారులు ప్రాధాన్యాలు గుర్తించడం లేదు' అని పవన్ అన్నారు. కాగా, ఈ నెల 12 నాటికి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నందువల్ల అన్ని శాఖల్లో మంత్రులు... అధికారులతో సమీక్షలు నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. దీనివల్ల వ్యక్తిగతంగా మంత్రుల ఇమేజీ తోపాటు ప్రభుత్వ ప్రతిష్ఠ కూడా పెరుగుతుందని అన్నారు.

రూ. రెండు వేల కోట్ల నష్టం

అమరావతి రాజధానిలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను జగన్ ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపివేసిందని, ఈ ఐదేళ్ల జాప్యం వల్ల పనుల అంచనాలు పెరిగి రూ.రెండువేల కోట్ల ప్రజాధనం అదనంగా చెల్లించాల్సి వస్తోందని చంద్రబాబు తెలిపారు. సరాసరిన పనుల అంచనాల్లో 30 శాతం పెరుగుదల వస్తోందని, ఇదంతా నష్టమేనన్నారు. గుజరాత్‌లో పోర్టులు అభివృద్ధి అయ్యాయని, మనం కూడా అదే స్థాయిలో తీర్చిదిద్దుకునే అవకాశం ఉందని చెప్పారు. నౌకల నిర్మాణకేంద్రం, రిపేర్ల కేంద్రం, పాత నౌకలను ముక్కలుగా విరగ్గొట్టే పరిశ్రమలు రావడానికి అవకాశం ఉందని, భారీ నౌకలు రావడానికి వీలుగా మదర్ పోర్టుగా ఒకదానిని అభివృద్ధి చేయాల్సి ఉందని వివరించారు. రోడ్ల మరమ్మతులు జనవరినాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనికి ఇంకా నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పునరుత్పాదక విద్యుత్తుతో తయారైన వస్తువులు కొనడానికి యూరప్‌లో ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా తయారీదారులను ప్రోత్సహించాలని సూచించారు.

గ్లోబల్ టాలెంట్ హబ్‌గా రాష్ట్రం

» యువతకు ఉద్యోగాల కల్పనకే అత్యధిక ప్రాధాన్యం

» 2024-29 ఐటీ పాలసీని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) రంగంలో రాష్ట్రాన్ని గ్లోబల్ టాలెంట్ హబ్‌గా నిలబెట్టే లక్ష్యంతో ఐటీ పాలసీ 2024-29ను ప్రభుత్వం రూపొందించింది. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు రానున్న ఐదేళ్లలో మైక్రోసాఫ్ట్ వంటి బహుళజాతి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఈ విధానానికి రూపకల్పన చేసింది. భారీ ఆర్థిక ప్రోత్సాహకాలతో పాటు నైబర్‌హుడ్, కోవర్కింగ్ స్పేస్‌ను అందించేలా శిక్షణ కార్యక్రమాలు, నిరంతర సాంకేతిక నైపుణ్యాభివృద్ధిని ఐటీ శాఖ కొనసాగించనుంది. ఇన్నోవేషన్ వ్యాలీ దిశగా అడుగులు వేస్తూ, ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామికవేత్త ఉండేలా ఈ పాలసీని అమలు చేయాలని నిర్ణయించారు. నూతన ఐటీ పాలసీ ప్రకారం... నాలెడ్జ్ ఎకానమీలో రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు ఇక్కడి యువతలోని నైపుణ్యం ప్రపంచ స్థాయికి చేరేలా చర్యలు తీసుకుంటారు. డీప్ టెక్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. స్టార్టప్‌లు, సాంకేతిక రంగంలో కొత్త తరహా ఆలోచనలతో ముందుకొచ్చే సంస్థలను ప్రోత్సహిస్తారు. ఐటీ రంగంలోనూ యువత ఉద్యోగ కల్పనకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ఐటీ కార్యాలయాలు లీజులకు ఇస్తారు. టైర్-1 నగరాల్లో ఐటీ రంగంలో పనిచేసే ఉద్యోగుల ఎంపికకు వీలుగా ప్రత్యేక క్యాంపస్‌లను ప్రకటిస్తారు. వార్షిక టర్నోవర్ రూ.100 కోట్లు ఉండే కంపెనీలకు 2,000 సీట్లు, టర్నోవర్ రూ.100 కోట్లు పైబడిన సంస్థలకు 5,000 సీట్లు కలిగిన కార్యాలయాలు కేటాయిస్తారు. ఐటీ కంపెనీల డెవలపర్లకు 5లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన కార్యాలయం అందిస్తారు. కేపిటల్ సబ్సిడీగా 50శాతం పెట్టుబడి రాయితీ ఇస్తారు. పరిశ్రమలకు ఇచ్చే విద్యుత్తు టారిఫ్‌ను ఐటీ కంపెనీలకూ అమలు చేస్తారు. ఫాస్ట్ ట్రాక్ అనుమతులతో పాటు ఎర్లీ బర్డ్ పథకం కింద ప్రభుత్వ కార్యాలయాల్లో ఐదేళ్ల పాటు అద్దె మినహాయింపు ఉంటుంది. వార్షిక టర్నోవర్ రూ.30 కోట్లు లేదా కనీసం 50 మంది ఉద్యోగులు ఉండే సంస్థలన్నింటికీ రాష్ట్ర ఐటీ శాఖ ప్రోత్సాహకాలను అందిస్తుంది. భూములు కూడా కేటాయిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జెండర్ ఉద్యోగుల వాటా ఈపీఎఫ్‌ను వంద శాతం ఐటీ శాఖే భరిస్తుంది. ఇంటి అద్దె, పిల్లల విద్య కోసం ఉద్యోగులకు మూడేళ్ల పాటు రూ.లక్ష అందిస్తారు.



ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య పెరగాలి

» సమీక్షలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదేశం

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "ప్రయాణికుల సంతృప్తే మనకు ముఖ్యం. వారి నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ వస్తోంది? పరిష్కరించాల్సిన సిబ్బంది సమస్యలు ఏమున్నాయి? ఆదాయం పెంచుకోవడానికి టిక్కెట్టేతర మార్గాలేంటి? కొత్త బస్సులు రావడానికి ఇంకా ఎంత సమయం పడుతుంది?" అంటూ రవాణా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆర్టీసీ అధికారులపైప్రశ్నల వర్షం కురిపించారు. "ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించడం ద్వారా ఆక్యుపెన్సీ రేషియో పెంచాలి. వీలైనంత త్వరగా కొత్త బస్సులను సమకూర్చుకోవాలి.. ఆదాయం పెంచుకోవడానికి ప్రయాణ చార్జీలు కాకుండా బీవోటీపై దృష్టి సారించాలి. విలీన సమస్యలపై ఇప్పటికీ అసోసియేషన్ల ప్రతినిధులు వినతులు ఇస్తున్నారు.. వాటిలో మీ పరిధిలో ఉన్నవి పరిష్కరించండి.. ప్రభుత్వ పరిధిలో ఉన్న వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తా' అని మంగళవారంనాటి సమీక్షలో పేర్కొన్నారు.

రోజంతా తాగునీరు

» డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా సాగునీరు

» పారిశ్రామికావసరాలూ తీర్చాలి

» వరద నీటిని సంరక్షించుకోవాలి

» నీటి కుంటలు, చెరువులను నింపాలి

» 2024-29 జలవిధానానికి సీఎం ఆమోదం



జలవనరుల శాఖ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోనూ .. పల్లెల్లోనూ రోజంతా పరిశుభ్రమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. జలవనరుల యాజమాన్య నిర్వహణలో సామర్థ్యం పెంచుకుంటూ నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖపై ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జలవిధానాని(2024–29)కి ఆమోద ముద్ర వేశారు. వరద నీటిని సంరక్షించుకుంటూ.. ప్రవాహాలు సముద్రంవైపు వెళ్లకుండా ఒడిసి పట్టడం జలవిధానంలో కీలకాంశం. ఎక్కడికక్కడ నీటి కుంటలను.. చెరువులను నింపుతూ వరద జలాలను ఒడిసిపట్టాలని.. జల యాజమాన్య నిర్వహణలో మహిళలను అత్యంత ప్రధానమైన భాగస్వాములను చేయాలని అందులో పేర్కొన్నారు. సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ సీఎస్ జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జలవిధానంలోని ఇంకొన్ని ముఖ్యాంశాలివీ..

- వ్యవసాయానికి డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా నీరు.
- సమగ్ర, సమ్మిళిత నీటి యాజమాన్య విధానం అమలు.
- రాష్ట్ర ఆర్థిక బలోపేతానికి వీలుగా వ్యవసాయ భూ వినియోగం పెరిగేలా చర్యలు.
- పంచాయతీ స్థాయిలో జల భద్రతా ప్రణాళికల అమలు.
- వాతావరణ మార్పులను నిరంతరం గమనిస్తూ.. అందుకనుగుణంగా నీటి ప్రణాళికల అమలు.
- భూగర్భజలాల దుర్వినియోగం నియంత్రణకు సమర్థ, న్యాయపరమైన విధానాల అమలు.
- గృహ, పారిశ్రామిక, తాగు, సాగు, మత్స్య సంపద వృద్ధి, ఎకలాజికల్ టూరిజం, జలవిద్యుదుత్పత్తికి నీరు అందుబాటులో ఉండేలా కార్యాచరణ. సాగునీటి కాలువలు, చెరువుల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు. వాటిలో పెరిగిపోయిన ముళ్ల పొదలు, చెట్లు యుద్ధ ప్రాతిపదికన తొలగించి జల ప్రవాహాలకు అడ్డు తొలగింపు.. తద్వారా వరదల సమయంలో ముంపువల్ల ఆస్తి, ప్రాణ నష్టాల నివారణ.
- గతంలో వర్షపు నీటిని ఒడిసి పట్టేలా చేపట్టిన నీటి కుంటల నిర్మాణాలు తిరిగి చేపట్టాలి.. భూగర్భజలాల మట్టాలు పెంచాలి.
- గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా అన్ని ప్రాంతాలకూ కాలువల ద్వారా సాగు, తాగునీరు. దీనివల్ల రాష్ట్రంలో ప్రాంతాల వారీ జల వివక్షను నివారించేందుకు అవకాశం.
- నదుల అనుసంధాన ప్రక్రియలో సామాజిక భాగస్వామ్యం. దీంతో లబ్ధిదారుల్లో నీటి వినియోగంపై అవగాహన.
- కరువును అధిగమించేలా నీటి యాజమాన్య చర్యలు.
- సాగునీటి ప్రాజెక్టులన్నిటినీ సకాలంలో పూర్తి చేస్తే రాష్ట్రంలో నీటి భద్రతకు అవకాశం. ప్రాంతాల వారీగా నీటి యాజమాన్య విధానాలు సమష్టిగా అమలు.
- రాష్ట్రంలోని సాగునీటి వనరులు, ప్రాజెక్టులు, నదులు, వాగులు, సాగునీటి కాలువలను అనుసంధానం చేస్తూ మ్యాపింగ్.
- సాగునీటి విషయంలో రైతుల మధ్య నెలకొనే వివాదాలను పరిష్కరించేలా యాజమాన్య విధానాల అమలు.
- రాష్ట్రంలో నీరు ఎంత అందుబాటులో ఉందో సమగ్ర సమాచారం తెలిసేలా యాప్‌ను రూపొందించాలి.

2027నాటికి పోలవరం పూర్తి

» సీఎం స్పష్టమైన ఆదేశాలిచ్చారు

» 996 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు నిర్దేశం: నిమ్మల

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. వచ్చే వారంలో ఆయన ప్రాజెక్టును సందర్శించి.. దాని నిర్మాణానికి సంబంధించిన టైం షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. అది ప్రకటించిన తర్వాత ఒక్క రోజు గానీ, ఒక్క గంట కానీ వృథా కాకూడదని నిర్దేశించారు' అని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జలవనరుల శాఖపై సీఎం సమీక్ష అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం, ఇతర సాగునీటి ప్రాజెక్టులు, నదుల అనుసంధానం, వాటర్ పాలసీపై సీఎం సమీక్షించారని.. పోలవరం ఆర్ అండ్ ఆర్, భూసేకరణకు సంబంధించి రూ.996 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు ఆదేశాలిచ్చారని తెలిపారు. 'పోలవరం ప్రాజెక్టుపై 10 రోజుల్లో మరింత స్పష్టతతో షెడ్యూల్ తయారు చేస్తాం. ఇప్పటికే ప్రాజెక్టుల డిజైన్లకు సూత్రప్రాయంగా అనుమతులు లభించాయి. సాంకేతిక సమస్యలను అధిగమించి, ముందుకు వెళ్తున్నాం. కచ్చితంగా ప్రాజెక్టును పూర్తి చేసి ఉత్తరాంధ్ర, రాయలసీమకు నీరు అందిస్తాం. తాత్కాలిక ప్రయోజనాలు కాకుండా, దీర్ఘకాల ప్రయోజనాలతో ప్రతి ఎకరాకు సాగు నీరు, ప్రతి గ్రామానికి తాగునీరు ఇచ్చేలా వాటర్ పాలసీ తీసుకొచ్చాం. ఇటీవలి వర్షాలు, వరదలకు 11 వేల టీఎంసీల నీళ్ల ప్రాజెక్టులకు వచ్చినా.. 954 టీఎంసీలే వాడుకోగలిగాం. కరువు కాటకాలు వచ్చినప్పుడు రాష్ట్రాన్ని కాపాడటానికి, వాన నీరు వృథా కాకుండా ఈ విధానాన్ని రూపొందించాం. గోదావరి-కృష్ణా-బనకచర్ల ప్రాజెక్టు గేమ్ చేంజర్ కాబోతోంది. నదుల అనుసంధానానికి 2-3 ఏజెన్సీలతో తక్కువ ఖర్చుతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు' అని వివరించారు. జగన్ ప్రభుత్వ విధ్వంసకర విధానాలతో రాష్ట్రానికి నష్టం కంటే ద్రోహమే ఎక్కువ జరిగిందని నిమ్మల ధ్వజమెత్తారు. ఐదేళ్లలో హంద్రీ-నీవా ప్రాజెక్టుకు రూ.5 కూడా కేటాయించలేదని విమర్శించారు. 'ఈ ప్రాజెక్టుకు ఈ నెలలోనే టెండర్లు పిలుస్తాం. వచ్చే నెలలోగా ప్రధాన కాలువ, లైనింగ్ పనులు మొదలుపెడతాం. చింతలపూడి ఎత్తిపోతల కూడా గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తి కాలేదు. వెలిగొండ ప్రాజెక్టు విషయంలోనూ మొద్దు నిద్రపోయారు. దీనిని పూర్తి చేయాలంటే రూ.3 వేల కోట్లు పెట్టాల్సిన పరిస్థితి తెచ్చారు. మొన్న ఎన్నికల సమయంలో రైతులను ప్రాజెక్టు దగ్గరకు రానివ్వకుండా.. దానిని అంకితం చేస్తున్నామని అసత్యాలు ప్రచారం చేశారు. 2026 జూన్ కల్లా వెలిగొండ ప్రాజెక్టుకు నీరు తెచ్చే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది' అని చెప్పారు.

ఎంఎస్ఎంఈలుగా ఎస్‌హెచ్‌జీలు

» ఈ ఏడాది కనీసం లక్ష రిజిస్ట్రేషన్లు చేయాలి: ముఖ్యమంత్రి

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలు ఆర్థిక పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సెర్ప్, మెప్మా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయ సంఘాలను వాటి ఆదాయం ప్రకారం ఐదు కేటగిరీలుగా విభజించాలని సూచించారు. ఏడాదికి రూ.లక్ష కన్నా తక్కువ ఆదాయం వచ్చే గ్రూపును నాన్ లఖ్‌పతిగా, రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు లఖ్‌పతి, రూ.10 లక్షలపైన సంపాదిస్తే మైక్రో, రూ.50 లక్షల కన్నా అధికంగా వస్తే స్మాల్, రూ.కోటి కన్నా ఎక్కువ ఆర్జిస్తే మీడియం కేటగిరీగా విభజించాలని నిర్దేశించారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం వారీగా ఆదాయ వివరాలు ఉండాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలను ఎంఎస్ఎంఈలుగా రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, తద్వారా వివిధ పథకాల కింద కేంద్రం అందించే ప్రోత్సాహకాలతో ఆయా సంఘాలకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం లక్ష ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎల్లుండి మళ్లీ అల్పపీడనం?

విశాఖపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావం నుంచి బాధితులు ఇంకా కోలుకోక ముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఈనెల 6, 7 తేదీల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు మంగళవారం వెల్లడించారు. ఇది బలపడి శ్రీలంక తీరం దిశగా వెళుతుందని అంచనా వేశారు. రానున్న రెండు రోజుల్లో దీనిపై స్పష్టత రానుందన్నారు. కాగా, మూడు రోజుల క్రితం తీరం దాటిన ఫెంగల్ తుఫాన్ బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా మారి మంగళవారం అరేబియా సముద్రంలోకి ప్రవేశించింది. అయినప్పటికీ రాష్ట్రాన్ని వర్షాలు వదలడం లేదు. తుఫాన్ ప్రభావంతో సముద్రం నుంచి భారీగా తేమ రావడంతో తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు ప్రకాశం జిల్లా కనిగిరిలో 97, చిత్తూరు జిల్లా కటికిపల్లిలో 84, పెనుమూరులో 82, అనంతపురం జిల్లా ఈస్టు కందిపల్లిలో 82, తిరుపతి జిల్లాలో పాకాలలో 71, చిత్తూరు జిల్లా అరగొండలో 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం నాగేంద్రపురంలో 73, శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలో 71 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల, ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. తరువాత రెండు, మూడు రోజులు కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని వివరించారు.

ఈసారి చలి తక్కువే: వాతావరణ శాఖ

విశాఖపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రస్తుతం చలి తక్కువగానే ఉంది. డిసెంబరు నెల ప్రవేశించినా అనేక ప్రాంతాల్లో ఎముకలు కొరికే చలి ఏమీ లేదు. నవంబరులో అనేక ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఉత్తర, వాయవ్య, తూర్పు భారతంలో చలిగాలులు వీచే వాతావరణం ఏర్పడలేదు. ఇంచుమించు అటువంటి వాతావరణమే డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకూ మూడు నెలల శీతాకాలంలో కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాల్లో తప్ప దేశంలో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని తెలిపింది. అంటే గజగజ వణికించే వాతావరణం తక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. వాతావరణంలో మార్పుల ప్రభావంతోనే చలిగాలుల తీవ్రత తగ్గిందన్నారు. అయితే పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న తటస్థ పరిస్థితులు ఈ నెలాఖరు లేదా జనవరిలో 'లానినా'గా మారే అవకాశం ఉందన్న అంచనా నేపథ్యంలో జనవరిలో చలి స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని విశ్లేషించారు.

నిండుతున్న తిరుమల జలాశయాలు



తిరుమలలో పూర్తిగా నిండిన గోగర్భం జలాశయం

తిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా తిరుమలలోని జలశయాలన్నీ నిండిపోతున్నాయి. వారం నుంచి పలు దఫాలుగా వర్షం కురిసింది. తుఫాన్ కూడా తోడవడంతో గత మూడురోజుల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడ్డాయి. అడవుల్లో కురిసిన వర్షం నీరు పిల్ల కాలువల ద్వారా తిరుమలలోని ఐదు జలాశయాల్లో చేరింది. దీంతో గోగర్భం డ్యాం పూర్తిస్థాయిలోనూ, మిగిలిన నాలుగు డ్యాములు దాదాపు 90 శాతం నిండాయి. రెండు నెలల క్రితం తిరుమలలో నీటి కొరత సమస్య ఏర్పడనుందనే భయంతో టీటీడీ అధికారులు నీటి సరఫరా విషయంలో అనేక ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తిరుపతి నుంచి నీరు తీసుకురావలసిన అవసరం లేకుండానే వర్షాలకు జలాశయాలన్నీ నిండుకుండల్లా మారడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతమున్న నీటితో 270 రోజులపాటు తిరుమల నీటి అవసరాలు తీరుతాయని అంచనా.

తిరుమలలోని డ్యామ్‌ల సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ వివరాలు లక్షల గ్యాలన్లలో..


జలాశయం	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240	5,192
కుమారధార	4,258	3,440
పసుపుధార	1,287	966
గోగర్భం	2,833	2,833
ఆకాశగంగ	685	645

60 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు

» రాష్ట్ర వ్యాప్తంగా చిన్నారులకు హెల్త్ స్క్రీనింగ్.. మార్గదర్శకాలు విడుదల

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బాలల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. చిన్నారులకు పుట్టుకతో వచ్చిన అనారోగ్య సమస్యలు, పోషకాహార లోపం, ఇతర అనారోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ఆరోగ్య పరీక్షలు చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా రాష్ట్రంలోని 60 లక్షల పైగా చిన్నారులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని నిర్ణయించింది. స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047 లక్ష్యాల్లో చిన్నారుల ఆరోగ్యం కూడా ముఖ్యమైన అంశంగా ఉంది. ఇందులో భాగంగా చిన్నారుల ఆపాదమస్తకం ఏ చిన్న అనారోగ్య సమస్య ఉన్నా గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. "ఏ చిన్నారి అనారోగ్యాన్ని వదలొద్దు.. ముందుగానే గుర్తించండి" అనే నినాదంతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హెల్త్ స్క్రీనింగ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. చిన్నారుల హెల్త్ స్క్రీనింగ్ రెండు దశల్లో చేస్తారు. తొలుత క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చిన్నారులకు గురువారం, శనివారం మధ్యాహ్నం నుంచి స్క్రీనింగ్ చేయనున్నారు. ఈ స్క్రీనింగ్‌లో అనారోగ్య సమస్యలున్న చిన్నారులను గుర్తిస్తే వారి వద్దకు మెడికల్ ఆఫీసర్ వెళ్లి రెండో విడత స్క్రీనింగ్ నిర్వహిస్తారు. అప్పటికీ నయం కాకపోతే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంట్రవెన్షన్ సెంటర్‌కు పంపిస్తారు. డీఈఐసీకి వచ్చే చిన్నారుల ప్రమాణ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ప్రతి ఆరు నెలలకు ఓసారి చిన్నారులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని ఆరోగ్యశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశా, సీహెచ్‌ఎంలు మెడికల్ ఆఫీసర్లు, స్కూల్ హెల్త్ కో-ఆర్డినేటర్లు, ఆర్‌బీఎస్‌కే పీవో ఎలాంటి విధులు నిర్వహించాలన్న దానిపై మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇందులో ఆరోగ్యశాఖతో పాటు పాఠశాల విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలకు కూడా పూర్తి బాధ్యతలు అప్పగించింది.

అమరావతి నిర్మాణానికి రూ.కోటి విరాళం



అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లో నివాసం ఉంటున్న పీ విజయలక్ష్మి రూ.కోటి విరాళంగా ఇచ్చారు. మంగళవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి, ఆమె చెక్కు అందజేశారు. ఆమెను ఆయన అభినందించారు.

పట్టాలున్నా... పత్తాలేరు!

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. అందులో ఎక్కువ మంది వైసీపీ నేతల అనుచరులు, వారి సొంత మనుషులే ఉన్నట్లు గుర్తించారు. ఇప్పుడు వారు పట్టాలు పుచ్చుకుంటే గుట్టు రట్టవుతుందని, అల్లరైపోతామనే మౌనంగా ఉన్నట్లు భావిస్తున్నారు. దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అంశంపై చర్చలు జరుపుతున్నారు.

మిగిలినవైనా పద్ధతిగా చేశారా?

'ఇళ్లు కాదు... ఊళ్లు కట్టాం. 28 లక్షల పట్టాలు ఇచ్చాం' అని జగన్ గొప్పగా చెప్పుకొన్నారు. ఇందులో 9.2 లక్షల మంది 'లబ్ధిదారుల' ఆచూకీ గల్లంతైనట్లు తేలింది. మరి... మిగిలిన 18.8 లక్షల పట్టాలైనా జగన్ ప్రభుత్వం ఇచ్చిందా అంటే అదీ లేదు. అందులో 6.5 లక్షల మంది టిడ్కో, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీమ్‌ల పరిధిలోని లబ్ధిదారులని స్పష్టమైంది. వీరిని కూడా జగన్ 'నవరత్నాల'లో కలిపేశారు. పట్టా తీసుకోకుండా పత్తాలేకుండా పోయిన 9.2 లక్షల మంది... ఇతర పథకాల ద్వారా ఎంపిక చేసిన 6.5 లక్షలమందిని తీసేస్తే... అచ్చంగా జగన్ ఇంటిపట్టాలు ఇచ్చింది 12 లక్షల మందికే. వీరిలో ఎంతమంది అనర్హులున్నారు, ఎందరికి నివాస యోగ్యమైన స్థలాలు దక్కాయన్నది మరో పెద్ద ప్రశ్న! ఎందుకంటే... చెరువులు, ఆవ భూములు, కొండల్లోనూ సెంటు స్థలాలు ఇచ్చేశారు!

భారీగా ఫిర్యాదులు...

జగనన్న కాలనీల పేరిట... అక్కరకు రాని భూములకూ అడ్డగోలుగా చెల్లింపులు చేసిన వైనంపైనా సీఐడీ దృష్టిసారించింది. 2019-2024 కాలంలో జగన్ సర్కారు పేదలకోసం 32 వేల ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఇందుకోసం 24వేల కోట్ల రూపాయల వ్యయం చేసింది. ఇంత ఖర్చుపెట్టి పేదలకు సగటున సెంటు స్థలమే ఇంటికోసం ఇచ్చింది. అందులోనూ అనర్హులు, వైసీపీ నేతలు, బినామీలకు భారీగా పట్టాలు ఇచ్చేశారనే అనుమానాలను బలపరిచేలా... పెద్దసంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. కూటమి సర్కారుకు ఇప్పటిదాకా 8700 ఫిర్యాదులు అందాయి. అందులో వైసీపీ నేతలు, వారి బినామీలకే జగనన్న కాలనీల్లో అసైన్డ్ ఇంటి స్థలాలు ఇచ్చారని 4200 ఫిర్యాదులున్నాయి. విశాఖ, విజయనగరం, కృష్ణా, గుంటూరు, కడప, అనంతపురం, కర్నూలు తదితర జిల్లాల నుంచే ఈ ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. వీటిపై రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయిలో ఆరాతీయగా అనర్హులకు పట్టాలు ఇచ్చారని గుర్తించింది. అంతకుముందే పేదింటి స్థలాలు పొందిన వారు, అధిక ఆదాయం ఉన్నవారికి పట్టాలు ఇచ్చినట్లు ప్రాథమికంగా తేల్చారు. ఈ మొత్తం వ్యవహారంపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఇందులో భారీగా గోల్‌మాల్ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. విచారణ బాధ్యతను సీఐడీకి అప్పగిస్తారా లేక విజిలెన్స్ విభాగంతో చేయిస్తారా అనే అంశంపై రెవెన్యూ శాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

3 మండలాల్లో సీఐడీ సోదాలు

జగనన్న ఇంటిస్థలాల పేరిట భారీగా భూములు కొన్న మండలాలపై సీఐడీ దృష్టిసారించినట్లు తెలిసింది. అనకాపల్లి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని రెవెన్యూ ఆఫీసుల్లో మంగళవారం సీఐడీ అధికారుల బృందాలు సోదాలు జరిపినట్లు సమాచారం. డీఎస్పీ నాగేంద్ర భూపాల్ నేతృత్వంలో రెవెన్యూ ఆఫీసుల్లో రికార్డుల పరిశీలన జరిగినట్లు తెలిసింది.

అత్యవసర సేవల కిందకు 104 వాహనాలు



అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న 104 మొబైల్ మెడికల్ యూనిట్ సర్వీస్‌ను కూడా ప్రభుత్వం అత్యవసర సేవల పరిధిలోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 104 మొబైల్‌మెడికల్ యూనిట్‌లు తొలి నుంచి అత్యవసర సేవల కిందనే ఉన్నాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వాటిని అత్యవసర సేవలుగా గుర్తించలేదు. ఇప్పుడు తిరిగి వాటిని ఆ పరిధిలోకి తెచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.